ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 26.08.2026 | సంపుటి : 13 సంచిక : 37 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# మూసీ భూసేకరణ వేగవంతం చేయండి

**ప్రాజెక్టుపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు**



మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలోని బోధి పెవెలియన్‌లో మూసీ ప్రాజెక్టుపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- ల్యాండ్ పూలింగ్‌పైన స్పష్టమైన విధానం రూపొందించుకోవాలి
- ఎఫ్టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణ కోసం స్పష్టమైన విధానం తయారు చేసుకోవాలి
- పనుల్లో ఆలస్యం సరికాదు.. నిర్ణీత సమయంలోగా ప్రాజెక్టులు పూర్తి చేయాలి
- న్యాయపరమైన చిక్కులు లేకుండా చూసుకోవాలి
- ప్రాజెక్టుపై సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్(జనంసాక్షి): మూసీ ప్రాజెక్టు ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలోని బోధి పెవెలియన్‌లో మూసీ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష జరిపారు. మూసీ ప్రాజెక్ట్ కోసం భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సీఎం తెలిపారు. ల్యాండ్ పూలింగ్‌తో పాటు ఎఫ్‌టఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణపై స్పష్టమైన విధానం తయారు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. భూసేకరణలో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా జాగ్రత్త తీసుకోవాలని చెప్పారు. మూసీ ప్రాజెక్టు రెండో దశకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. మంచిరేవుల ఓంకారేశ్వరస్వామి ఆలయ నిర్మాణం కోసం వెంటనే టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల కోసం తక్కువ వడ్డీకి రుణాల సమీకరణపై దృష్టి పెట్టాలని జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్లకు దిశానిర్దేశం చేశారు. కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్కుకు మరింత ప్రచారం కల్పించాలన్నారు. టీడీఆర్‌పై ప్రతీ వారం సమీక్ష జరగాలని సీఎం స్పష్టం చేశారు. సమీక్షలో ఉన్నతాధికారులు మాణిక్ రాజ్, సర్ఫరాజ్ అహ్మద్, ఆర్వీ కర్ణన్, వినయ్ కృష్ణా రెడ్డి, సృజన, నారాయణ రెడ్డి, మను చౌదరి, నరసింహా రెడ్డి, గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

ప్రవక్త సందేశాలు సమాజానికి ఎల్లప్పుడూ ఆదర్శప్రాయం
ముస్లిం సోదరులకు సీఎం రేవంత్ రెడ్డి 'మిలాద్ ఉన్ నబీ' పండుగ శుభాకాంక్షలు



# ప్రభుత్వ ధాన్యానికి మిల్లర్ల కన్నం

## సీఎంఆర్‌లో భారీ గోల్‌మాల్

## అక్రమాలపై విజిలెన్స్ కొరడా

**రైతు పండించాడు.. ప్రభుత్వం కొన్నది.. మిల్లర్‌కు అప్పగించింది. బియ్యం మాత్రం మాయమైంది. కస్టమ్ మిల్లింగ్ పేరుతో ప్రభుత్వ ధాన్యంపై మిల్లర్ల మాయాజాలం సాగిందా? విజిలెన్స్ తనిఖీల్లో లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొరతగా బయటపడటం, దాని విలువ కోట్లకుపైగా ఉండటం వ్యవహారం తీవ్రతను వెల్లడిస్తోంది. రికార్డుల్లో ఒక లెక్క, గోదాముల్లో మరో లెక్క కనిపించడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వానికి చేరాల్సిన సీఎంఆర్ బియ్యం ఎక్కడికి వెళ్లింది? మాయమైన ధాన్యం వెనుక అసలు కథ ఏమిటి? మిల్లర్లతో పాటు పర్యవేక్షణ వ్యవస్థలో ఎవరి పాత్ర ఉంది? పూర్తిస్థాయి దర్యాప్తుతోనే ఈ ప్రశ్నలకు సమాధానం దొరకనుంది.**

- రాష్ట్రవ్యాప్తంగా తాజా తనిఖీల్లో 89 మిల్లుల్లో 3.72 లక్షల టన్నుల ధాన్యం గల్లంతు
- 21 జిల్లాల్లో తనిఖీలు.. 28 కేసులు.. 26 మంది అరెస్టు
- రూ.927 కోట్ల విలువైన ధాన్యంపై లెక్కల మాయాజాలం
- ప్రభుత్వ ధాన్యం తీసుకుని బియ్యం ఇవ్వలేదన్న ఆరోపణలు
- కస్టమ్ మిల్లింగ్ బియ్యం వ్యవహారంలో భారీగా బయటపడుతున్న లెక్కల తేడాలు

హైదరాబాద్, ఆగస్టు 25 (జనంసాక్షి): తెలంగాణలో రైస్ మిల్లుల వ్యవహారం కలకలం రేపుతోంది. ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం మిల్లర్లకు అప్పగిస్తే.. దానికి బదులుగా ప్రభుత్వానికి చేరాల్సిన బియ్యం పూర్తిస్థాయిలో రాకపోవడం, ధాన్యం పక్కదారి పట్టడం, రికార్డుల్లో చూపిన నిల్వలకు భౌతిక నిల్వలకు భారీ తేడాలు ఉండటం వంటి అంశాలు వరుస విజిలెన్స్ తనిఖీల్లో వెలుగులోకి వస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న తనిఖీల్లో 89 రైస్ మిల్లుల్లో 3,72,693 మెట్రిక్ టన్నుల ధాన్యం లెక్కల్లో కనిపించలేదని విజిలెన్స్ అధికారులు గుర్తించినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ వ్యవహారంలో గుర్తించిన ధాన్యం విలువను సుమారు రూ.927.16 కోట్లుగా పేర్కొన్నారు. కస్టమ్ మిల్లింగ్ బియ్యం వ్యవహారంలో గత కొన్నేళ్లకు సంబంధించిన విస్తృత లెక్కలు మరింత భారీగా ఉన్నాయి. ఐతే, 21 జిల్లాల్లో అక్రమాలు గుర్తించగా.. 3,72,693.23 మెట్రిక్ టన్నుల ధాన్యం లెక్కల్లో లేదు. ఇందులో 1,84,669.88 మెట్రిక్ టన్నులు సీఎంఆర్ ధాన్యం. 1,88,023.35 మెట్రిక్ టన్నులు వేలం ధాన్యం. వీటి మొత్తం విలువ రూ.927.16 కోట్లు కాగా, సుమారు రూ.715 కోట్లు రికవరీ చేసినట్లు అధికారులు పేర్కొన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. 50 మంది నిందితులకుగానూ 28 క్రిమినల్ కేసులు నమోదు చేసి, 26 మందిని అరెస్టు చేశారు.

### రూ.13 వేల కోట్లకుపైగా అక్రమాల ఆరోపణలు

కస్టమ్ మిల్లింగ్ బియ్యం వ్యవహారంలో తెలంగాణలో సుమారు రూ.13 వేల కోట్లకు పైగా విలువైన అక్రమాలు, లెక్కల తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ వ్యవహారంలో మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడం, మిగతా 2లో..

# గీత దాటారు.. వేటు వేయండి

**కొండా సురేఖ, చిన్నారెడ్డిపై క్రమశిక్షణ కమిటీ కఠిన సిఫారసులు**

**పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారన్న నిర్ధారణ..**

**అధిష్టానం నిర్ణయంపై ఉత్కంఠ**



హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలపై అధిష్టానం కఠిన వైఖరి అవలంబిస్తోంది. మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి వ్యవహారంలో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ తన నివేదికను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు సమర్పించింది. ఇద్దరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ సిఫారసు చేసినట్లు తాజా సమాచారం. కొండా సురేఖ విషయంలో ఆమె కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించకపోవడాన్ని క్రమశిక్షణ కమిటీ తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. షోకాజ్ నోటీసుకు సురేఖ ఇచ్చిన వివరణతో కమిటీ సంతృప్తి చెందలేదని సమాచారం. పార్టీ, ప్రభుత్వం, ముఖ్యమంత్రి నాయకత్వంపై వచ్చే వ్యాఖ్యలను ఒక మంత్రి ఖండించాల్సిన బాధ్యత ఉందన్న అభిప్రాయానికి కమిటీ వచ్చినట్లు వార్తలు వెలువడ్డాయి. ఇక మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి కూడా పార్టీ ప్రయోజనాలకు విరుద్ధంగా బహిరంగ వ్యాఖ్యలు చేశారన్న అభియోగాన్ని కమిటీ పరిగణనలోకి తీసుకుంది. పార్టీ అంతర్గత సమస్యలను నాయకత్వం దృష్టికి తీసుకెళ్లకుండా బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం క్రమశిక్షణ ఉల్లంఘనగా కమిటీ భావించినట్లు సమాచారం. ఆయన వివరణ కూడా కమిటీని సంతృప్తిపరచలేదని తెలుస్తోంది.

### మంత్రి పదవికి ఎసరు?

క్రమశిక్షణ కమిటీ సిఫారసుల్లో కొండా సురేఖను మంత్రి పదవి నుంచి మిగతా 2లో..



# యుద్ధ ప్రాతిపదికన దేవాదుల పూర్తి చేస్తాం

- ప్రాజెక్ట్‌ను ఫాస్ట్ ట్రాక్‌పై పూర్తి చేస్తాం
- ప్రతి సమస్యను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని సీఎం ఆదేశించారు
- భూసేకరణ, ఆర్అండ్ఆర్, అటవీ అనుమతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- మంత్రి ఉత్తమ్ ఉన్నత స్థాయి సమీక్ష

హైదరాబాద్(జనంసాక్షి): ఏడాదిలోగా దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్ట్ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికాలను ఆదేశించారు. దేవాదుల ప్రాజెక్ట్‌పై మంత్రి ఉత్తమ్ అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రులు పొంగులేటి సీతక్క, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సంబంధిత అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రెండు దశాబ్దాల నిరీక్షణకు తెరదించేలా దేవాదులను ఫాస్ట్ ట్రాక్ పై పూర్తి చేస్తామని అన్నారుదేవాదుల పూర్తికి అడ్డుగా ఉన్న ప్రతి సమస్యను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో భూసేకరణ, ఆర్అండ్ఆర్, మిగతా 2లో..

# ఇందిరమ్మ అర్హుల జాబితా తయారు

- క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్ల డ్రా తేదీలు ఖరారు
- 27, 28, 29, 30 తేదీల్లో డ్రా ద్వారా ఇళ్ల కేటాయింపు
- టవర్ల నిర్మాణానికి టెండర్లు పూర్తి
- మంత్రి పొంగులేటి సమీక్ష

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్లకు 40,900 మంది అర్హులను గుర్తించినట్లు రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఈ నెల 27 నుంచి నాలుగు రోజుల పాటు లాటరీ ద్వారా ఇళ్లు కేటాయించనున్నట్లు చెప్పారు. ఇళ్లు రాని వారికి రూ.10 వేలు తిరిగి ఇస్తామని మంత్రి తెలిపారు. టవర్ల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. ఎల్బీనగర్, గోషామహల్, నాంపల్లి, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్ల కోసం సెప్టెంబరు 3 వరకు దరఖాస్తు చేసుకోవాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇందిరమ్మ టవర్ల నిర్మాణం, దరఖాస్తులు, లాటరీ ప్రక్రియపై సచివాలయంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. క్యూర్‌లోని 16 నియోజకవర్గాల్లో రూ.807 కోట్ల 40 లక్షలతో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్ల కోసం 60,720 మంది దరఖాస్తు చేశారు. దరఖాస్తుల్లో 40,900 మంది అర్హులు 19,820



అనర్హులుగా తేలినట్లు మంత్రి తెలిపారు.

**డ్రా రాకుంటే రూ.10 వేల తిరిగి ఇస్తాం**

అర్హులకు ఈ నెల 27 నుంచి 30 వరకు వివిధ ప్రాంతాల్లోని ఫంక్షన్‌హాళ్లలో దరఖాస్తుదారుల సమక్షంలో పారదర్శకంగా డ్రా ద్వారా ఇండ్లు కేటాయించనున్నారు. ఈ నెల 27న రాయదుర్గం, కేపీహెచ్‌బీ కాలనీ, మైలార్‌దేవ్‌పల్లి, రెడ్ హిల్స్ 28వ తేదీన కౌకూర్, పాటిగడ్డ, జల్‌పల్లి, కుల్సుంపురాలో లాటరీ ప్రక్రియ ఉంటుందని మంత్రి తెలిపారు. ఈ నెల 29న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీ, బోయిన్‌పల్లి, బండ్లగూడ ఎల్ఐజీ కాలనీ, నందిముసలిగూడలో 30వ తేదీన గాజుల రామారం, మిగతా 9లో..



# హైదరాబాద్‌లో నకిలీ డాక్టర్ల అరెస్టు

హైదరాబాద్(జనంసాక్షి): నకిలీ ధ్రువపత్రాలతో వైద్యులుగా చలామణి అవుతోన్న 12 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ జోన్లలో ప్రత్యేక ఆపరేషన్ పేరిట పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అర్హత లేకున్నా క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు సెలైన్లు, ఇంజక్షన్లు, మందులు ఇస్తున్నట్లు గుర్తించినట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ తెలిపారు. పారామెడికల్ కోర్సు చేసిన ఓ మహిళ అనుమతులు లేకుండా నాలుగేళ్లుగా క్లినిక్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. పట్టుబడిన 12 మంది నకిలీ వైద్యులను అదుపులోకి తీసుకుని పెద్ద ఎత్తున సెలైన్ బాటిళ్లు, బీపీ పరికరాలు, సర్జికల్ కత్తెరలు మందులను స్వాధీనం చేసుకున్నారు.

## మంత్రివర్గ విస్తరణ దిశగా

# సర్కారు అడుగులు

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు మంత్రి పదవి?
- భట్టి విక్రమార్కకు స్పీకర్ బాధ్యతలు.. కొండా సురేఖకు ఉద్వాసనపై ఊహాగానాలు
- రేసులో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేరు.. గరిష్టంగా మరో ఇద్దరికి..



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణపై మరోసారి రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేయడంతో పాటు, అవసరమైతే కొందరు మంత్రుల శాఖల్లో మార్పులు, ఒకరిద్దరి స్థానాల్లో కొత్తవారికి అవకాశం కల్పించే అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలోనూ మంత్రివర్గ విస్తరణపై 3?4 మంది ఎమ్మెల్యేల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ప్రస్తుతం ముఖ్యమంత్రితో కలిపి తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో 16 మంది ఉన్నారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాష్ట్ర మంత్రివర్గ పరిమాణం శాసనసభ మొత్తం సభ్యుల సంఖ్యలో 15 శాతానికి మించకూడదు. తెలంగాణ శాసనసభలో 119 మంది సభ్యులు ఉండటంతో గరిష్టంగా 18 మంది వరకు మంత్రివర్గంలో ఉండే అవకాశం మిగతా 2లో..

## 365 బీబీ హైవే అభివృద్ధికి


# కేంద్రం పచ్చజెండా

- రహదారి ఉన్నతీకరణ కోసం రూ.840.41 కోట్లతో ఆమోదం
- వివరాలు వెల్లడించిన కేంద్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి 365బీబీ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బుట్టాయగూ డెం-ఎల్ఎన్‌డీ పేట, పట్టిసీమ-కొవ్వూరు సెక్షన్ల మధ్య 45.09 కిలోమీటర్లతో రహదారి ఉన్నతీకరణ కోసం రూ.840.41 కోట్లతో కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. 45 కిలోమీటర్ల 2 లేన్ల జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్లు నిర్మించనున్నట్లు గడ్కర్ తెలిపారు. ఈ రహదారి మిగతా 9లో..

# కులగణనపై కొత్త ప్రశ్నావళి రూపొందించండి

- రాహుల్, ఖర్గే అభ్యంతరం
- తెలంగాణ మోడల్‌లో ప్రక్రియ నిర్వహించాలి
- జనగణనలో కులగణన విధానం సరిగా లేదు
- ప్రశ్నావళి మార్చేందుకు అఖిలపక్షం ఏర్పాటు చేయాలి
- ఈ మేరకు ప్రధాని ఇరువురి లేఖ







న్యూఢిల్లీ,ఆగస్టు 25(జనంసాక్షి): జనగణన పద్ధతిపై కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మంగళవారం ఖర్గే, రాహుల్ సుదీర్ఘ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. కులగణలో తెలంగాణ మోడల్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనగణనలో కులాల నమోదుకు 'ఓపెన్-ఎండెడ్' విధానాన్ని అమలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కులాల లెక్కింపు విధానాలతో తీవ్ర నష్టం జరుగుతోందని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. 'ఒకే కులం వేర్వేరు పేర్లతో విడిపోయి లక్షలాది కులాల పేర్లుగా నమోదవుతాయని.. దీనివల్ల లెక్కింపు డేటా పూర్తిగా నిరుపయోగంగా మారుతుందని మిగతా 9లో..

## ప్రవక్త సందేశాలు సమాజానికి ఎల్లప్పుడూ ఆదర్శప్రాయం

ముస్లిం సోదరులకు సీఎం రేవంత్ రెడ్డి 'మిలాద్ ఉన్ నబీ' పండుగ శుభాకాంక్షలు

హైదరాబాద్(జనంసాక్షి):'మిలాద్ ఉన్ నబీ' పండుగ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లిం సోదర, సోదరీమణులకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకునే ఈ పవిత్ర దినం ముస్లింలకు ఎంతో విశిష్టమైనదని పేర్కొన్నారు. ప్రవక్త మహ్మద్ బోధించిన శాంతి, ప్రేమ, సోదరభావం, కరుణ, మానవత్వం, ధర్మబద్ధమైన జీవన విధానం సమాజానికి ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని ముఖ్యమంత్రి అన్నారు. ఆయన సందేశాలు ప్రపంచ శాంతి, సామరస్యానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ముస్లిం మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా పాలనలో తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని సీఎం స్పష్టం చేశారు. ముస్లింల సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. మిలాద్ ఉన్ నబీ ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సంతోషం, సౌభ్రాతృత్వాన్ని నింపాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## యుద్ధ ప్రాతిపదిన దేవాదుల పూర్తి చేస్తాం

అటవీ అనుమతుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయిన చోట నిధుల విడుదలలో ఒక్కరోజు కూడా జాప్యం ఉండొద్దని పేర్కొన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ తదితర అవసరాలకు రూ.6,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీకి సీఎం హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఈ రూ.6,000 కోట్లలో ఇప్పటికే సుమారు రూ.2,500 కోట్లు విడుదల అయినట్లు ఉత్తమ్ తెలిపారు.నిధులు విడుదల చేయడమే కాకుండా ఆ పరిహారం రైతుల చేతికి సకాలంలో చేరడం కూడా తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. కలెక్టర్లు, నీటిపారుదల ఇంజినీర్లు సమన్వయంతో పనిచేసి భూసేకరణ సమస్యలు పరిష్కరించాలన్నారు. దేవాదుల ద్వారా సుమారు 38 టీఎంసీల గోదావరి జలాలను ఎత్తిపోసి.. దాదాపు ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే తమ లక్ష్యమన్నారు. ఇందుకు అందుబాటులో ఉన్న పంపింగ్ వ్యవస్థలన్నింటినీ పూర్తి సామర్థ్యంతో వినియోగించాలని ఆదేశించారు.

## గీత దాటారు.. వేటు వేయండి

తొలగించాలన్న అంశం కూడా ఉన్నట్లు పలు వార్తా సంస్థలు పేర్కొన్నా యి. ఇది అమలైతే తెలంగాణ మంత్రివర్గ పున ర్వ్యవస్థీకరణకు మరింత ప్రాధాన్యత ఏర్ప డనుంది. ఇప్పటికే కేబినెట్‌లో మార్పులు, కొత్తవారికి అవకాశం కల్పించడంపై కాంగ్రెస్‌లో చర్చ జరుగుతున్న నేపథ్యంలో సురేఖపై చర్య రాజకీయంగా కీలక పరిణామంగా మారనుంది.

**అధిష్ఠానం చేతిలో తుది నిర్ణయం**

క్రమశిక్షణ కమిటీ నివేదిక సమర్పించినప్పటికీ తుది నిర్ణయం మాత్రం కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకోవాల్సి ఉంది. పార్టీ క్రమశిక్షణకు గీత దాటితే ఎవరినీ ఉపేక్షించబోమన్న సంకేతాన్ని ఈ వ్యవహారం ద్వారా నాయకత్వం ఇవ్వాలని భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత కొద్ది రోజులుగా కాంగ్రెస్‌లో బహిరంగ వ్యాఖ్యలు, అంతర్గత విభేదాలు తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో ఈ చర్యలు పార్టీకి కీలక సందేశంగా మారనున్నాయి.సురేఖపై మంత్రి పదవి నుంచి తొలగింపు, చిన్నారెడ్డిపై పదవి నుంచి తొలగింపు లేదా ఇతర క్రమశిక్షణ చర్యలు ఉంటాయా? అన్నది ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో ఉత్కంఠ రేపుతోంది. అధిష్ఠానం తీసుకునే నిర్ణయంపైనే తదుపరి రాజకీయ పరిణామాలు ఆధారపడి ఉన్నాయి.

## విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు

- ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి
- సీఎం రేవంత్‌కు బాధ్యతారాహిత్యం కూడదు
- బీజేపీ సభలో ఎంపీ ఈటల రాజేందర్ విమర్శలు
- స్వల్పంగా దెబ్బతిన్న రామచంద్ర రావు ఆరోగ్యం



హైదరాబాద్,ఆగస్టు 25(జనంసాక్షి): 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి అంటే అర్థం ఏంటో తెలుసా అని ప్రశ్నించారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల గురించి ఆలోచించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిదేనని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. 'ఫీజు బకాయి – భాజపా లడాయి' పేరుతో భాజపా చేపట్టిన కార్యక్రమంలో ఈటల పాల్గొని మాట్లాడారు. సీఎం ఒకసారి రాష్ట్రంలోని విద్యార్థుల పరిస్థితి గురించి ఆలోచించాలన్నారు. 20లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడే బాధ్యతను భాజపా తీసుకుందని పేర్కొన్నారు. 'నా విద్యార్థులు, నా యువత క్వాలిటీగా ఉండాలి.. ఆరోగ్యవంతులుగా ఉండాలి' అని కలలు కంటున్న నాయకుడు నరేంద్ర మోదీ అని వివరించారు. పేద తల్లిదండ్రుల పిల్లలు కూడా గొప్పగా చదువుకొని డాక్టర్లు, ఇంజనీర్లు, అడ్వకేట్లు, ఉన్నతాధికారులు కావాలని కలలు కంటున్నారని, అదే నిజమైన తెలంగాణ అభివృద్ధిగా పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం రామచందర్ రావు చేస్తున్న ఈ 48 గంటల దీక్షకు బీజేపీ అండగా ఉందన్నారు. ఫీజుల బకాయిలు చెల్లించే వరకు.. తెలంగాణ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు భాజపా పోరాటం కొనసాగుతుందని తెలిపారు. నిరాహార దీక్ష చేస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అస్వస్థతకు గురయ్యారు. రామచందర్ రావును పరీక్షించిన వైద్యులు.. బీపీ 90/60గా ఉన్నట్లు తెలిపారు.'ఫీజు బకాయి–భాజపా లడాయి' పేరుతో భాజపా నేతలు రెండో రోజు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. రామచందర్ రావు దీక్షకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకట రమణారెడ్డి, పాయల్ శంకర్, రామారావు పటేల్ పలువురు భాజపా నేతలు మద్దతు తెలిపారు.

**సౌతర్న్‌పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
ఆపరేషన్: సైబర్‌సిటీ సర్కిల్
టెండర్ నోటిఫికేషన్ -05/26-26
టీజీఎస్‌పీడీసీఎల్ టెండర్లు మరియు సీల్డ్‌బిడ్లను అర్హతకలిగిన బిడ్డర్ల నుంచి కోరడమైనది. టెండర్ నోటిఫికేషన్ 04/26-27 1) రీ కండక్టరింగ్ 11 కేవీ ఫీడర్ & ఈఆర్‌ఈసీ. సంఖ్య(10). 11 కేవీ ఏబీ స్విచ్చుల పనులు గచ్చిబౌలి డివిజన్‌లో 2) ఇబ్రహింబాగ్ డివిజన్‌లో ఇంటర్‌లింకింగ్ ఆఫ్ 11 కేవీ ఫీడర్ పనులు(5) మరియు 2 ఈఆర్‌ఈసీ పనులు 9.1 ఎంటీఎస్ పీఎస్‌సీసీ పోల్స్ పనులు 3.కొండాపూర్ డివిజన్‌లో ఒక ఇంటర్‌లింకింగ్ పని. 4.సైబర్‌సిటీ సర్కిల్‌లో ఆర్ఆర్ స్టోర్‌లలో సీసీ టీవీ కెమెరాలు , సివిల్ పనులు మరియు మిగతా వివిధ పనులు చేయుట. మిగతా వివరాలకు www.tgsouthernpower.org,www.eauction.telangana.gov.in ,www.eprocurement.telangana.gov.in లను సందర్శించండి.
సం/- ఎస్ఈ/ఓపీ/సైబర్‌సిటీ, రేతిబౌలి, ననల్‌నగర్ ఎక్స్ రోడ్, హైదరాబాద్
DIPR No.8675-PP/CL/ADVT/2026-27

# ప్రభుత్వ ధాన్యానికి మిల్లర్ల కన్నం

ధాన్యం లేదా బియ్యం నిల్వలను సక్రమంగా చూపకపోవడం వంటి అంశాలపై దర్యాప్తు జరుగుతోంది.అయితే రూ.13,399 కోట్లన్నీ ఇప్పటికే రుజువైన అవినీతి లేదా మోసం అని చెప్పడం సరికాదు. దర్యాప్తులో గుర్తించిన బకాయిలు, లెక్కల తేడాలు, లెక్కల్లో చూపని నిల్వలు, అనుమానాస్పద లావాదేవీలు తదితర విస్తృత అంశాలు ఇందులో ఉండే అవకాశం ఉంది.

**89 మిల్లుల్లో భారీ కొరత**

విజిలెన్స్ తనిఖీల్లో బయటపడిన తాజా గణాంకాలు వ్యవహారం తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి. 89 మిల్లుల్లో 3.72 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం కనిపించకపోవడం అధికారుల దృష్టికి వచ్చింది. ఇందులో వివిధ సీజన్లకు సంబంధించిన ప్రభుత్వ ధాన్యం ఉన్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, మిల్లర్లకు అప్పగిస్తుంది. మిల్లర్లు దాన్ని మర ఆడించి నిర్ణీత పరిమాణంలో బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాలి. కానీ కొన్ని మిల్లుల్లో ధాన్యం నిల్వలు లేకపోవడం లేదా లెక్కల్లో చూపిన దానికంటే తక్కువగా ఉండటం అనుమానాలకు తావిస్తోంది.

రూ.500 కోట్ల వ్యవహారం నుంచి మరింత విస్తరణ జూలై చివరి వారంలో ప్రారంభమైన విస్తృత తనిఖీల్లో సుమారు 50 మిల్లులు ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు వార్తలు వచ్చాయి. అప్పటికి పక్కదారి పట్టిన ధాన్యం విలువ సుమారు రూ.500 కోట్లుగా అంచనా వేశారు. దాదాపు రూ.300 కోట్ల మేర విలువైన ధాన్యాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు కూడా నివేదికలు పేర్కొన్నాయి. తదుపరి తనిఖీలతో మిల్లుల సంఖ్య, కొరతగా గుర్తించిన ధాన్యం పరిమాణం, ఆర్థిక విలువ పెరిగింది.

| జిల్లాలవారీగా ఇప్పటివరకు లభించిన లెక్కలు | | | |
|---|---|---|---|
| జిల్లా | మిల్లులు | గల్లంతైన ధాన్యం | విలువ (రూ.కోట్లు)సూర్యాపేట |
| సూర్యాపేట | 14 | 1,29,867.36 ఎంటీ | 318.63 |
| నిజామాబాద్ | 8 | 52,418.72 ఎంటీ | 155.18 |
| జగిత్యాల | 7 | 56,319.94 ఎంటీ | 135.48 |
| వనపర్తి | 4 | 27,242 ఎంటీ | 60.82 |
| ఖమ్మం | 8 | 14,136.67 ఎంటీ | 37.68 |
| పెద్దపల్లి | - | - | సుమారు 238 కోట్లు |
| కరీంనగర్ | - | 80,000 ఎంటీ | - |

**జిల్లాల్లోనూ భారీ తేడాలు**

జగిత్యాలలో మూడు మిల్లుల్లోనే సుమారు 34,388 మెట్రిక్ టన్నుల ధాన్యం, విలువ సుమారు రూ.87.89 కోట్లు, లెక్కల్లో లేకపోవడం గుర్తించారు. యాదాద్రి భువనగిరిలో ఒక మిల్లులో రికార్డుల ప్రకారం ఉండాల్సిన ధాన్యంతో పోలిస్తే 6,776 మెట్రిక్ టన్నులకు పైగా కొరత గుర్తించారు. దీని విలువ సుమారు రూ.24.31 కోట్లుగా అంచనా వేశారు. మెదక్ లో ఒక మిల్లులో 3,029 మెట్రిక్ టన్నుల బియ్యం కనిపించలేదని అధికారులు గుర్తించారు. దీని విలువ సుమారు రూ.7.17 కోట్లు. ఖమ్మంలో ఒక మిల్లులో 442.72 మెట్రిక్ టన్నుల కొరత, విలువ సుమారు రూ.1.23 కోట్లుగా గుర్తించి మిల్లర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు.

**రైతుల ధాన్యం ఎక్కడికి వెళ్లింది?**

రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం ప్రజాధనం. దాన్ని మిల్లర్లకు అప్పగించిన తర్వాత ప్రభుత్వానికి నిర్ణీత పరిమాణంలో బియ్యం తిరిగి రావాలి. కానీ మిల్లుల్లో ధాన్యం కనిపించకపోతే లేదా కస్టమ్ మిల్లింగ్ బియ్యం అందకపోతే ఆ నష్టం చివరకు ప్రభుత్వ ఖజానాపైనే పడుతుంది. అందుకే ప్రస్తుతం జరుగుతున్న విజిలెన్స్ దాడులు కేవలం మిల్లుల తనిఖీలుగా కాకుండా ప్రభుత్వ ధాన్యం, ప్రజాధనం, పౌర సరఫరాల వ్యవస్థలో జరిగిన అక్రమాలపై కీలక దర్యాప్తుగా మారుతున్నాయి.

**పూర్తి లెక్క తేలాల్సిందే..**

ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన గణాంకాలు అంతిమ లెక్కలు కావు. మరిన్ని మిల్లుల్లో తనిఖీలు పూర్తయిన తర్వాత ధాన్యం కొరత, కస్టమ్ మిల్లింగ్ బియ్యం బకాయిలు, తిరిగి స్వాధీనం చేసుకున్న మొత్తాలు, నమోదైన కేసులు తదితరాలపై స్పష్టమైన చిత్రం వచ్చే అవకాశం ఉంది. రూ.13,399 కోట్ల వ్యవహారంలో ఎంత మొత్తం వాస్తవంగా నష్టం? ఎంత ధాన్యం పక్కదారి పట్టింది? ఎంత బియ్యం ప్రభుత్వానికి చేరలేదు? ఎంత మొత్తాన్ని ఇప్పటికే తిరిగి రాబట్టారు? ఇందులో మిల్లర్లతో పాటు అధికారుల పాత్ర ఏమైనా ఉందా? అనే ప్రశ్నలకు సమగ్ర దర్యాప్తు ద్వారా సమాధానం రావాల్సి ఉంది.

పెద్దపల్లిలో 38 మంది మిల్లర్లు ప్రభుత్వ ధాన్యాన్ని తిరిగి ఇవ్వడంలో విఫలమైనట్లు, విలువ సుమారు రూ.238 కోట్లుగా పేర్కొనబడింది. కరీంనగర్‌లో రెండు సంవత్సరాలకు సంబంధించిన సుమారు 80,000 ఎంటీ సీఎంఆర్ ధాన్యం తిరిగి రాలేదని నివేదిక పేర్కొంది.

## మమ్దానీతో రేవంత్ భేటీ ఎందుకు?

- సీఎం యూఎస్ పర్యటనపై వివరణ ఇవ్వాలి
- నిబంధనల మేరకే కేంద్ర విదేశాంగశాఖ నిర్ణయాలు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టీకరణ

న్యూఢిల్లీ,ఆగస్టు25(జనంసాక్షి): అమెరికా పర్యటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్లారిటీ ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ కారణాలతోనే తన యూఎస్ పర్యటనను కేంద్రం అడ్డుకుందంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కిషన్ రెడ్డి తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలో ఆయన స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం అని కొట్టిపారేశారు. అనుమతులు లేకుండా ఎందుకు విదేశీ పర్యటనకు వెళ్లారంటూ తెలంగాణ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి.. స్థాయికి తగినట్లుగా ఈ పర్యటన లేదని తెలిపారు.ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనపై తాము కొత్తగా నిబంధనలు పెట్టలేదని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం నుంచి ఉన్న నిబంధనలే తాము అమలు చేశామని స్పష్టం చేశారు. ఇది సాధారణ ప్రక్రియ.. ఇందులో రాజకీయాలకు తావు లేదన్నారు. భారత్‌పై విషం చిమ్మే వ్యక్తి న్యూయార్క్ మేయర్ మామ్దానీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కానున్నారంటూ వార్తలు వచ్చాయని వివరించారు. ప్రధాని మోదీని టెర్రరిస్ట్ అని న్యూయార్క్ మేయర్ వ్యాఖ్యానించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మామ్దానీను ఎందుకు కలుస్తున్నారో.. సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.గతంలో తన విదేశీ పర్యటనను కూడా కేంద్ర విదేశాంగ శాఖ నిరాకరించిందని కిషన్ రెడ్డి తెలిపారు. మన దేశ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని విదేశాంగ శాఖ ఈ నిర్ణయం తీసుకుందని అభిప్రాయపడ్డారు. గుజరాత్ సీఎంకు యూఎస్ పర్యటనకు అనుమతి ఇచ్చి.. తమకు అనుమతి ఇవ్వలేదని సీఎం రేవంత్ వాదించడం వితండవాదమని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ సీఎంగా ఉన్నప్పుడు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన విదేశీ పర్యటనను నిరాకరించిందని చెప్పారు. అయితే సీఎం రేవంత్ రెడ్డికి హార్వర్డ్ బిజినెస్ కోర్సు చదివేందుకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలను కూడా గతంలో రద్దు చేసిందని చెప్పారు.

## అంజయ్యనగర్‌లో కొనసాగుతున్న కూల్చివేతలు

హైదరాబాద్ గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు మంగళవారం కూడా కొనసాగుతున్నాయి. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైడ్రా అధికారులు సంయుక్తంగా ఈ అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నారు. ఇప్పటికే రెండు భవనాలను నేలమట్టం చేయగా.. మరో ఆరు అంతస్తుల భవనాన్ని కూల్చివేస్తున్నారు. గచ్చిబౌలి పరిధి అంజయ్యనగర్‌లో ఏడంతస్తుల భవనం శనివారం కూలిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఈ నేపథ్యంలో అక్రమ, పాక్షికంగా దెబ్బతిన్న నిర్మాణాలపై అధికారులు దృష్టిసారించారు. ఈ వార్త చదివారా: హైదరాబాద్‌లో 12 మంది నకిలీ వైద్యుల అరెస్ట్

## ఫీజులే చెల్లించరు.. విదేశీ విద్య ఎలా వస్తుంది

లక్షలాది విద్యార్థుల మానసిక క్షోభ అర్థం కావడం లేదా

ఫీజు చెల్లింపుల సిఎం రేవంత్ రెడ్డిపై బండి విమర్శలు

**హైదరాబాద్(జనంసాక్షి):**ఫీజు రీయింబర్స్‌మెంట్‌కే దిక్కులేదని.. విదేశీ విద్యను అందిస్తానంటే నమ్మేదెలా అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. ఫీజు బకాయిలు అందక ఉన్న కాలేజీలే మూత పడుతున్నాయని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత విద్యా సంస్థలను రప్పిస్తాననడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ సర్కార్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. లక్షలాది మంది విద్యార్థులు పడుతున్న మానసిక క్షోభ సీఎంకు పట్టదా అని నిలదీశారు. 'సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీ యాజమాన్యాలు.. విద్యార్థులకు చేస్తున్న అవమానాలు కనిపించడం లేదా? ఫీజు బకాయిలు అడిగితే కాలేజీ యాజమాన్యాలను బెదరించడం తప్ప కాంగ్రెస్ సర్కార్ సాధించిందేమిటన్నారు. ఫీజు రీయింబర్స్ బకాయిల వల్ల దళిత, గిరిజన, బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నా పట్టదా? ఇందిరమ్మ రాజ్యమంటే దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాల పిల్లలకు ఉన్నత విద్యకు దూరం చేయడమేనా? వన్ టైం సెటిల్‌మెంట్ కింద బకాయిలన్నీ చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైంది?' అంటూ బండి సంజయ్ ప్రశ్నల వర్షం కురిపించారు. మామిలిచ్చి మోసం చేయడంలో బీఆర్ఎస్ సర్కార్‌ను మించిపోతున్నారని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. తక్షణమే రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

## 'ఆ సరస్సు పేరు మారుస్తాం'..

కెనడాతో ట్రంప్ మరో చిచ్చు

**వాషింగ్టన్(జనంసాక్షి):**కెనడాతో వాణిజ్య విభేదాలు కొనసాగుతున్న వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'ట్రూత్ సోషల్' వేదికగా కీలక పోస్ట్ పెట్టారు. కెనడా, అమెరికాలతో సరిహద్దు పంచుకుంటున్న 'లేక్ ఆంటారియో' పేరును 'లేక్ అమెరికా'గా మార్చే ప్రతిపాదనను సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. తాము ఇకపై ఆంటారియోతో పెద్దగా వాణిజ్యం చేయాలనుకోవడం లేదని పేర్కొన్నారు. ఒకవేళ అగ్రరాజ్యం తమపై సుంకాలను విధిస్తే.. ఆ దేశానికి విద్యుత్తు సరఫరాను నిలిపేస్తామని, కీలక ఖనిజాల ఎగుమతిని ఆపేస్తామని ఆంటారియో ప్రభుత్వాధినేత డగ్ ఫోర్డ్ హెచ్చరించిన నేపథ్యంలో ట్రంప్ పోస్టు ప్రాధాన్యం సంతరించుకుంది.

**కెనడా మమ్మల్ని కొల్లగొడుతోంది: ట్రంప్**

మరో పోస్టులో కెనడా ప్రధాని మార్క్ కార్నీ, డగ్ ఫోర్డ్‌లపై ట్రంప్ విరుచుకుపడ్డారు. "డగ్ ఫోర్డ్ గొప్పలకు పోతున్నారు. దశాబ్దాలుగా కెనడాకు అమెరికా అండగా నిలిచింది. కానీ ఇకపై అలా జరగదు. మేం లేకపోతే కెనడా మనుగడ సాగించలేదు. ఆ దేశంతో పోలిస్తే అమెరికా సంపన్నమైన, శక్తిమంతమైన దేశం. ఆ దేశానికి అవసరమయ్యే విద్యుత్, చమురు, గ్యాస్‌లో ఎక్కువ భాగం అమెరికా మీదుగానే రవాణా అవుతాయి. కెనడాలో నిరుద్యోగిత రేటు వేగంగా పెరుగుతోంది.

# మంత్రి విస్తరణ దిశగా సర్కారు అడుగులు

ఉంది. దీంతో ప్రస్తుతం ఇంకా రెండు మంత్రి పదవులు మాత్రమే ఖాళీగా ఉన్నాయి.ఈ నేపథ్యంలో సాధారణ విస్తరణలో గరిష్ఠంగా ఇద్దరు కొత్త మంత్రులను మాత్రమే తీసుకునే అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుత మంత్రుల్లో ఎవరినైనా తప్పించి వారి స్థానంలో కొత్తవారిని తీసుకుంటే మాత్రం రాజకీయ సమీకరణాలకు అనుగుణంగా మరింత పెద్ద స్థాయిలో పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశం ఉంటుంది.

**స్పీకర్ గడ్డం ప్రసాద్ పేరు ముందుకు**

మంత్రివర్గ విస్తరణపై జరుగుతున్న చర్చలో ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పేరు మరోసారి ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనను మంత్రివర్గంలోకి తీసుకుంటే స్పీకర్ పదవికి కొత్త వ్యక్తిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. గతంలోనూ గడ్డం ప్రసాద్‌తో పాటు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్లు మంత్రివర్గ విస్తరణలో వినిపించాయి.

**భట్టి విక్రమార్కకు స్పీకర్ పదవా?**

గడ్డం ప్రసాద్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటే ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను స్పీకర్‌గా పంపే అవకాశముందన్న ఊహాగానాలు కూడా రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్నాయి. అయితే ఇది అధికారికంగా ధ్రువీకరించబడలేదు.భట్టి విక్రమార్క ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతుండటంతో ఆయనకు స్పీకర్ బాధ్యతలు అప్పగిస్తే ప్రభుత్వంలో కీలకమైన రాజకీయ, పరిపాలనా పునర్వ్యవస్థీకరణ జరగాల్సి ఉంటుంది.

**రాజగోపాల్‌రెడ్డికి అవకాశం?**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేరు కూడా మంత్రివర్గ రేసులో మరోసారి బలంగా వినిపిస్తోంది. నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ రాజకీయ సమీకరణాలు, ఆయనకు ఉన్న రాజకీయ ప్రాధాన్యత నేపథ్యంలో మంత్రి పదవి ఇవ్వాలన్న డిమాండ్ పార్టీలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. గతంలోనూ ఆయన పేరు మంత్రివర్గ విస్తరణకు సంబంధించి ప్రముఖంగా వినిపించింది.

**కొండా సురేఖకు ఉద్వాసన?**

ఇక మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా మంత్రి కొండా సురేఖను తప్పించే అవకాశముందన్న ప్రచారం కూడా రాజకీయ వర్గాల్లో సాగుతోంది. అయితే దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కాబట్టి ఈ అంశాన్ని ప్రస్తుతానికి రాజకీయ వర్గాల్లోని ఊహాగానంగానే చూడాల్సి ఉంటుంది.

**రెండు బెర్తులే.. పోటీ మాత్రం పలువురి మధ్య**

మొత్తంగా చూస్తే ప్రస్తుతం 16 మంది మంత్రులతో కొనసాగుతున్న తెలంగాణ కేబినెట్‌లో గరిష్ఠంగా మరో రెండు బెర్తులు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. దీంతో కొత్తగా మంత్రి పదవులు ఆశిస్తున్న పలువురు ఎమ్మెల్యేల మధ్య పోటీ తీవ్రంగా మారే అవకాశం ఉంది.ప్రాంతీయ, సామాజిక సమీకరణాలు, సీనియారిటీ, పార్టీకి చేసిన సేవలు, వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

ఒకవైపు గడ్డం ప్రసాద్, రాజగోపాల్‌రెడ్డి వంటి పేర్లు వినిపిస్తుండగా.. మరోవైపు మంత్రివర్గంలో మార్పులు జరిగితే ఎవరికి ఉద్వాసన పలుకుతారన్నది కూడా కీలకంగా మారింది.రెండు ఖాళీల భర్తీతో సరిపెడతారా? లేక కొందరిని తప్పించి కొత్త సమీకరణాలతో కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరిస్తారా? అన్నదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర చర్చగా మారింది. తుది నిర్ణయం మాత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానం మధ్య జరిగే చర్చలపై ఆధారపడి ఉంటుంది.

# ఇక పైలెట్లకూ డోపింగ్ టెస్టులు

- మాదక ద్రవ్యాలు వినియోగంచకుండా ఆంక్షలు
- టెస్ట్ వ్యవహారాలను పరిశీలిస్తున్న డీజీసీ
- కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ,ఆగస్టు 25(జనంసాక్షి): ఇకపై ఏడాదికి ఒక్కసారైనా విమాన పైలట్లకు డోప్ టెస్టులునిర్వహించాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. పైలట్లు మాదకద్రవ్యాల, మత్తు పదార్థాలు ఉపయోగించకుండా అరికట్టేందుకు, భవిష్యత్తులో కఠినమైన నిబంధనలు తెచ్చేందుకు డీజీసీఏ ప్రస్తుతం విమానయాన సంస్థలతో చర్చలు జరుపుతోందని చెప్పు కొచ్చారు. ప్రస్తుతం మొత్తం పైలట్ల సంఖ్యలో 10 శాతం మందికి మాత్రమే డోప్ టెస్టులు నిర్వహించాలనే నిబంధన అమల్లో ఉందని చెప్పారు. ఏడాదిలో ఒకసారి ప్రతి పైలట్‌కూ పరీక్ష నిర్వహించేలా దీనిని మార్పు చేయాలనే అంశాన్ని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ పరిశీలిస్తోందన్నారు. భద్రత, నిర్వహణ పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని దీనిపై ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన ప్రస్తుత నిబంధనలను మరింత కఠినం చేసే మార్గాలపైనా డీజీసీఏ అధ్యయనం చేస్తోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా పుకెట్–దిల్లీ విమాన ఘటనపై మాట్లాడుతూ.. దీనిపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు చేస్తోందన్నారు. విమానంలోని పైలెట్ డేటా రికార్డర్ దర్యాప్తు సంస్థ ఆధీనంలో ఉందని పేర్కొన్నారు. త్వరలోనే ప్రాథమిక నివేదిక వచ్చే అవకాశం ఉందని.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. థాయ్‌లాండ్ నుంచి దిల్లీకి వస్తున్న విమానం ఆగస్టు 4న తీవ్ర కుదుపులకు లోనైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 17 మంది గాయపడ్డారు. ఈ ఘటన అనంతరం పైలట్లు ఇద్దరికీ డ్రగ్ టెస్ట్ నిర్వహించారు. తొలి పరీక్షలో పైలట్–ఇన్–కమాండ్‌కు పాజిటివ్ వచ్చింది. దీని తర్వాత సైకోయాక్టివ్ పరీక్ష నిర్వహించగా.. గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ ఘటనపై ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు జరుపుతోందని పేర్కొన్నారు. విమానం డేటా రికార్డర్లు, ఇతర భాగాలు సురక్షితంగా ఉన్నందున, త్వరలోనే ప్రాథమిక నివేదిక వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం పైలట్ నెట్‌వర్క్‌లో కేవలం పదిశాతం మందికి మాత్రమే రాండమ్‌గా డోప్ టెస్టులు నిర్వహిస్తున్నారని రామ్మోహన్ వెల్లడించారు. ప్రతీ పైలట్‌కు సంవత్సరంలో కనీసం ఒక్కసారైనా రాండమ్‌గా పరీక్ష నిర్వహించాలనే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందని అన్నారు. విమాన ప్రయాణికుల భద్రత అత్యంత ముఖ్యమైనదని చెప్పారు. విమాన సంస్థల ఆపరేషనల్ ప్రభావం కూడా దెబ్బతినకుండా ఈ రెండింటి మధ్య సమతుల్యత పాటిస్తామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## మీరు బస్సు మిస్ అయితే ఎవరేం చేస్తారు?

సీబీఎస్ఈ రీ-ఎవాల్యూయేషన్‌పై సుప్రీం

న్యూఢిల్లీ(జనంసాక్షి):సీబీఎస్ఈ పునఃసమీక్షపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 12వ తరగతి జవాబు పత్రాల పునఃసమీక్ష కోసం సీబీఎస్ఈ పోర్టల్‌ను మళ్లీ అందుబాటులోకి తెచ్చేలా ఆదేశాలివ్వాలంటూ వేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. దీనికోసం ఇప్పటికే విద్యార్థులకు నిర్ణీతకాలం పాటు అవకాశం కల్పించినట్లు తెలిపింది. మళ్లీ దానిని తిరిగి తెరవడం వల్ల మొత్తం పరీక్ష ప్రవేశాల ప్రక్రియపై ప్రభావం పడొచ్చని పేర్కొంది. నిర్ణీత గడువులోగా వేలమంది విద్యార్థులు దరఖాస్తులు సమర్పించినప్పుడు.. ఆ సమయంలో అప్లై చేసుకోనివారికి మరో అవకాశం ఎందుకు ఇవ్వాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. బస్సు ఉన్నప్పుడు ఎక్కకుండా..దానిని మిస్ చేసుకుంటే ఎవరు మాత్రం ఏం చేస్తారని అన్నారు. తమ సీబీఎస్ఈ మార్కులకు సంబంధించి ఇంకా సమస్యలు ఎదుర్కొంటున్నామని కొందరు విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 12వ తరగతి జవాబు పత్రాల పునఃసమీక్ష కోసం సీబీఎస్ఈ పోర్టల్‌ను మళ్లీ అందుబాటులోకి తెచ్చేలా ఆదేశాలివ్వాలని కోరారు. కాగా.. ఇప్పటికే ఈ పోర్టల్ ద్వారా సుమారు 1.68 లక్షల మంది విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారని కేంద్రం న్యాయస్థానానికి వెల్లడించింది. అటుఇ మార్కులు ప్రవేశ పరీక్షలు, కళాశాల ప్రవేశాలతో ముడిపడి ఉన్నందున, ఈ దశలో విండోను తిరిగి తెరవడం సాధ్యం కాదని చెప్పింది.

## రష్యాలో దిగిన అమెరికా 'మిస్టరీ' విమానం!

మాస్కో(జనంసాక్షి):ఉక్రెయిన్–రష్యా మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణలు కొనసాగుతోన్న వేళ అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. అమెరికాకు చెందిన ఓ సైనిక విమానం మంగళవారం రష్యా విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యింది. దీంతో ఆ విమానం రాకకు గల కారణమేంటనే దానిపై నెట్టింట చర్చ మొదలైంది. ఫ్లైట్‌రాడార్ 24 డేటా ప్రకారం.. బోయింగ్ సీ–17 గ్లోబ్‌మాస్టర్ 3 విమానం లాత్వియా దేశ రాజధాని రిగా నుంచి ఉదయం 8.50 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) బయల్దేరింది. ఉదయం 10 గంటల తర్వాత ఈ విమానం మాస్కోలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగింది. ఆగస్టు 23న ఈ విమానం వాషింగ్టన్‌లోని యూఎస్ ఆండ్రూస్ ఎయిర్‌ఫోర్స్ బేస్ నుంచి రిగాకు చేరుకున్నట్లు తెలిసింది. ఇది సైనిక రవాణా విమానం. సాధారణంగా దీన్ని అమెరికా వాయుసేన సుదీర్ఘ ప్రయాణాలకు ఉపయోగిస్తుంది. ఇందులో సైనిక పరికరాలు, సిబ్బంది, ఇతరత్రా కార్గోను తరలిస్తుంటారు. అయితే, ప్రస్తుత యుద్ధ పరిణామాల నేపథ్యంలో ఈ విమానం మాస్కోకు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ విమానం ఎందుకొచ్చింది..? అందులో ఎవరున్నారు..? వంటి వివరాలేవీ తెలియరాలేదు. దీనిపై అమెరికా నుంచి ఇంతవరకూ ఎలాంటి స్పందన రాలేదు. మరోవైపు, ఈ విమానం ల్యాండింగ్ గురించి తమకు సమాచారం లేదని రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ వెల్లడించింది. కాగా.. అమెరికా రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ రష్యాలో పర్యటించే అవకాశం ఉందని కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సైనిక రవాణా విమానం ల్యాండ్ అవడం మిస్టరీగా మారింది. మాస్కో ఎయిర్‌పోర్టులో ఈ విమానం ల్యాండ్ అయిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

# సీఎంను కలిసిన క్రీడాకారులు




హైదరాబాద్ (జనంసాక్షి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, బ్యాడ్మింటన్ క్రీడాకారులు గాయత్రి గోపీచంద్, త్రిసా జాలీ కలిశారు. ఇటీవల బ్యాడ్మింటన్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్, త్రిసా జాలీ కాంస్య పతకం సాధించారు. ఆ ఇద్దరు ప్లేయర్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు, మాజీ బ్యాడ్మింటన్ ప్లేయర్ పి.వి.వి. లక్ష్మి పాల్గొన్నారు.

# అగ్రి బీఎస్సీ కోర్సులకు 27 నుంచి కౌన్సిలింగ్



రాజేంద్రనగర్, ఆగస్టు25 (జనంసాక్షి)

2026–27 విద్యా సంవత్సరానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని 13 కళాశాలల్లో బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్, బీఎస్సీ (ఆనర్స్) హార్టీకల్చర్, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల రెగ్యులర్ సీట్ల భర్తీకి తొలి విడత కౌన్సిలింగ్ ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహించనున్నట్లు ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో ఉదయం 9.30 గంటలకు కౌన్సిలింగ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ఎప్‌సెట్–2026లో అర్హత సాధించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న బైపీసీ అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. ర్యాంకుల వారీగా తేదీలు, అవసరమైన ధ్రువపత్రాల వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీ.జేటీఏయూ.ఈడీయూ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.

# పర్యాటక ప్రాంతాలను ప్రాధాన్యతా ప్రాతిపదికన అభివృద్ధి చేయాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

## ఆగస్టు 30న నీట్ పీజీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలి

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణను దేశ, విదేశీ పర్యాటకులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా తీర్చిదిద్ది బ్రాండ్ తెలంగాణను ప్రపంచస్థాయిలో బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వర్షాభావ పరిస్థితులు, నీట్–పీజీ పరీక్ష ఏర్పాట్లు, పర్యాటక అభివృద్ధి తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ప్రాధాన్యతా ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని, ప్రతి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అనుసంధానిస్తూ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. యాదాద్రి, భద్రాచలం, బాసర, వరంగల్, ఆలంపూర్, కీసరగుట్ట, కల్వకుర్తి, మెదక్, నల్గొండ, పోచంపల్లి, కరీంనగర్, చార్మినార్, గోల్కొండ, మేడిగడ్డ, పాఖల్, మణుగూరు, కవాల్, ఏటూరునాగారం, వేదురుకొండ, నాగార్జునసాగర్, మహబూబ్‌నగర్, నార్సాపూర్, చేర్యాల తదితర ప్రాంతాలతో పాటు బుద్ధ వాటర్ ట్రెయిల్ సర్క్యూట్, బౌద్ధ సర్క్యూట్‌లను సమగ్ర పర్యాటక గమ్యస్థానాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, శుభ్రత, సూచిక బోర్డులు, ఇతర సందర్శకుల సౌకర్యాలను మెరుగుపరచాలని ఆదేశించారు. స్థానిక కళలు, హస్తకళలు, స్థానిక ఆహారం, సంస్కృతికి ప్రాధాన్యతనిస్తూ స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, హోమ్‌స్టేలు, స్థానిక గైడ్ సేవలను ప్రోత్సహించాలని తెలిపారు. ఆగస్టు 30న నిర్వహించనున్న నీట్–పీజీ 2026 ప్రవేశ పరీక్ష పై సమీక్షిస్తూ, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 56 పరీక్షా కేంద్రాల్లో 17,627 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు.

# టిమ్స్‌కు ప్రతిరోజూ 600 మంది అవుట్ పేషంట్లు

## అవసరమైన వైద్య సేవలను అందిస్తున్నాం : మంత్రి దామోదర్ రాజనర్సింహ



హైదరాబాద్ (జనంసాక్షి) : డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్) ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన మంగళవారం జరిగింది. డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వాణి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు. టిమ్స్‌కు ప్రతి రోజూ సగటున 600 మంది అవుట్ పేషెంట్లు వస్తున్నారని, వారికి అవసరమైన వైద్య సేవలను అందిస్తున్నామని డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్ మంత్రికి వివరించారు. అలాగే డే కేర్ ప్రొసీజర్లను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హాస్పిటల్‌లోని ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు, డయాగ్నస్టిక్స్ ఎక్విప్‌మెంట్‌తో పాటు ఇతర కీలక వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో స్టెరిలైజేషన్ చేయిస్తున్నామని, ఇందుకు సంబంధించిన ప్రక్రియ మరో పూర్తయిన వెంటనే సర్జరీలు ప్రారంభిస్తామని డాక్టర్ నరేంద్ర కుమార్ మంత్రికి వివరించారు.

# ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు డాక్టర్ వైఎస్. రాజశేఖర రెడ్డి అవార్డు



హైదరాబాద్ (జనంసాక్షి) : దేశ వ్యవసాయ రంగం, ఆహార భద్రత, సుస్థిర అభివృద్ధి, గ్రామీణ జీవనోపాధి రంగాలలో అందించిన అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా 'ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్' (ఎంఎస్ఎస్ఆర్ఎఫ్) కు 'డాక్టర్ వైఎస్. రాజశేఖర రెడ్డి అవార్డు – 2026' ను ప్రకటించారు. ఈ అవార్డు కింద రూ. 25 లక్షల నగదు బహుమతిని అందజేస్తారు. 2026 సెప్టెంబర్ 2న న్యూఢిల్లీలోని 'కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా'లో నిర్వహించే కార్యక్రమంలో ఎంఎస్ఎస్ఆర్ఎఫ్ తరపున ఆ సంస్థ ఛైర్‌పర్సన్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్ ఈ అవార్డును స్వీకరిస్తారు. భారతరత్న, దివంగత డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ మహోన్నత వారసత్వాన్ని ఎంఎస్ఎస్ఆర్ఎఫ్ కొనసాగిస్తోంది. ఆయన శాస్త్రీయ నాయకత్వం మన దేశ హరిత విప్లవంలో, దేశాన్ని ఆహార కొరత నుంచి ఆహార స్వయం సమృద్ధి దిశగా నడిపించడంలో చారిత్రాత్మక పాత్ర పోషించింది. దివంగత ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ గారి నాయకత్వంలో, ఆమె రాజకీయ సంకల్పం, వ్యవసాయ రంగానికి అందించిన బలమైన మద్దతు, డాక్టర్ స్వామినాథన్ సైంటిఫిక్ విజన్, భారతీయ రైతుల కృషి కలిసి దేశ ఆహార భద్రతకు బలమైన పునాదులు వేశాయి.

# మోకిలలో వరుస చోరీలకు యత్నం

## ఆరు విల్లాల్లో తాళాలు పగలగొట్టిన దుండగులు



శంకర్ పల్లి,ఆగస్టు 25 (జనం సాక్షి)
రంగారెడ్డి జిల్లా మోకిల పరిధిలో వరుస దొంగతనాలకు యత్నాలు కలకలం రేపుతు న్నాయి. మోకిలలోని సుబ్బిసి వాటర్ పోర్ట్, రిలయన్స్ గ్రీన్ విలేజ్ విల్లాలలో గుర్తు తెలియని దుండగులు తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు యత్నించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం రాత్రి రెండు కాలనీల్లో తాళం వేసి ఉన్న నాలుగు విల్లాల తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి సామాన్లు చిందరవందర చేశారు. మళ్లీ సోమవారం రాత్రి రిలయన్స్ గ్రీన్ విలేజ్ లో సోలార్ ఫెన్సింగ్ కట్‌చేసి మరో రెండు విల్లాల్లోకి ప్రవేశించారు. రెండురోజుల్లో మొత్తంఆరు విల్లాల్లో దొంగలు ప్రవేశించినప్పటికీ, విలువైన వస్తువులు, బంగారం, నగదు చోరీకి గురికాలేదని బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్, మోకిల ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంగళవారం ఘటనా స్థలాలను పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, నిందితులను పట్టుకునేందుకు ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు డీసీపీ తెలిపారు. ఇటీవల శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోనూ వరుస చోరీలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని,అందుకే దొంగలు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గస్తీ వాహనాలు ఉన్నా చోరీలు జరుగు తుండటం ప్రజలను భయాందోళనకు గురి చేస్తోంది. శంకర్ పల్లి,మోకిల పరిధిలో జరుగుతున్న చోరీలపై ఫ్యూచర్ సిటీ కమిషనర్ ప్రత్యేక నిఘా పెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పీసీసీ సోషల్ మీడియా ఛైర్మన్‌గా నవీన్ పెట్టెం

హైదరాబాద్ (జనంసాక్షి) : టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ సమక్షంలో టీపీసీసీ సోషల్ మీడియా నూతన ఛైర్మన్ నవీన్ పెట్టెం, నేడు అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఛైర్మన్‌తో పాటు నూతనంగా నియమితులైన సోషల్ మీడియా కన్వీనర్లు, కోఆర్డినేటర్లు కూడా తమ తమ బాధ్యతలను స్వీకరించారు. ?ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ, టీపీసీసీ మీడియా ఛైర్మన్ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# జామియా నిజామియా వక్ఫ్ భూములకు రక్షణ కల్పించాలి

## రాయదుర్గ్ సర్వే నం.83/1లో 10.63 ఎకరాల వేలం నిలిపివేయాలి




కొడంగల్, ఆగస్టు 25 (జనం సాక్షి): జామియా నిజామియా వక్ఫ్ భూముల పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ స్టేట్ మైనారిటీ హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. రాయదుర్గ్ పాన్మక్త గ్రామంలోని సర్వే నం.83/1లో 10.63 ఎకరాల భూమిని టీజీఐఐసీ వేలం ప్రతిపాదనను నిలిపివేయాలని సమితి రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ వహబ్ కోరారు. భూమికి సంబంధించిన వక్ఫ్, రెవెన్యూ, సర్వే, ఇనాం, రిజిస్ట్రేషన్, గెజిట్, వారసత్వ రికార్డులను సమగ్రంగా పరిశీలించి చట్టబద్ధ హక్కులను నిర్ధారించిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని అన్నారు. సర్వే నం.83కు వారసత్వ పరిరక్షణ కల్పించాలని, గతంలో జరిగిన 6.2 ఎకరాల వేలం, ఎస్‌బీఐ యాజమాన్య హక్కు క్లెయిమ్, సంబంధిత న్యాయ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జామియా నిజామియాకు చెందిన 510 ఎకరాల 35 గుంటల భూమిని సమగ్రంగా సర్వే చేసి హద్దులు నిర్ణయించి, చుట్టూ శాశ్వత ప్రహరీ నిర్మించాలని కోరారు. అదేవిధంగా చట్టబద్ధంగా నిర్ధారించబడిన భూమిలో జామియా నిజామియా నైపుణ్య, ఆరోగ్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మొహమ్మద్ వసీమ్ కోరారు. ఇది విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలకు ఉపయోగపడుతుందని అన్నారు. రాయదుర్గ్ భూముల పరిరక్షణ కోసం ఆగస్టు 27న ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ వహబ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మొహమ్మద్ వసీమ్, రాష్ట్ర సమన్వయకర్త మహమ్మద్ అబ్రార్ హుస్సేన్ ఆజాద్, వికారాబాద్ నిర్వహణ కార్యదర్శి మొహమ్మద్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

# సారంపల్లి మల్లారెడ్డి పేరున రైతు కూలీల వ్యవసాయ అధ్యయన కేంద్రం నెలకొల్పాలి

హైదరాబాద్ (జనంసాక్షి) : వ్యవసాయరంగ అభివృద్ధి కోసం, రైతు కూలీల మనుగడ కోసం జీవితకాలం కన్నుమూసేదాకా కృషి చేసిన రైతు ఉద్యమ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి పేరున వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతు కూలీల వ్యవసాయ అధ్యయన కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పడం తెలంగాణ రైతు కూలీలకిచ్చిన గౌరవంగా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర బీ.సీ కమిషన్ మాజీ సభ్యులు జూలూరు గౌరీశంకర్ కోరారు. మల్లారెడ్డి అంతియాత్ర సందర్భంగా ఎం.బి.భవన్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంపై, భూసంస్కరణలపై, కౌలుదారి విధానంపై సాలార్‌జంగ్ సంస్కరణల దగ్గర నుంచి నేటి ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలపై సాధికారమైన పట్టున్న మల్లారెడ్డి కృషిని తెలంగాణ సమాజం గుర్తుంచుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సారంపల్లి మల్లారెడ్డి స్మారకంగా రైతు కూలీల వ్యవసాయ అధ్యయన కేంద్రం నెలకొల్పడం సముచితంగా ఉంటుందని పేర్కొన్నారు.

# సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడార్ రైల్వేస్టేషన్ కొనసాగించండి

## తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు




సూర్యాపేట (జనంసాక్షి) : శంషాబాద్ నుండి అమరావతి వరకు సూర్యాపేట మీదుగా ప్రకటించిన బుల్లెట్ ట్రైన్ కారిడార్ మరియు రైల్వే స్టేషన్ మొదటి అలైన్ మెంట్ నే కొనసాగించాలని కోరుతూ గత కొంత కాలంగా సూర్యాపేట లో అఖిల పక్ష కమిటీ ఆధ్వర్యంలో బుల్లెట్ ట్రైన్ సాధనకై వివిధ పోరాట పద్ధతులలో ఉద్యమం జరుగుతోంది. బుధవారం రోజున బుల్లెట్ ట్రైన్ కారిడార్, రైల్వే స్టేషన్ కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో 'లక్ష గొంతుల పోలికేక' కార్యక్రమం సూర్యాపేట జిల్లా కేంద్రంలో వివిధ ప్రాంతాల్లో జరిగింది. సూర్యాపేట జిల్లా కేంద్రం ఖమ్మం క్రాస్ రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అఖిలపక్షం కో – కన్వీనర్ అనంతుల మధు హాజరై మాట్లాడారు. రైల్వే లైన్, స్టేషన్ సూర్యాపేట ప్రజల చిరకాల ఆకాంక్ష అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సూర్యాపేట ప్రాంతం మీదుగా బుల్లెట్ ట్రైన్ అవకాశం ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం అలైన్ మెంట్ ని అమరావతి వయా వాడపల్లి, హాలియా మీదుగా శంషాబాద్ మార్చటం సూర్యాపేట ప్రాంత అభివృద్ధిని అడ్డుకోవడమే అని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య వేగం గా అభివృద్ధి చెందుతున్న సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ మొదటి అలైన్ మెంట్ కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వన్ని డిమాండ్ చేసారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్, రైల్వే కారిడార్ సాధించే వరకు భవిష్యత్తులో పోరాడుతామని 'మాకు రైలు బండి ఇవ్వండి – మా అభివృద్ధిని అడ్డుకోకండి' ప్లకార్డులు చేత బుని విద్యార్థులు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేసారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ఉపాధ్యక్షులు బషీపంగు సునీల్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ సురేష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు ధరవాత్ శివ, జిల్లా నాయకులు వెంకటేష్ నాయక్, రంజిత్, చిరు వ్యాపారులు పద్మ, యాకుబ్, మౌనిక, క్రాంతి కుమార్, కిరణ్ తదితరులు మద్దతుగా పాల్గొన్నారు.

# భద్రాచలం ఎక్సైజ్ శాఖలో కలకలం

## ఖైదీ పరారీ ఘటనపై ఉన్నతాధికారుల విచారణ
## పంచనామా, ఎఫ్ఐఆర్ మార్పులపై ఆరోపణలు
## భద్రాచలానికి నూతన ఎక్సైజ్ సీఐ నియామకం?

భద్రాచలం ఆగస్టు 25 (జనంసాక్షి) : భద్రాచలం ఎక్సైజ్ శాఖలో చోటుచేసుకున్న ఓ ఖైదీ పరారీ ఘటన ఇప్పుడు ఉన్నతాధికారుల విచారణకు దారితీసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎక్సైజ్ సీఐ రహీమున్నీసాబేగం సెలవుపై వెళ్లినట్లు సమాచారం. ఇదే సమయంలో భద్రాచలం ఎక్సైజ్ సీఐగా మరో అధికారిని ఉన్నతాధికారులు నియమించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నెల మొదటి వారంలో గంజాయి కేసులో పట్టుబడిన ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించే క్రమంలో ఒకరు ఎక్సైజ్ స్టేషన్ నుంచి పరారైన ఘటన కలకలం రేపింది. అయితే ఈ ఘటనకు సంబంధించిన పంచనామా రికార్డులో మార్పులు చేసి, ఒక్క నిందితుడినే పట్టుకున్నట్లు మరో పంచనామా రూపొందించినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. టాస్క్‌ఫోర్స్ పోలీసులు అందజేసిన అసలు పంచనామా రికార్డులో మార్పులు చేసినట్లు ఆరోపణలు రావడం ఈ వ్యవహారంలో మరింత చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా ఎక్సైజ్ స్టేషన్ నుంచి ఖైదీ పరారైనప్పుడు సంబంధిత అధికారులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే ఈ ఘటనలో ఖైదీ పరారీ విషయం బయటకు రాకుండా ఎఫ్ఐఆర్‌లోనూ మార్పులు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఎక్సైజ్ శాఖలో విధి నిర్వహణపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై జిల్లా ఎక్సైజ్ అధికారులు ఇప్పటికే అంతర్గత విచారణ నిర్వహించి, నివేదికను ఎక్సైజ్ కమిషనరేట్‌కు పంపినట్లు సమాచారం.

# అనధికార నిర్మాణాలపై సిఎంసి ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు






శేరిలింగంపల్లి, ఆగస్టు 25 (జనంసాక్షి ) : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనధికార నిర్మాణాలుగా ఉన్న భవనాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను ముమ్మరం చేసింది. సిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన ఆదేశాలమేరకు మంగళవారం మూడు జోన్లలో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలకు అధికారులు పూనుకున్నారు. ఇందులో భాగంగా మొత్తం 17 అనధికార నిర్మాణాలను కూల్చివేశారు. ఇందులో శేరిలింగంపల్లి జోన్‌లో 7, కూకట్‌పల్లి జోన్‌లో 2, కుత్బుల్లాపూర్ జోన్‌లో 8 నిర్మాణాలపై చర్యలకు పూనుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో కూల్చివేత చర్యలతోపాటు, గుర్తించిన అనధికార నిర్మాణాలకు సంబంధించి 11 యూసి నోటీసులను సైతం జారీ చేసినట్లు సిఎంసి కమిషనర్ వివరించారు. దీంతోపాటు మైక్యూర్, ప్రజావాణి వినతులు మరియు అధికారులు క్షేత్రస్థాయిలో నిర్వహించిన తనిఖీల ద్వారా ఇప్పటివరకు మొత్తం 54 అనధికార నిర్మాణాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అనధికార నిర్మాణాలను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో అవసరమైన చర్యలు చేపట్టే విధంగా గుర్తింపు మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తున్నామన్నారు. అనధికార నిర్మాణాలపై ప్రతిరోజూ క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేపట్టి నిబంధనల ప్రకారం సకాలంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు తీసుకోవడంకోసం సంబంధిత టౌన్ ప్లానింగ్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. భవన నిర్మాణ నిబంధనల అమలును బలోపేతం చేయడంతోపాటు, ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ మూడు జోన్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను సిఎంసి నిరంతరం పర్యవేక్షించనుందని అధికారులు తెలియజేశారు.

# కాంగ్రెస్ పార్టీ సంక్షోభంలో వుంది

## ఆ పార్టీ అధికారంలో ఎన్ని రోజులు ఉంటుందో అర్థం కాని పరిస్దితి : ఎంపీ డికే అరుణ



మహబూబ్‌నగర్ బ్యూరో ఆగస్టు 25(జనం సాక్షి) : కాంగ్రెస్ పార్టీలో తీవ్ర సంక్షోభం నెలకొందని, ఒకరిపై ఒకరు భాణాలు వేసుకుంటున్నారని ఆ పార్టీ అధికారంలో ఎన్ని రోజులు ఉంటుందో అర్థం కాని పరిస్దితి నెలకొందని ఎంపీ డీకే అరుణ అన్నారు.రాష్ట్రంలో రైతుల పరిస్దితి దయనీయంగా ఉందనిఓవైపు ఎల్నినో ప్రబావం రైతులపై తీవ్రంగా ఉండగా ప్రభుత్వం ఈ ఏడాది రైతుభీమా ప్రీమియం చెల్లించలేదని ఇది ప్రభుత్వ ఘోర నిర్లక్ష్యమని మండిపడ్డారు.ఇది మాటల ప్రభుత్వం చేతల ప్రభుత్వం కాదని రైతుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్దిలేదని ద్వజమెత్తారు.

ఫీజు రీఎంబర్స్ మెంట్ డబ్బులు చెల్లించలేక పోవటంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని మంగళసూత్రాలు అమ్మి పీజులు చెల్లించాల్సిన దుస్దితి నెలకొందని అన్నారు. ఆందోళనలు చేస్తున్న విద్యార్దులపై పోలీసులతో లాఠీచార్జ్ చేయించటం దారుణమన్నారుసీఎం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చటం లేదు, కాంగ్రెస్ పార్టీ నేత రాహూల్ గాంధీ వారి పార్టీ అధికారంలో ఉన్న ఈ రాష్ట్రంలో విద్యార్దుల సమస్యలు ఎందుకు పరిష్కరించటం లేదుని,ప్రపంచంలో ప్రధాని మోడీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని క్రిమినల్ వేస్ట్ అంటూ విద్యార్దులను సీఎం అవమాన పరుస్తున్నారన్నారు. పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల పనుల్లో పురోగతి లేదని మాయమాటలతో రైతులనుమభ్యపెడుతున్నారని విమర్శించారు.



# విద్యార్థుల భద్రతే ముఖ్యం కావాలి

## కాలేజీ యాజమాన్యాలు ఆ దిశగా ఆలోచించాలి

## ఫేక్ ఫైర్ ఎన్‌వోసీపై కాలేజీలకు హైడ్రా ఇంటర్ బోర్డు దిశానిర్దేశం

హైదరాబాద్, ఆగస్టు 25 (జనంసాక్షి) : విద్యార్థుల భద్రత ముఖ్యం కావాలి. కాలేజీ యాజమాన్యాలు ఆ దిశగా ఆలోచించాలని హైడ్రా – ఇంటర్ బోర్డు సూచించాయి. అనుకోని పరిస్థితుల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే విద్యార్థులు, బోధనా సిబ్బంది సురక్షితంగా బయట పడేందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని కోరాయి. ఇందుకు అనుగుణంగా ఏమైనా మార్పులు చేర్పులు అవసరమైతే వెంటనే చేపట్టాలన్నాయి. ఫేక్ ఫైర్ ఎన్‌వోసీల నేపథ్యంలో హైడ్రా కేసులు పెట్టడం.. ఇంటర్ బోర్డు ఆయా కళాశాలపై చర్యలు తీసుకున్న వేళ.. నిర్వాహకులతో హైడ్రా – ఇంటర్ బోర్డు సంయుక్తంగా సమామేశాన్ని ఏర్పాటు చేశాయి. ఫేక్ ఫైర్ ఎన్‌వోసీలతో విద్యార్థులు భద్రతను గాలిలో పెట్టొద్దని సూచించాయి. ఇదే సమయంలో ఆయా కళాశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నాయి. ఫేక్ ఫైర్ ఎన్‌వోసీలు పెట్టడానికి గల కారణాలపై ఆరాతీశాయి. అనంతరం హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు, ఇంటర్ బోర్డు కార్యదర్శి శ్రీమతి అభిలాష అభినవ్ గారు మాట్లాడారు. ఫేక్ ఫైర్ ఎన్‌వోసీల పేరిట కళాశాలల యాజమాన్యాలను ఇబ్బంది పెట్టడం ఇరు శాఖల ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. కళాశాలల యాజమాన్యాలు కోరిన విధంగా ప్రతి ఏటా కాకుండా రెండేళ్లకోసారి రెన్యూవల్ చేసుకునే వెసులుబాటును కల్పిస్తామని హైడ్రా కమిషనర్ చెప్పారు. అలాగే రెండో స్టైర్‌కేస్ ఉండేలా చర్యలు తీసుకోవాలని.. పాత భవనాలకు వెసులుబాటు లేకపోతే ప్రత్యామ్నాయం చూడాలని సూచించారు.

# పాక్ రూపాయి బలం.. భారత రూపాయి బలహీనం!

పాక్ రూపాయి బలపడటం ఆశ్చర్యకరమే.. కానీ అంతకంటే ముఖ్యమైన ప్రశ్న భారత రూపాయి ఎందుకు బలహీనపడుతోందన్నదే. కరెన్సీ పతనాన్ని తాత్కాలిక పరిణామం గా కాకుండా, దాని వెనుక ఉన్న ఆర్థిక కారణాలను ప్రభుత్వం గంభీరంగా పరిశీలించాల్సిన సమయం ఇది.

పాకిస్తానీ రూపాయి బలపడుతుండగా.. భారత రూపాయి బలహీనపడటం నిజంగా ఆశ్చర్యం కలిగించే పరిణామమే. ఆర్థికంగా భారత్‌తో పోలిస్తే పాకిస్తాన్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో ఈ పరిణామం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది.

అయితే కరెన్సీ విలువలో వచ్చిన మార్పును మాత్రమే చూసి ఒక దేశం బలపడుతోందని, మరో దేశం బలహీనపడుతోందని తేల్చడం సరికాదు. పాకిస్తానీ రూపాయి స్థిరత్వం వెనుక ఐఎంఎఫ్ సాయం, విదేశీ మారక నిల్వల నిర్వహణ వంటి తాత్కాలిక అంశాలు ఉండవచ్చు. అదే సమయంలో భారత రూపాయిపై డాలర్ బలం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, వాణిజ్య లోటు వంటి అంతర్జాతీయ పరిణామాలు ప్రభావం చూపుతున్నాయి.

అయినా ప్రశ్న మాత్రం తప్పదు. పాకిస్తానీ రూపాయి నిలబడుతుంటే.. భారత రూపాయి ఎందుకు బలహీనపడుతోంది? ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా ఉన్నప్పటికీ, కరెన్సీపై ఒత్తిడి ఎందుకు కొనసాగుతోంది?

ఇది ప్రభుత్వానికి కూడా ఆలోచించాల్సిన అంశమే. రూపాయి విలువను కాపాడటం అంటే కేవలం మార్కెట్‌లో జోక్యం చేసుకోవడం కాదు. ఎగుమతులను పెంచడం, దిగుమతుల భారాన్ని తగ్గించడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, ఆర్థిక స్థిరత్వాన్ని మరింత బలోపేతం చేయడం అవసరం.

సంపాదకీయం
జనంసాక్షి

# ధర్మ టీచర్స్ యూనిటీ-మరో విద్యా విప్లవానికి పిలుపు

**(నేడే ధర్మ టీచర్స్ యూనిటీ రాష్ట్ర విద్యా సదస్సు ఆగస్టు 26)**

దేశాభివృద్ధికి విద్యే పునాది. అయితే భారతదేశ చరిత్రను పరిశీలిస్తే సామాజిక అసమానతల కారణంగా అట్టడుగు వర్గాలు విద్యకు దూరంగా నెట్టబడ్డారు. విద్య కొద్దిమంది ఆధిపత్య వర్గాల చేతిలో బందీ అయినది. అందరికీ విద్య అందాలనీ అక్షర ఉద్యమానికి పిలుపునిచ్చిన తొలి మహనీయుల్లో పూలే దంపతులు అగ్రగణ్యులు. సావిత్రిబాయి పూలే మొట్టమొదటి ఉపాధ్యాయురాలిగా ఎన్నో అవమానాలను అధిగమించి బాలికలకు విద్య అందించారు. పూలే దంపతులు, అణగారిన వర్గాల విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన సాహు మహారాజ్ వారసత్వ జ్ఞానంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా విద్య ప్రజాస్వామీకరణకు బలమైన పునాది వేశారు. అందరికీ విద్య అనే లక్ష్యాన్ని రాజ్యాంగం “విద్యా హక్కు చట్టం” ద్వారా చట్టబద్ధం చేసింది. కానీ ఎనిమిది దశాబ్దాల స్వాతంత్ర్య భారతంలో కూడా అట్టడుగు అణగారిన పిల్లలకు నాణ్యమైన, సమాన విద్య అందరికీ అందడం లేదు. ప్రభుత్వ బడుల్లో తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ప్రహరీ, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు వంటి కనీస సౌకర్యాల కొరత తీవ్రంగా వేధిస్తుంది. ప్రభుత్వ అధికారిక గణాంకాల్లో మౌలిక వసతులు ఉన్నట్లు చూపెట్టినప్పటికీ... క్షేత్రస్థాయి వాస్తవాలు మాత్రం ఆందోళన కలిగిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వ విద్యపై పెట్టుబడులు తగ్గడం, విద్యా రంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పెరగడం సామాజిక అసమానతలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. గత దశాబ్ద కాలంలో దాదాపు లక్ష ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. విద్య వ్యవస్థలోని ఈ వైఫల్యాలను ప్రశ్నించకుంటే బావి పౌరుల భవిష్యత్ అంధకారమే.

**సమకాలీన విద్యారంగ సవాళ్లపై సమీక్ష**

రాజ్యాంగం అమల్లోకి వచ్చాక బీసీ ఎస్సీ ఎస్టీలకు విద్యా, ఉపాధి




అవకాశాల లభించాయి. రిజర్వేషన్స్ ద్వారా ఎంతో మంది బీసీ ఎస్సీ ఎస్టీలు ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. కానీ వారి సామాజిక, వృత్తిపరమైన సమస్యలు, హక్కులు, ఆత్మగౌరవానికి తగిన ప్రాధాన్యం లభించడం లేదు. ఈ సామాజిక అన్యాయాన్ని ప్రశ్నించాల్సిన మెజార్టీ ఉపాధ్యాయ సంఘాలు ఆధిపత్య భావజాలాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో ధర్మ టీచర్ యూనియన్ (డీటీయూ) ఆవిర్భావం ఒక చారిత్రక అవసరంగా నిలుస్తోంది.

చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి రోజైన జనవరి 3న,2023 ఆమె పూర్వీకుల జన్మస్థలమైన బోధన్ కేంద్రంగా డీటీయూ ప్రారంభమైంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులతో పాటు అగ్రకుల ప్రజాస్వామ్య ఉపాధ్యాయులను కలుపుకొని ఈ సంఘం ముందుకు సాగుతోంది. పూలే, సాహు మహారాజ్–,అంబేద్కర్ ల ఆలోచన స్ఫూర్తితో నడుస్తున్న ధర్మ టీచర్స్ యూనిటీ రాష్ట్రస్థాయి"విద్యా సదస్సు" ఆగస్టు 26వ తేదీన, బుధవారం హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనుంది. ఈ విద్యా సదస్సు ద్వారా దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో సమస్త విద్యారంగం ఎదుర్కొబోతున్న సవాళ్లు ఏమిటి..? విద్యా వ్యవస్థను ప్రభుత్వం ఏ స్థాయిలో నిర్లక్ష్యం చేస్తున్నది..? తద్వారా బీసీ ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ఎంతటి నష్టం కలుగుతుంది.. ? బీసీ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయుల జీవితాలపై ఇది ఎంతటి ప్రభావం చూపబోతు ంది..? మొత్తంగా బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలకు విద్యని అందకుండా చేసే వ్యవస్థాగత కుట్ర ఏ విధంగా జరుగుతుంది...? దీంట్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర ఏ స్థాయిలో ఉంది ..? ఇందులో “వర్ణ క్యాపిటలిజం” యొక్క దోపిడీ ఏ విధంగా ఉంది ..? ఈ అంశాలపై గంభీరమైన చర్చని ఈ విద్యా సదస్సు వేదిక కాబోతున్నది. అంతేకాకుండా సమాజంపై వస్తున్న ఈ సవాళ్లను ఎదుర్కొనడం ఈ సమస్యలకి పరిష్కారం చూపడమే లక్ష్యంగా ఈ సదస్సుని ఏర్పాటు చేయడం జరిగింది. అనేకమంది మేధావులు, విద్యారంగ నిపుణులు హాజరు కానున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు, ప్రగతిశీల ఉపాధ్యాయులు, పీడిత వర్గాల మార్పు కోసం పని చేసే విద్యారంగ మేధావులు, విద్యార్థులు అందరూ ఈ సదస్సుకు తప్పకుండా రాగలరని రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేస్తుంది.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428

# మార్క్స్ చెప్పింది ఐక్యత.. కొంతమంది తమ స్వార్థం కోసం చేస్తున్నది చీలిక!

మార్క్సిజాన్ని నమ్మేవారిని కార్ల్ మార్క్స్ ఎక్కడా చీలిపొమ్మని చెప్ప లేదు. కార్మిక వర్గం ఐక్యంగా నిలబడాలని, దోపిడీకి వ్యతిరేకంగా సంఘటిత పోరాటం చేయాలని మార్క్సిజం బోధిస్తుం ది. కానీ నేడు మార్క్సిజం పేరుతో రాజకీయంగా, సంస్థాగతంగా, భావజాల పరంగా ఏర్పడుతున్న అనేక చీలికలను చూస్తే అసలు మార్క్సిజం లక్ష్యం ఏమిటి? దాని ఆచరణ ఏమిటి? అనే ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. ఒకే లక్ష్యం కోసం పోరాడుతున్నామని చెప్పుకునే వారు చిన్న చిన్న విభేదాల పేరుతో విడిపోవడం, కొత్త కొత్త గుంపులు ఏర్పాటు చేసుకోవడం, చివరకు తమ గుంపే అసలైన విప్లవ శక్తి అని ప్రకటించుకోవడం ఒక విచిత్రమైన రాజకీయ సంస్కృతిగా మారింది.

మార్క్సిజం యొక్క ప్రాథమిక సారాంశాన్ని అర్థం చేసుకుంటే ఈ చీలికల రాజకీయాలకు ఎంత దూరమో స్పష్టమవుతుంది. మనుష లంతా సమానులనే భావన మార్క్సిస్టు ఆలోచనకు పునాది. మనిషిని మనిషి దోపిడీ చేయని సమాజం కావాలి. కులం, వర్గం, సంపద, అధికారంతో ఒక మనిషి మరొక మనిషిపై ఆధిపత్యం చెలాయించే వ్యవస్థ అంతం కావాలి. ఉత్పత్తి సాధనాలపై కొద్ది మంది వ్యక్తుల ఆధిపత్యం కాకుండా సమాజ ప్రయోజనాలకు అనుగుణంగా వాటిని నిర్వహించే వ్యవస్థ రావాలి. విద్య, వైద్యం, ఉపాధి వంటి మౌలిక అవసరాలను ప్రజల హక్కులుగా గుర్తించే సామాజిక వ్యవస్థ ఏర్పడాలి. ఇవన్నీ కేవలం సిద్ధాంతపరమైన మాటలు కాదు. దోపిడీ లేని సమాజ నిర్మాణం కోసం మార్క్సిజం ప్రతిపాదించిన విస్తృత లక్ష్యాలలో భాగం. దేశాల మధ్య శత్రుత్వాలు, యుద్ధాలు, ఆధిపత్య పోరాటాలు తగ్గి మానవ సమాజం మరింత సమానత్వం, సహకారం వైపు పయనించాలన్నదే ఆ దృక్పథం. మనిషిని దేశ సరిహద్దులకే పరిమితం చేయకుండా విశాలమైన మానవ సమాజం గురించి ఆలోచించడం మార్క్సిస్టు అంతర్జాతీ యతలోని ముఖ్యమైన అంశం. దోపిడీ వ్యవస్థను కొనసాగించాలనుకునే శక్తులకు, దోపిడీని అంతం చేసి సమసమాజాన్ని నిర్మించాలనుకునే శక్తులకు మధ్య ఘర్షణ తప్పదని మార్క్సిజం చెబుతుంది. ఆ వర్గ విభేదాలను అర్థం చేసుకోకుండా సమాజ పరివర్తనను అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. అయితే ఈ వర్గ పోరాటాన్ని మరిచి, తోటి మార్క్సిస్టులపైనే నిరంతరం యుద్ధం చేయడం మాత్రం మార్క్సిజం కాదు. దోపిడీ వ్యవస్థను ప్రశ్నించాల్సిన శక్తి తమలో తామే పరస్పరం శత్రువులుగా మారితే దాని వల్ల లాభపడేది ఎవరు? కార్మికులు కాదు. అణగారిన ప్రజలు కాదు. దోపిడీ వ్యవస్థను కాపాడుకోవాలనుకునే శక్తులే.

అందుకే మార్క్సిజాన్ని నమ్మేవారికి అత్యంత అవసరమైనది ఐక్యత. ఒకే ప్రాథమిక లక్ష్యాలను అంగీకరించే వారు కలిసి పనిచేయడం రాజకీయంగా, చారిత్రకంగా అవసరం. ప్రతి చిన్న తేడా వచ్చినప్పు డూ సంస్థను చీల్చడం, కొత్త పార్టీ ఏర్పాటు చేయడం, పాత సంస్థను శత్రు సంస్థగా చిత్రీకరించడం వల్ల విప్లవోద్యమం బలపడదు. దానికి విరుద్ధంగా బలహీనపడుతుంది. ప్రజల్లో విశ్వసనీయత కోల్పోతుంది. సంస్థాగత క్రమశిక్షణతో కూడిన ప్రజాస్వామ్య ప్రక్రియ లేకపోతే ఏ ఉద్యమమైనా వ్యక్తుల అభిప్రా యాల ఆధారంగా నడిచే గుంపుల సమాహారంగా మారుతుంది.

ఇక్కడే కేంద్రీకృత ప్రజాస్వామ్యం అనే భావనకు ప్రాధాన్యం వస్తుం ది. నిర్ణయాలు ప్రజాస్వామ్యంగా చర్చించాలి.

ఇంకో ముఖ్యమైన విషయం అభ్యుదయ శక్తులతో సంబంధం. ప్రతి ఒక్కరూ మార్క్సిజంలోని ప్రతి అంశాన్ని ఒకే విధంగా అర్థం చేసుకో వాల్సిన అవసరం లేదు. సమానత్వాన్ని కోరేవారు, దోపిడీని వ్యతిరేకి ంచేవారు, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడేవారు, విద్యా-వైద్యం-ఉపాధి వంటి మౌలిక హక్కులను ప్రజలకు అందించాలని కోరేవారు, సామాజిక న్యాయం కోసం నిలబడేవారు విస్తృత అభ్యుదయ ఉద్యమంలో భాగస్వాములు కావచ్చు. కీలకమైన కొన్ని సిద్ధాంతపరమైన అంశాలపై భిన్నాభిప్రాయాలు ఉన్నంత మాత్రాన వారిని పూర్తిగా దూరం చేయడం ద్వారా ఉద్యమం బలపడదు. విస్తృత ప్రజా ఐక్యతను నిర్మించాల్సిన అవసరం ఉంది. కానీ చీలిక లను సమర్థించుకునే రాజకీయ సంస్కృతి మాత్రం మరో దిశలో వెళ్తోంది. కార్మికుడి వేతనం, రైతు భూమి, విద్యార్థి విద్య, పేదవాడి వైద్యం, నిరుద్యోగి ఉపాధి, మహిళ భద్రత, అణగారిన వర్గాల సామాజిక గౌరవం వంటి సమస్యలను ప్రజా ఉద్యమాలుగా మలచడం. ప్రజల మధ్యకి వెళ్లి వారిని సంఘటితం చేయడం. దోపిడీకి వ్యతిరేకంగా సమష్టి శక్తిని నిర్మించడం. ఇవే విప్లవ రాజకీయాల అసలు పరీక్షలు.

మార్క్సిజం పేరుతో చీలిపోవడం సులభం. ఒక గుంపును ఏర్పాటు చేసుకుని కొత్త జెండా ఎగరవేయడం కూడా సులభమే. కానీ విభిన్న అభిప్రాయాలున్న వారిని ఒకే వేదికపై నిలబెట్టడం, పరస్పర గౌరవంతో చర్చించడం, సామాన్య లక్ష్యాలపై కలిసి పోరాడడం చాలా కష్టం. అందుకే నిజమైన రాజకీయ పరిపక్వత చీలికలో కాదు-ఐక్యతను నిర్మించడంలో కనిపించాలి.

మార్క్సిజం లక్ష్యం దోపిడీ లేని సమాజం. ఆ లక్ష్యం సాధించాలంటే దోపిడీ శక్తులపై పోరాడే ప్రజా శక్తిని పెంచాలి. అదే సమయంలో మనలోని అనవసర విభేదాలను తగ్గించాలి. సిద్ధాంతపరమైన తేడాలను చర్చించాలి. తప్పులను విమర్శించాలి. అవసరమైతే కఠినంగా విమర్శించాలి. కానీ విమర్శ లక్ష్యం వ్యక్తిని నాశనం చేయడం కాకుండా ఉద్యమాన్ని సరిదిద్దడం కావాలి. విమర్శ ఐక్యతను మరింత బలపరచాలి తప్ప చీలికకు ఆయుధంగా మారకూడదు. సోషలిజం అనేది కేవలం ఒక పార్టీకి, ఒక నాయకు డికి, ఒక గుంపుకు చెందిన ఆస్తి కాదు. అది దోపిడీ, అసమాన తలకు వ్యతిరేకంగా మానవ సమాజం సాగించే దీర్ఘకాలిక పోరా టం. ఆ పోరాటంలో మార్క్సిస్టులు మాత్రమే కాదు, అనేక అభ్యుద య శక్తులు కూడా భాగస్వాములు కావచ్చు. అందువల్ల చిన్న చిన్న భేదాలను పెద్ద గోడలుగా నిర్మించడం కాకుండా, సామాన్య లక్ష్యాల చుట్టూ విస్తృత ఐక్యతను నిర్మించాల్సిన అవసరం ఉంది.

ఇప్పటికైనా మార్క్సిజం పేరుతో ఏర్పడిన చీలికలను ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. మన చీలికల వల్ల కార్మిక వర్గం బలప డిందా? పేద ప్రజల జీవితం మెరుగుపడిందా? దోపిడీ శక్తులు బలహీనపడ్డాయా? ప్రజల్లో సోషలిజంపై నమ్మకం పెరిగిందా? అనే ప్రశ్నలకు నిజాయితీగా సమాధానం చెప్పుకోవాలి. సమాధానం ప్రతికూలంగా ఉంటే, పాత పద్ధతులను మార్చుకోవాల్సిందే. తోటి మార్క్సిస్టును తిట్టడం విప్లవం కాదు. ప్రతి భిన్నాభిప్రాయాన్ని చీలికగా మార్చడం విప్లవం కాదు. వ్యక్తిగత అహంభావాన్ని సిద్ధాంతంగా ప్రకటించడం అసలు మార్క్సిజం కాదు. ప్రజల ఐక్యతను, కార్మిక వర్గ ఐక్యతను, అభ్యుదయ శక్తుల ఐక్యతను నిర్మించడం-దోపిడీకి వ్యతిరేకంగా సమష్టి పోరాటాన్ని బలపరచడం-అదే నిజమైన మార్గం.

ఎందుకంటే చీలికలు ఎన్నో జెండాలను సృష్టించవచ్చు. కానీ ఐక్యత మాత్రమే ప్రజా శక్తిని నిర్మిస్తుంది. చీలికలు నాయకులను పెంచవ చ్చు. కానీ ఐక్యతే ఉద్యమాన్ని పెంచుతుంది. చీలికలు వ్యక్తిగత అహంభావాలకు తాత్కాలిక సంతృప్తిని ఇవ్వవచ్చు. కానీ సమసమాజ నిర్మాణానికి అవసరమైన శక్తిని మాత్రం ఇవ్వలేవు. సోషలిజం లక్ష్యంగా ఉన్నవారు ముందుగా తమ మధ్య గోడలను తగ్గించుకోవాలి. మార్క్సిజం పేరుతో చీలిపోవడం కాదు-మార్క్సిజం స్ఫూర్తితో ఐక్యమై దోపిడీ వ్యవస్థపై పోరాడటమే నేటి ప్రధాన అవసరం. చీలికలతో సోషలిజం రాదు.

వచ్చినా మిగలదు. ఐక్యతతోనే సమసమాజ నిర్మాణానికి బలమైన పునాది పడుతుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## చీఫ్ జస్టిస్ చేతుల మీదుగా డిగ్రీ వద్దు!

డిగ్రీ కోసం కలలుగన్నాం,
న్యాయం కోసం చదువుకున్నాం,
న్యాయమే మా ఊపిరిగా
పుస్తకాలతో పోరాడాం.
కానీ...
న్యాయం కోసం నిలబడిన విద్యార్థులపై
దాడి జరిగినప్పుడు,
వారి కన్నీళ్లకు విలువ లేకపోతే–
ఆ చేతుల మీదుగా
మా డిగ్రీ ఎందుకు తీసుకోవాలి?
“వీడియోలు చూసే టైమ్ లేదు”
అంటూ వినిపించిన మాటలు,
బాధితుల గొంతుకకు బదులుగా
వెటకారపు నవ్వులు వినిపించిన వేళలు–
మా మనసుల్లో ప్రశ్నలై మిగిలాయి.
జంతర్ మంతర్ నేలపై
పడిన విద్యార్థుల కన్నీటి చుక్కలు
ఇంకా ఆరలేదు...
వారి గొంతుల్లోని నినాదాలు
ఇంకా గాలిలోనే ఉన్నాయి...
అలాంటి వేళ
న్యాయం చదివిన మా చేతులకు
అవమానం అనిపించే
ఒక సన్మానం మాకు ఎందుకు?
నల్సార్ విద్యార్థుల స్వరం–
ఒక్కరి స్వరం కాదు,
వందల హృదయాల ప్రతిధ్వని!
డిగ్రీ కాగితం మాత్రమే కాదు,
అది మా విలువలకు ప్రతీక.
మా విద్యకు గుర్తింపు.
మా భవిష్యత్తుకు తొలి అడుగు.
అందుకే మా విజ్ఞప్తి–
లిచీఫ్ జస్టిస్‌ను ఆహ్వానించవద్దులి
మా విలువలను అవమానించవద్దు.
న్యాయం అంటే
చట్టంలోని అక్షరాలు మాత్రమే కాదు,
అన్యాయం జరిగినప్పుడు
బాధితుడి పక్కన నిలబడటం కూడా!
విద్యార్థి కన్నీటిని
చూడగలిగిన కళ్లే
న్యాయానికి నిజమైన ప్రతీకలు.
మా డిగ్రీని
ఎవరి చేతుల మీదుగా అందుకున్నామన్నది
కాదు,
ఏ విలువల కోసం నిలబడ్డామన్నదే
మా గర్వం!
450 గొంతులు కలిస్తే
అది కేవలం లేఖ కాదు–
ఒక ప్రశ్న!
ఒక ప్రశ్న కాదు–
ఒక నిరసన!
ఒక నిరసన కాదు–
న్యాయం కోసం విద్యార్థి సమాజం
లేవనెత్తిన స్వరం!
డిగ్రీ తీసుకునే రోజు
మా తలలు వంగకూడదు...
మా మనస్సాక్షి మమ్మల్ని
ప్రశ్నించకూడదు...
అందుకే–
“న్యాయం కోసం చదివిన మాకు
న్యాయంపై నమ్మకం కావాలి;
ఆ నమ్మకాన్ని దెబ్బతీసే చేతుల నుంచి
డిగ్రీ మాత్రం వద్దు!”

నామాల సాయిబాబా
యువ న్యాయవాది

# రాజకీయ ఖైదీల విడుదలకు కొత్త భాష కావాలి!

***(మావోయిస్టులు లేరంటున్నప్పుడు.. ఆ పేరుతో మిగిలిన యూఏపీఏ కేసుల భవిష్యత్తేమిటి..?)***


రాజకీయ ఖైదీల విడుదల కోసం మరోసారి ఒక చర్చ మొదలవుతోంది. జైళ్లలో ఏళ్లుగా విచారణ ఖైదీలుగా ఉన్నవారిని విడుదల చేయాలని, యూఏపీఏ కేసులను ఎత్తివేయాలని, ప్రజా ఉద్యమకారులు, మేధావులు, రచయితలు, న్యాయవాదులు, జర్నలిస్టులు, ఆదివాసీలు, మైనార్టీలపై నమోదైన కేసులను సమీక్షించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. వీటిని స్వాగతించాల్సిందే. ఈ డిమాండ్ల వెనుక ఉన్న మానవీయ ఆవేదనను కూడా కొట్టిపారేయలేం. ఒక మనిషి నేరం నిరూపించబడకముందే సంవత్సరాల తరబడి జైలులో ఉండటం న్యాయవ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను ప్రశ్నించే పరిస్థితి. కానీ ఈ సమస్యను కేవలం “రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి” అనే నినాదం దగ్గరే ఆపేస్తే, అసలు ప్రశ్నకు సమాధానం దొరకదు. ఇప్పుడు ఈ ఉద్యమానికి కొత్త భాష అవసరం. కొత్త కార్యాచరణ అవసరం. ముఖ్యంగా యూఏపీఏ బాధితుల అనుభవాలను కేంద్రంగా చేసుకుని, ప్రతి కేసును శాస్త్రీయంగా, న్యాయపరంగా, పారదర్శకంగా సమీక్షించే విధానం కోసం డిమాండ్ చేయాల్సిన సమయం వచ్చింది.

అందులో మొదటి ప్రశ్న చాలా సూటిగా ఉంది. మావోయిస్టు ఉద్యమం లేదని ప్రభుత్వాలే ప్రకటిస్తున్నప్పుడు, ఆ ఉద్యమంతో సంబంధం ఉందనే ఆరోపణ లపై ఇంకా జైళ్లలో ఉన్నవారి కేసుల భవిష్యత్తు ఏమిటి..? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా రాజకీయ ఖైదీల సమస్యను పరిష్కరించామని చెప్పడం సాధ్యం కాదు. మావోయిస్టు ఉద్యమం ముగిసిందని ప్రకటించడం ఒక రాజకీయ, భద్రతా అంచనా కావచ్చు. దాని ఆధారంగా ప్రతి కేసు స్వయంచాలకంగా రద్దు కావాల్సిన అవసరం లేదు. కానీ పరిస్థితులు మారిపోయినప్పుడు పాత కేసులను కూడా అదే దృష్టితో కొనసాగించడం ఎంతవరకు సమంజసం అన్నది మాత్రం పరిశీలించాలి. ఒకప్పుడు ఒక సంస్థతో సంబంధం కలిగి ఉన్నాడనే ఆరోపణ ఉండవచ్చు. కానీ ఇప్పుడు ఆ వ్యక్తిపై నిర్దిష్టంగా ఉన్న నేరం ఏమిటి..? దానికి ఆధారాలు ఏమిటి..? అతని మీద హింసాత్మక చర్యకు సంబంధించిన ఆరోపణ ఉందా..? విచారణ ఎందుకు పూర్తికాలేదు..? సంవత్సరాల నిర్బంధానికి ఇంకా న్యాయపరమైన అవసరం ఉందా..? ఇవి మావోయిస్టు అనుకూల ప్రశ్నలు కావు. ఇవి న్యాయ పరమైన ప్రశ్నలు.

ఒక వ్యక్తిపై కేసు నమోదవడం ఒక విషయం. నేరం నిరూపించబడటం మరో విషయం. ఈ రెండింటి మధ్య ఉన్న దూరాన్ని న్యాయవ్యవస్థ కాపాడాలి. లేకపోతే విచారణ ఖైదీగా గడిపిన సంవత్సరాలే ఒక విధమైన శిక్షగా మారిపోతాయి. చివరకు కేసు బలహీనపడినా, నిర్దోషిగా విడుదలైనా, అతను కోల్పోయిన జీవితాన్ని ఎవరు తిరిగి ఇస్తారు..? అందుకే యూఏపీఏ వంటి కఠిన చట్టాల విషయంలో “కేసు ఉంది” అనే ఒక్క మాట సరిపోదు. కేసు ఎంత పాతది..? ఆరోపణ ఏమిటి..? ఆధారాలు ఏమిటి.? విచారణ ఎంత వరకు వచ్చింది.. నిందితుడు ఎంతకాలంగా జైలులో ఉన్నాడు..? బెయిల్ ఎందుకు నిరాకరించబడింది..? అనే ప్రశ్నలకు సమాధానాలు కావాలి.

ఇక్కడే రాజకీయ ఖైదీల ఉద్యమానికి శాస్త్రీయమైన దారి అవసరం. రాజకీయ ఖైదీ అనే పదానికీ స్పష్టమైన ప్రమాణాలు ఉండాలి. రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొన్న ప్రతి వ్యక్తినీ రాజకీయ ఖైదీగా పరిగణించడం ఎంత సరైంది కాదో, ఒక వ్యక్తిపై “మావోయిస్టు” అనే ఆరోపణ ఉందని అతని కేసు మొత్తం రాజకీయ కోణంలోనే చూడటం కూడా అంతే ప్రమాదకరం. ప్రజా ఉద్యమకారుడు, రాజకీయ కార్యకర్త, రచయిత, న్యాయవాది, జర్నలిస్టు, సానుభూతిపరుడు, సాయుధ కార్యకలాపాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న వ్యక్తి, వీరి కేసులన్నింటినీ ఒకే గాటన కట్టలేం. అందుకే వ్యక్తి రాజకీయ గుర్తింపును కాదు, కేసు వాస్తవాలను ప్రమాణంగా చేసుకోవాలి. ఇదే సందర్భంలో యూఏపీఏ బాధితుల పాత్ర అత్యంత కీలకం. జైలు జీవితం అనుభవించిన వ్యక్తికి నిర్బంధం అంటే ఏమిటో తెలుసు. బెయిల్ కోసం ఎదురుచూడటం అంటే ఏమిటో తెలుసు. కోర్టు వాయిదా కుటుంబంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలుసు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా కేసు ముద్ర జీవితాన్ని ఎలా వెంటాడుతుం దో తెలుసు. కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా ఎలా దెబ్బతింటుందో తెలుసు. అందుకే యూఏపీఏ బాధితులను కేవలం బాధితులుగా కాకుండా ప్రజాస్వామిక విధాన చర్చలో అనుభవ సాక్షులుగా చూడాలి. వారి అనుభవాలను పత్రబద్ధం చేయాలి. ఎప్పుడు అరెస్టయ్యారు..? ఏ సెక్షన్లు పెట్టారు..? ఎంతకాలం జైలులో ఉన్నారు..? ఎన్ని సార్లు బెయిల్ ప్రయత్నిం చారు..? విచారణ ఏ స్థితిలో ఉంది..? విడుదల తర్వాత పరిస్థితి ఏమిటి..? కుటుంబం ఎలాంటి నష్టాన్ని ఎదుర్కొంది..?

ఇలాంటి సమాచారంతో ఒక “యూఏపీఏ బాధితుల అనుభవ పత్రం” రూపొందించవచ్చు. ఇది కేవలం ఒక ఉద్యమ పత్రం కాకుండా, భవిష్యత్తులో చట్టపరమైన, విధానపరమైన మార్పులకు ఉపయోగపడే ప్రజా డాక్యుమెంట్‌గా మారుతుంది. ఇంకో ముఖ్యమైన ప్రతిపాదన కూడా అవసరం. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న రాజకీయ, యూఏపీఏ కేసుల కోసం స్వతంత్ర కేసు సమీక్ష వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఇందులో మాజీ న్యాయమూర్తులు, న్యాయ నిపుణులు, మానవ హక్కుల నిపుణులు, ప్రజా




న్యాయవాదులు, జైలు పరిపాలన నిపుణులు, అవసరమైతే మాజీ యూఏపీఏ ఖైదీల అనుభవ ప్రతినిధులు ఉండాలి. ఈ వ్యవస్థ ఎవ్వరినీ నిర్దోషిగా ప్రకటించే రాజకీయ వేదికగా ఉండకూడదు. దాని పని ప్రతి కేసు స్థితిని పరిశీలించడం మాత్రమే. ఎంతకాలంగా విచారణ సాగుతోంది..? విచారణ వేగవంతం చేయాల్సిన అవసరం ఉందా..? బెయిల్‌ను పునఃపరిశీలించాల్సిన పరిస్థితి ఉందా..? ఆరోగ్యం, వయస్సు, కుటుంబ పరిస్థితి వంటి మానవీయ అంశాలను పరిగణలోకి తీసుకోవచ్చా..? పాత కేసుల్లో ప్రాసిక్యూషన్ వద్ద ఇప్పటికీ తగిన ఆధారాలు ఉన్నాయా..? ఇలాంటి ప్రమాణాల ఆధారంగా కేసులను వర్గీకరించి, వేగవంతమైన న్యాయ ప్రక్రియకు మార్గం చూపాలి. ఇది చట్టాన్ని బలహీనపరచడం కాదు. చట్టాన్ని మరింత బాధ్యతాయుతంగా అమలు చేయడం. ఇక్కడ మరో అంశాన్ని కూడా నిర్లక్ష్యం చేయలేం. జైలు నుంచి విడుదల కావడం సమస్యకు ముగింపు కాదు. ఏళ్ల తరబడి జైలులో ఉన్న వ్యక్తి ఉద్యోగం కోల్పోయి ఉండవచ్చు. కుటుంబం ఆర్థికంగా కూలిపోయి ఉండవచ్చు. పిల్లల చదువు దెబ్బతిని ఉండవచ్చు. ఆరోగ్యం క్షీణించి ఉండవచ్చు. కేసులు ఇంకా కొనసాగుతుండవచ్చు. అందుకే విడుదలతో పాటు పునరావాసం కూడా ప్రభుత్వ విధానంలో భాగం కావాలి. న్యాయ సహాయం, వైద్య సహాయం, ఉపాధి, కుటుంబ పునరేకీకరణ, పిల్లల విద్య వంటి అంశాలపై ప్రత్యేక పునరావాస పథకం అవసరం. ఎందుకంటే జైలు తలుపు తెరవడం విముక్తికి మొదటి అడుగు మాత్రమే. ఈ ఉద్యమంలో వామపక్షాల పాత్ర కూడా కీలకం. వామపక్షాలు చారిత్రకంగా పౌరహక్కులు, ప్రజా ఉద్యమాలు, రాజకీయ నిర్బంధం వంటి అంశాలపై పోరాడాయి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం ఖండనలు, ప్రకటనలు, ధర్నాలతో సరిపెట్టుకోకూడదు.

వామపక్షాలు ఈ సమస్యను డేటా ఆధారిత ప్రజాస్వామిక ఉద్యమంగా మార్చాలి. దేశవ్యాప్తంగా యూఏపీఏ కేసులపై సమాచారం సేకరించాలి. ఎంతమంది విచారణ ఖైదీలు..?ఎంతమంది సంవత్సరాలుగా జైలులో ఉన్నారు..? ఎన్ని కేసుల్లో విచారణ ప్రారంభం కాలేదు..? ఎన్ని కేసుల్లో బెయిల్ నిరాకరణకు కారణాలేమిటి..? ఎన్ని కేసుల్లో నిందితులు చివరకు నిర్దోషులుగా బయటపడ్డారు.. విడుదలైన తర్వాత వారి పరిస్థితి ఏమిటి..? ఈ సమాచారాన్ని ప్రజల ముందుంచాలి. అంతేకాదు, తమ భావజాలానికి దగ్గరగా ఉన్నవారి హక్కులకే కాకుండా, తమకు రాజకీయంగా భిన్నమైన వ్యక్తుల పౌర హక్కుల కోసం కూడా నిలబడాలి. ప్రజాస్వామిక హక్కులకు పార్టీ గీతలు ఉండకూడదు. అప్పుడు మాత్రమే రాజకీయ ఖైదీల ఉద్యమానికి మరింత నైతిక బలం వస్తుంది.

ఆగస్టు 29న జరిగే ధర్నా ఒకరోజు కార్యక్రమంగా ముగియకూడదు. అది ఒక దీర్ఘకాలిక ప్రజాస్వామిక కార్యాచరణకు ఆరంభం కావాలి. జైళ్లలో ఉన్న వారి జాబితా, కేసుల స్థితి, కుటుంబాల పరిస్థితి, యూఏపీఏ బాధితుల అనుభవాలు, న్యాయ నిపుణుల అభిప్రాయాలు, ఇవన్నీ కలిపి ఒక సమగ్ర ప్రజా నివేదిక రూపొందించాలి. ప్రభుత్వం ముందు కూడా డిమాండ్లు స్పష్టంగా ఉండాలి. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న యూఏపీఏ కేసులకు ప్రత్యేక న్యాయ సమీక్ష చేపట్టాలి. మావోయిస్టు ఉద్యమం ముగిసిందన్న ప్రభుత్వ ప్రకటనల నేపథ్యంలో పాత కేసుల అవసరాన్ని, ఆధారాలను, నిర్బంధ కాలాన్ని పునఃపరిశీలించాలి. ఏళ్లుగా విచారణ ఖైదీలుగా ఉన్నవారి కేసులను ప్రాధాన్యంతో పరిష్కరించాలి. వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, మహిళలు, మైనర్లు, ఆదివాసీల కేసులకు ప్రత్యేక మానవీయ దృష్టి ఇవ్వాలి. విడుదలైన యూఏపీఏ బాధితులకు పునరావాస విధానం రూపొందించాలి. యూఏపీఏ చట్టం అమలు, ముఖ్యంగా దీర్ఘకాలిక నిర్బంధం, బెయిల్, విచారణ జాప్యంపై సమగ్ర సమీక్ష జరగాలి. ఇవి ఒక రాజకీయ వర్గానికి అనుకూలమైన డిమాండ్లు కావు. ఇవి రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో న్యాయం సకాలంలో అందాలనే డిమాండ్లు. చివరికి మనం ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. నేరం చేసినవారిని చట్టం శిక్షించాలి. హింసకు పాల్పడినవారిపై చర్య ఉండాలి. దేశ భద్రతను కాపాడాలి. అదే సమయంలో ఒక భావజాలాన్ని నమ్మడం మాత్రమే నేరంగా మారకూడదు. ప్రభుత్వాన్ని విమర్శించడం నేరంగా మారకూడదు. ప్రజా సమస్యపై ప్రశ్నించడం నేరంగా మారకూడదు. ఆరోపణను తీర్పుగా మార్చకూడదు. రాజ్యం నేరాన్ని ఎదుర్కోవాలి.. ఆలోచనను కాదు. మావోయిస్టు ఉద్యమం ముగిసిందని ప్రభుత్వాలు చెబుతున్నప్పుడు, ఇప్పుడు ప్రభుత్వం ముందు నిలవాల్సిన అసలు ప్రశ్న ఇదే.. ఆ ఉద్యమం పేరుతో మిగిలిపోయిన కేసుల భవిష్యత్తు ఏమిటి..? ఈ ప్రశ్నకు సమాధానం కోసం రాజకీయ ఖైదీల విడుదల ఉద్యమం నినాదాన్ని దాటి న్యాయ సంస్కరణల దిశగా అడుగు వేయాలి. జైలు తలుపులు తెరవడం మాత్రమే విముక్తి కాదు. అన్యాయం గా ఒక మనిషిని జైలుకు తీసుకెళ్లే పరిస్థితులు పునరా వృతం కాకుండా వ్యవస్థను మార్చడమే అసలు విముక్తి.



రాజేందర్ దామెర (దారా)
జర్నలిస్ట్
rajenderdamera@gmail.com

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**శంషాబాద్, ఆగస్టు 21 (జనంసాక్షి) :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శంషాబాద్ సర్కిల్ పరిధిలోని ఆర్బీ నగర్‌లో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు నాటిన ప్రతి మొక్కను కంటికి రెప్పలా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు వన మహోత్సవం, హరితహారం వంటి కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు, శంషాబాద్ డివిజన్ అధ్యక్షుడు దూడల వెంకటేష్ గౌడ్, మాజీమున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, మాజీ సర్పంచ్ గణేష్ గుప్తా, కె. మహేందర్ రెడ్డి, సంజయ్ యాదవ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఆర్బీ నగర్ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫీజు రీయంబర్స్‌మెంట్ కోసం కదంతొక్కిన విద్యార్థులు

- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడి
- పెండింగ్ నిధులు చెల్లించకుంటే విద్యార్థి సత్తా చూపుతాం

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఆగస్టు 25 (జనం సాక్షి) :** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్ నిధులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి లోకంతో కలిసి మహబూబ్‌నగర్‌లో ఏబీవీపీ భారీ ర్యాలీతో పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు అర్జున్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోకుండా పెడచెవిన పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు . రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైనే ఆధారపడి ఉన్నత చదువులు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. అయితే, ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిల గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ ఛార్జీల బకాయిలను ఒకే విడతలో విడుదల చేయాలని వారు డిమాండ్ చేసారు. ఫీజుల బకాయిల



కారణంగా కాలేజీల యాజమాన్యాలు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను ఆపుతున్నాయని, దీనివల్ల పైచదువులకు ఇబ్బంది కలుగుతోందని, దీనిపై ప్రభుత్వం స్పందించాలి అని కోరారు . ప్రభుత్వం విద్యార్థులు సంక్షేమం మరిచి మొద్దు నిద్రలో ఉండటం బాధాకరమైన విషయం అని అన్నారు. విద్యార్థులు ఫీజులు చెల్లించండి అని రోడ్డెక్కితే ఏ మాత్రం చలనం లేకపోవడం ముఖ్యమంత్రి పని తీరుకు నిదర్శనమన్నారు. విద్యాశాఖ మంత్రి కాస్తా వివాహారయాత్ర మంత్రిగా మారి ఢిల్లీకి సూటుకేసులు మోయడమే పనిగా పెట్టుకున్నారని వారు విమర్శించారు . ఒక పక్క విద్యార్థులు పెండింగ్ లో ఉన్న ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తుంటే కనికరం లేని ఈ విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలనీ డిమాండ్ చేసారు. ఫీజు రీయంబర్స్ మెంట్ డబ్బులు చెల్లించని పక్షంలో రాబోవు రోజుల్లో విద్యార్థులు ఆగ్రహానికి గురికాక తప్పదని వారు హెచ్చరించారు.

లిక్యాంప్ కార్యాలయం ముట్టడిలి పెండింగ్ లో ఉన్న ఫీజు రీఎంబర్స్ మెంట్ డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడించారు . ఒక్క సారిగా విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆ ప్రాంతమంతా భారీ ఆందోళనలతో లతో హోరెత్తింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దని హెచ్చరించారు.

### భారీగా పోలీసుల మోహరింపు తీవ్ర ఉద్రిక్తత

విద్యార్థులు ,ఏబీవీపీ నాయకులు క్యాంప్ కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో అక్కడ స్వల్ప ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. పోలీసులు విద్యార్థి నాయకులను అడ్డుకుని, పలువురిని ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యార్థుల ఖాతాల్లో స్కాలర్‌షిప్ డబ్బులు జమ చేయకపోతే, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తామని మరియు ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పాలమూరు కరువు ప్రాంతాల అభివృద్ధికి కృష్ణా జలాలే పరిష్కారం

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



**మహబూబ్‌నగర్, బ్యూరో ఆగస్టు 25 (జనం సాక్షి) :** పాలమూరు జిల్లాలోని కరువు పీడిత ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే కృష్ణా జలాలను పంట పొలాలకు పారించాల్సిందేనని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీటీడీ కళ్యాణమండపం వద్ద ధర్నా చౌక్ లో ఉమ్మడి పాలమూరు జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన సమితి (జేఏసీ) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మహా ధర్నా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. కృష్ణా జలాల్లో పాలమూరుకు రావలసిన న్యాయమైన వాటా కోసం గతంలో జలసాధన ఉద్యమాలు జరిగాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంలో విఫలం కావడం వల్ల రైతాంగానికి తీవ్ర నష్టం జరిగిందని విమర్శించారు. డిండి ఎత్తిపోతల పథకానికి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నీటిని తరలించడం రెండు జిల్లాల ప్రజల మధ్య వైషమ్యాలు రేపడమే అవుతుందన్నారు. పాలమూరు ప్రజల సాగునీటి పోరాటాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ప్రభుత్వంతో చర్చిస్తానని, పెండింగ్ ప్రాజెక్టుల అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం జేఏసీ నేతలు మాట్లాడుతూ.. ఉమ్మడి పాలమూరుకు నష్టం కలిగించే డిండి లిఫ్ట్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించి, ఉదండాపూర్ నుంచి కాలువ లిఫ్ట్ పనులు పూర్తి చేయాలని, ఆర్డీఎస్ వాటా నీటిని పొలాల్లోకి పారించాలని కోరారు.

## జూబ్లీహిల్స్ సీఐపై సస్పెన్షన్ వేటు




**హైదరాబాద్, ఆగస్టు 25 (జనం సాక్షి) :** జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ముత్తు యాదవ్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. మాజీ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ వ్యవహారంలో విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో అలసత్వం వహించడంతో పాటు, సుమంత్‌ను పట్టుకునే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఉన్నతాధికారుల విచారణలో తేలినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ముత్తు యాదవ్‌పై శాఖాపరమైన చర్యలు చేపట్టారు. కాగా, ముత్తు యాదవ్ కేవలం మూడు వారాల క్రితమే జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన కొద్దికాలానికే సస్పెన్షన్‌కు గురికావడం పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఆరుగురు నకిలీ డాక్టర్లు అరెస్ట్

- సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ మెరుపు దాడులు

**సికింద్రాబాద్, ఆగస్టు 25 (జనంసాక్షి) :** ఎలాంటి అర్హత లేకుండా డాక్టర్ల అవతారమెత్తి అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆరుగురు నకిలీ డాక్టర్లను హైదరాబాద్ కమీషనర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ బృందం స్థానిక రాంగోపాల్‌పేట్, చిలకలగూడ, ఓయూ పోలీస్ స్టేషన్, దొమల్‌గూడ పోలీస్ స్టేషన్ల సిబ్బందితో కలసి క్లినిక్‌లపై మెరుపు దాడులు చేపట్టింది. చిలకలగూడలో 'ఫ్యామిలీ క్లినిక్' పేరిట నకిలీ ఎంబీబీఎస్, బీహెచ్ఎంఎస్ సర్టిఫికెట్లతో చలామణి అవుతున్న కాంపౌండర్ నీలగిరి ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. అలాగే రాణిగంజ్‌లో 'సంధాని క్లినిక్' నిర్వహిస్తూ ఇంట్లోనే తయారుచేసిన మిశ్రమాలను సోరియాసిస్ వ్యాధికి మందుగా ఇస్తున్న అదన్ సంధాని, లోయర్ ట్యాంక్‌బండ్‌లోని 'సాయి రామ్ క్లినిక్' లో గత 26 ఏళ్లుగా కాంపౌండర్ అనుభవంతో డాక్టర్‌గా వ్యవహరిస్తున్న ఎం. శ్రీనివాస్‌ను పోలీసులు పట్టుకున్నారు. వీటితో పాటు చిలకలగూడలో 'సాయి రామ్ క్లినిక్' నడుపుతున్న పెద్దపాట్ల సదానంద్,



మణికేశ్వర్‌నగర్‌లో 'సరోజిని పాలి క్లినిక్' నిర్వహిస్తున్న చింతలూరి రమేష్, అదే ప్రాంతంలో 15 ఏళ్లుగా 'సూర్య క్లినిక్' నడుపుతున్న శివరాత్రి లింగయ్యను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి పెద్ద ఎత్తున నకిలీ ఎంబీబీఎస్ సర్టిఫికెట్లు, స్టెతస్కోప్‌లు, బీపీ మిషన్లు, ప్రిస్క్రిప్షన్ ప్యాడ్‌లు, స్టాంపులతో పాటు 277 ఇంజెక్షన్లు, 933 మాత్రలు, సెలైన్ బాటిళ్లు, వైద్య పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. సరైన గుర్తింపు, అర్హత పత్రాలు లేని నకిలీ డాక్టర్ల వద్దకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, అనుమానాస్పద క్లినిక్‌ల వివరాలు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని డీసీపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జె. రాజశేఖర్ నేతృత్వంలోని అధికారుల బృందం ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించింది.

## విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి




**హబ్సిగూడ, ఆగస్టు 26 (జనం సాక్షి) :** విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీయన్ రామచంద్రరావు చేపట్టిన 48 గంటల నిరవధిక నిరాహార దీక్షకు ఉప్పల్ నియోజకవర్గం హబ్సిగూడ డివిజన్ బీజేపీ శ్రేణులు సంఘీభావం ప్రకటించారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఫీజుల బకాయిలపై బీజేపీ పోరాటం' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు పార్టీ నాయకత్వం ఉద్యమాన్ని చేపట్టింది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన సుమారు రూ.15 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను తక్షణమే విద్యార్థులకు అందించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఆవరణలో కొనసాగుతున్న 48 గంటల నిరాహార దీక్ష రెండో రోజున ఉప్పల్ నియోజకవర్గం హబ్సిగూడ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు పాల్గొని రాష్ట్ర అధ్యక్షుడు శ్రీయన్ రామచంద్రరావుకు తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ ఓబీసీ నాయకులు వేములకొండ సోమశేఖర్ గౌడ్, మేడ్చల్ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు జిల్లెల్ల రవీందర్ రెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు కొండేరు స్రవంతి, శైల శ్రీ తదితరులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇకనైనా స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

## రుణ లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలి



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 25 (జనం సాక్షి) :** జిల్లాలో వివిధ రంగాలకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను వంద శాతం సాధించేలా బ్యాంకర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని అదనపు కలెక్టర్ పాండు సూచించారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశంలో పంట రుణాలు, వ్యవసాయ, ప్రాధాన్యతా రంగాల రుణాల పంపిణీపై ఆయన సమీక్షించారు. పంట రుణాల లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు మంజూరు చేసి స్వయం ఉపాధికి చేయూతనివ్వాలని ఆదేశించారు. ఎల్‌డీఎం సుధీర్ కుమార్ మాట్లాడుతూ.. జూన్ 2026 నాటికి జిల్లాలో క్రెడిట్-డిపాజిట్ (సీడీ) రేషియో 196.40 శాతంగా నమోదైందని తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, నాబార్డ్ ఏజీఎం కృష్ణ తేజ, పరిశ్రమల శాఖ జీఎం తుల్జా నాయక్, ఆర్‌బీఐ రీజినల్ మేనేజర్, మెప్మా అధికారులు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలి



**చేవెళ్ల, ఆగస్టు 25 (జనంసాక్షి) :** ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేసి ఆయా వర్గాలకు న్యాయం చేయాలని ప్రజా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చౌక్కంపేట ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా స్పష్టమైన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు ఇళ్లు, రుణాలు, ఉపాధి అవకాశాలు, విద్య, మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు వారి హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంజనేయులు అన్నారు. డిక్లరేషన్‌లో పేర్కొన్న హామీలను వెంటనే అమలు చేసి ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, ప్రజా సంక్షేమ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారస్థులకు సైబర్ నేరాలు, సీసీ కెమెరాలపై అవగాహన సదస్సు



**కందుకూరు, ఆగస్టు 25 (జనంసాక్షి) :** మండల పరిధిలోని వ్యాపారస్థులకు సైబర్ నేరాలు, భద్రతా చర్యలు సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై కందుకూరు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కందుకూర్ ఎక్స్ రోడ్డు సమీపంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి ఎస్‌హెచ్‌ఓ, హెచ్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సైబర్ నేరాలపై అప్రమత్తత అత్యవసరమని ఆన్‌లైన్ మోసాల పట్ల వ్యాపారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రధానంగా సమాజంలో పెరిగిపోతున్న నకిలీ వీడియో కాల్స్, సోషల్ మీడియా మోసాలు, 'డిజిటల్ అరెస్ట్' పేరిట బెదిరింపులు, ఆన్‌లైన్ లోన్ యాప్ లెక్కింపుల ఉచ్చులో పడవద్దని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీ (ర్యూ), పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దు అని తెలిపారు. వ్యాపార సముదాయాల భద్రత దృష్ట్యా ప్రతి షాపులోనూ తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. కేవలం దుకాణం లోపలే కాకుండా, బయట రహదారులు స్పష్టంగా కనిపించేలా కెమెరాలను అమర్చడం ద్వారా నేరాల నివారణకు, నేరస్థులను త్వరగా పట్టుకోవడానికి పోలీసులకు ఎంతగానో సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూర్ ఎస్ఐలు పరమేశ్, మహేందర్, గ్రామ సర్పంచ్ సరికొండ పాండు, వార్డు మెంబర్లు, పోలీస్ సిబ్బందితో పాటు స్థానిక కిరాణా శాపు యజమానులు, వ్యాపారస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి

- ఆర్అండ్ఆర్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి
- అదనపు కలెక్టర్ మధుమోహన్

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 25 (జనం సాక్షి) :** జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణ వేగవంతం చేయాలని, ఆర్ అండ్ ఆర్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల పురోగతికి భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, అటవీ సంబంధిత సమస్యలపై మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధులు ఇప్పటికే విడుదల చేసినందున పనులను పెండింగ్ లో ఉంచకుండా వేగవంతం చేయాలన్నారు.




ప్రాజెక్టుల వారీగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు నిర్దేశిత సమయంలోగా పరిహారం చెల్లించాలని ఆదేశించారు. అవసరమైన అన్ని ప్రక్రియలు పూర్తై నిధులు అందుబాటులో ఉన్న చోట వెంటనే పరిహారం చెల్లించాలన్నారు. సాగునీటి ప్రాజెక్టుల పురోగతికి సంబంధించిన అటవీ సమస్యలు, పెండింగ్ చెల్లింపులు, క్లియరెన్సులు, ఇతర అడ్డంకులను గుర్తించి ఇరిగేషన్ శాఖకు వివరాలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూసేకరణ, పరిహారం చెల్లింపులు, ఆర్ అండ్ ఆర్, అటవీ సమస్యలు, ఆర్థిక అనుమతులు, టోకెన్లు, ఇతర ఆర్థిక, ప్రక్రియాపరమైన కారణాలతో ఏ సాగునీటి ప్రాజెక్టు ఆలస్యమవుతున్నా సంబంధిత కలెక్టర్, చీఫ్ ఇంజినీర్ సమస్యను స్పష్టంగా గుర్తించి వెంటనే ప్రభుత్వానికి నివేదించాలన్నారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. గద్వాలలోని ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ మధుమోహన్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. వీసి అనంతరం ఆయన జిల్లా అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, జీ సెక్షన్ పర్యవేక్షకులు మల్లికార్జున్, తదితరులున్నారు.

## తక్కువ స్థలంలో ఎక్కువ అంతస్తులు నిర్మించిన వాటిపై చర్యలు



**నిజాంపేట్, ఆగస్టు 25 (జనం సాక్షి) :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని దొమ్మరపోచంపల్లి సర్వే నెంబర్ 168లో అనుమతులు లేకుండా కేవలం 100 గజాల స్థలంలో చేపట్టిన గ్రౌండ్ +4 అంతస్తుల అక్రమ నిర్మాణాన్ని మంగళవారం అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మనీ కరణ్ మాట్లాడుతూ... నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే ఏ నిర్మాణాన్ని కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ అనుమతులు లేని వాటిపై నిఘా తీవ్రతరం చేస్తామని దుండిగల్ సర్కిల్ పరిధిలో తక్కువ గజాలలో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. నిబంధనల ఉల్లంఘనకు చెక్ అనుమతులు ఒకలా తీసుకొని, అదనంగా అనధికారిక నిర్మాణాలు ఉన్నటువంటి చేపడుతున్న వా వాటిని గుర్తిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో వాటన్నిటిపై భారీ కూల్చివేతలు ఖాయం అని ఇలాంటి అనధికార నిర్మాణాలను ఎప్పటికప్పుడు గుర్తించి, కఠిన చర్యలు తీసుకుంటూ డిమాలిషన్లు కొనసాగిస్తామని డిప్యూటీ కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కలుషితం లేని తాగునీటిని అందించడమే ప్రధాన లక్ష్యం

- ఐదు రాష్ట్రాల్లో సేవ కార్యక్రమాలు
- తిగుల్ పాఠశాలలో నీటిశుద్ధి కేంద్రం ప్రారంభం
- విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ
- కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ ప్రకాష్ రెడ్డి



**జగదేవ్‌పూర్, ఆగస్టు 25 (జనం సాక్షి) :** కలుషితం లేని మంచినీటిని అందించడమే కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్ సంస్థ ప్రధాన లక్ష్యం అని ఐదు రాష్ట్రాల్లో ఐదు వందల వరకు నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆ సంస్థ అసిస్టెంట్ మేనేజర్ ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కమ్యూనిటీ ప్యూర్ వాటర్ ఆధ్వర్యంలో నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసి స్థానిక సర్పంచ్ రజిత పరశురామ్ తో కలిసి ప్రారంభించారు. అలాగే విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదు రాష్ట్రాల్లో సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగా ఎక్కువగా నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సిద్దిపేట జిల్లాలో తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొదటిసారిగా నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేసి ప్రారంభించినట్లు తెలిపారు. పాఠశాలలో 260 మంది విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్ అందించినట్లు చెప్పారు. పాఠశాలలతో పాటు గ్రామాల్లో కూడా నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జగదేవ్ పూర్ మండలంలోని మరిన్ని గ్రామాల్లో పాఠశాలలో నీటిశుద్ధి కేంద్రాలను ప్రారంభిస్తామని తెలిపారు. సుమారు ఐదు వందల కుటుంబాలు ఉన్న గ్రామాల్లో సంస్థ ఆధ్వర్యంలో నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. విద్యార్థులు ప్రతిరోజు మూడు నుండి ఐదు లీటర్ల తాగునీటిని తీసుకోవాలని సూచించారు. నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కోరారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనసూయ మాట్లాడుతూ నీటిశుద్ధి కేంద్రాన్ని మా పాఠశాలలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంస్థ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల పట్ల ప్రత్యేకంగా సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్ రావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ సూర్యప్రకాశ్, టెక్నీషియన్ పవన్, సర్పంచ్ రజిత పరుశురాం, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ భూమయ్య, వార్డు సభ్యులు మల్లేశం, అశోక్, రాధా సత్తయ్య,నాయకులు దయానంద్ రెడ్డి, ఉపాధ్యాయులు అనిల్, సత్తయ్య, చంద్రశేఖర్, నాగరాజు, హర్షవర్ధన్ సత్యనారాయణ విద్యార్థులు పాల్గొన్నారు.

## బీచుపల్లి మత్స్యకారులకు సేఫ్టీ పరికరాలు అందించాలి



**ఎర్రవల్లి, ఆగస్టు 25 (జనం సాక్షి) :** బీచుపల్లి పుణ్యక్షేత్రంలో కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో పర్యాటకులను రక్షించేందుకు మత్స్యకారులకు సేఫ్టీ పరికరాలు అందించాలని కోరుతూ మత్స్యకారులు వినతిపత్రం అందజేశారు.కృష్ణా తీరంలో స్నానాలు, అస్థికల నిమజ్జనం, వినాయక, దుర్గామాత నిమజ్జనాల సమయంలో ప్రమాదవశాత్తు నీటిలో పడే ఘటనలు జరుగుతున్నాయని, వారిని కాపాడేందుకు మత్స్యకారులు నిత్యం సేవలు అందిస్తున్నారని తెలిపారు.ఇందుకోసం కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా సేఫ్టీ జాకెట్లు, రెస్క్యూ బోటు, తాళ్లు, వలలు తదితర రక్షణ సామగ్రి సమకూర్చాలని అధికారులను ఆదేశించారని, వాటిని త్వరగా అమలు చేయాలని కోరారు. స్వచ్ఛత, గ్రామ అభివృద్ధి సమావేశంలో ఈవో పురేందర్, పంచాయతీ కార్యదర్శి అరుణ, సర్పంచ్ విజిత, ఉపసర్పంచ్ నాగరాజులకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘ అధ్యక్షుడు నర్సింలు, ఉపాధ్యక్షుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి



**మక్తల్, ఆగస్టు 25 (జనంసాక్షి) :** మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు, నీటి సరఫరా ప్రక్రియను కౌన్సిలర్ అల్కురి పావని అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అల్కూరి పావని మాట్లాడుతూ, వార్డు పరిధిలో ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లకుండా పారిశుధ్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హనుమంతు, కమిషనర్ రాజయ్య, ఏఈ నాగ శివ సహకారంతో నిధులు వెచ్చించి వార్డులోని లీకేజీలు, పారిశుధ్య సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు వల్లంపల్లి లక్ష్మణ్, మార్కెట్ డైరెక్టర్ శాలెం, మున్సిపల్ సిబ్బంది విష్ణు, సత్యం గౌడ్, రాజశేఖర్, రహీం, ప్రవీణ్ కుమార్, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, ఆగస్టు 25 (జనం సాక్షి) :** వన మహోత్సవంలో భాగంగా జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి, పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని తారా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. మొక్కలను నాటడం ఒకరోజు కార్యక్రమంగా కాకుండా, వాటిని నిరంతరం సంరక్షించి పెద్దవిగా పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెట్లు పెరిగితేనే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం అందుతుందని పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు, యువత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటుతున్నారని చెప్పారు. అన్ని మున్సిపాలిటీల పరిధిలో ఇంటి వద్ద ,పరిసరాలలో నాటుకునేలా అవసరమైన మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. దీనివల్ల ప్రతి ఇంటి పరిసరాల్లో పచ్చదనం పెంపొందడంతో పాటు పట్టణాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. జిల్లాలో నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేపడుతున్నామని, తద్వారా మొక్కల వివరాలను నమోదు చేసి వాటి సంరక్షణపై పర్యవేక్షణ కొనసాగిస్తామని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి, భావితరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణాన్ని అందించేందుకు అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాద్ రెడ్డి, డీఆర్‌డీఓ జ్యోతి, డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ లలితాదేవి, పీసీబీ అధికారి విజయలక్ష్మి, హౌసింగ్ పీడీ చలపతిరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తహసీల్దార్ జయరాం నాయక్, అటవీ శాఖ అధికారులు, కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల భద్రత కోసమే భూభారతి సర్వే

- జకినాలపల్లిలో భూభారతి అవగాహన సదస్సు



**ఉర్కొండ, ఆగస్ట్ 25 (జనం సాక్షి) :** రైతుల భద్రత కోసమే ప్రభుత్వం భూభారతి సర్వేను చేపట్టిందని ఆర్ఐ రాఘవేందర్ తెలిపారు. ఊరుకొండ మండలం జకినాలపల్లి గ్రామంలో మంగళ వారం భూభారతి సర్వేపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ రాఘవేందర్ మాట్లాడుతూ.. రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించేందుకు, సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు భూభారతి సర్వే ఉపయోగపడుతుందన్నారు. ప్రతి రైతు తమ భూములకు సంబంధించిన పత్రాలతో సర్వేలో పాల్గొని సహకరించాలని కోరారు. రైతులు తమ భూముల వివరాలను స్పష్టంగా తెలియజేయాలని, ఏవైనా సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కదిరే శేఖర్ యాదవ్, జీపీఓ సునీత, సర్వేయర్ శివరంజన్, పంచాయతీ సెక్రటరీ ముస్తఫా, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పవర్ బ్యాంక్ పేలి విద్యార్థికి తీవ్ర గాయాలు

- చార్జింగ్‌లో ఉండగానే ఒక్కసారిగా పేలుడు..
- నాలుగో తరగతి విద్యార్థికి తీవ్ర గాయాలు



**కోహిర్, ఆగస్టు 25 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలోని కొత్తూర్ (డి) ప్రభుత్వ పాఠశాలలో పవర్ బ్యాంక్ అకస్మాత్తుగా పేలడంతో నాలుగో తరగతి విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. కొత్తూర్ (డి) గ్రామానికి చెందిన నరేష్, శ్రీదేవి దంపతుల కుమారుడు వై. రాకేష్ పాఠశాలలో చదువుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పవర్ బ్యాంక్ ఒక్కసారిగా పేలడంతో విద్యార్థి శరీరంపై కాలిన గాయాలయ్యాయి. పేలుడు శబ్దంతో పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పేలుడు ధాటికి రాకేష్ పొట్ట, కాళ్లతో పాటు శరీరంలోని పలు భాగాల్లో గాయాలయ్యాయి. దీంతో ఉపాధ్యాయులు వెంటనే స్పందించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం కుటుంబ సభ్యులు విద్యార్థిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చిన్నారి గాయపడిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.పవర్ బ్యాంకుల వినియోగంపై అప్రమత్తత అవసరం.ఈ ఘటనతో పాఠశాలలో కొద్దిసేపు ఆందోళనకర పరిస్థితి నెలకొంది. నాణ్యత లేని పవర్ బ్యాంకులు, మొబైల్ బ్యాటరీల వినియోగం ఎంత ప్రమాదకరమో ఈ ఘటన మరోసారి చాటిచెబుతోంది. ముఖ్యంగా చార్జింగ్‌లో ఉన్న సమయంలో పవర్ బ్యాంకులను వేడి ప్రదేశాల్లో ఉంచడం, దెబ్బతిన్న లేదా ఉబ్బిన బ్యాటరీలను వినియోగించడం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్ పరికరాలను పాఠశాలలకు తీసుకువచ్చే విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

## అర్హులైన ఓట్ల తొలగింపుపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రతి ఓటరును పరిరక్షించుకోవాలి
- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి, ఆగస్టు 25 (జనంసాక్షి) :** కల్వకుర్తినియోజకవర్గ స్థాయి బూత్ స్థాయి ఏజెంట్లతో వెల్దండ మండలంలోని తోడేటి చెన్నారెడ్డి గార్డెన్స్‌లో విస్తృత సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ ఇన్‌చార్జి రాచమల్ల సిద్దేశ్వర్ హాజరై బూత్ స్థాయి ఏజెంట్లకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా రాచమల్ల సిద్దేశ్వర్ మాట్లాడుతూ.. ఈ నెల 27న ప్రతి గ్రామపంచాయతీలో నిర్వహించనున్న గ్రామసభలకు పార్టీకి చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు, ముఖ్య నాయకులు సమన్వయంతో హాజరుకావాలని సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటు కూడా తొలగించబడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో దాదాపు 66 వేల ఓట్లు, రాష్ట్రవ్యాప్తంగా 75 లక్షల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని తమకు సమాచారం ఉందన్నారు. ప్రతి ఓటరును పరిరక్షించుకోవడంతో పాటు ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించడం బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి బూత్ స్థాయి ఏజెంట్ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. గ్రామసభల్లో ఓటర్ల వివరాలను పరిశీలించి, అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. పార్టీ సంస్థాగత బలోపేతానికి బూత్ స్థాయి ఏజెంట్లు కీలకంగా పనిచేయాలని అన్నారు.సమావేశంలో జిల్లా,మండల స్థాయి నాయకులు, బూత్ స్థాయి ఏజెంట్లు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రమిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చు



**పటాన్‌చెరు, ఆగస్టు 25 (జనం సాక్షి) :** విద్యార్థులు కష్టపడి చదువుకుని శ్రమిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చు అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం నాడు నారాయణఖేడ్ నియోజకవర్గం కల్హేర్ మండలం, పోమ్యా నాయక్ తండాకు చెందిన ధారావత్ భాస్కర్ యుపిఎస్సి నిర్వహించిన 'సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్' పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, అసిస్టెంట్ కమాండెంట్ ఫలితాల్లో దేశంలోనే 58వ ర్యాంక్, ఎస్టీ కేటగిరీ విభాగంలో ఆల్ ఇండియా 1వ ర్యాంక్ సాధించారు. గతంలో భాస్కర్ కోచింగ్ నిమిత్తం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు నీలం మధు ముదిరాజ్ అతనికి సహాయం అందించడమే కాకుండా, శిక్షణ సమయంలోనూ నిరంతరం ప్రోత్సహించి చేయూతనందించారు. ఉన్నత ఉద్యోగానికి ఎంపికైన అనంతరం ధారావత్ భాస్కర్, మంగళవారం నాడు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ ను తన కార్యాలయంలో కలిసి తనకు అందించిన సహాయ సహకారాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా భాస్కర్ పట్టుదల, కష్టపడే తత్వాన్ని నీలం మధు అభినందిస్తూ అతడిని శాలువాతో సన్మానించారు.అనంతరం నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు పట్టుదలతో చదివి కేంద్ర ప్రభుత్వంలో అసిస్టెంట్ కమాండెంట్ లాంటి ఉన్నత స్థాయి ఉద్యోగం సాధించడం ఎంతో గర్వకారణమని, నేటి యువతకు భాస్కర్ ఆదర్శమని కొనియాడారు. భవిష్యత్తులో భాస్కర్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

## ఘనంగా ఈదమ్మ బోనాలు



**మిడ్జిల్ ఆగస్టు 25 (జనం సాక్షి) :** మండలంలోని మున్ననూరు గ్రామపంచాయతీలో మంగళవారం ఈదమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు మహిళలు బోనాలను పూజించుకొని గ్రామంలోని ప్రధాన విలకుంట ప్రదర్శన చేశారు. హైదరాబాద్ కళాకారులు పోతురాజు శంకరుని వేషధారణలో ప్రజలను ఆకర్షించారు. పోతురాజు విన్యాసాలతో గ్రామంలోని యువకులు ఉత్సాహంగా బోనాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి తోపాటు వివిధ పార్టీల నాయకులు గ్రామ పెద్దలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలి

- ఎంపీడీఓ కిషోర్



**కృష్ణ, ఆగస్టు 25 (జనం సాక్షి) :** ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కృష్ణ మండల ఎంపీడీఓ కిషోర్ పిలుపుఇచ్చారు.మంగళవారంతెలంగాణ వ్యాప్తంగా వన మహోత్సవం -2026 కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశాల మేరకు కృష్ణా మండల ఎంపీడీవో కిషోర్ ఆధ్వర్యంలో కున్సి గ్రామం లో సర్పంచ్ మ్యాకలి సురేష్, ఉప సర్పంచ్ రమేష్ మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. చెట్లుంటే క్షేమం లేకుంటే క్షామం అని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఫీల్డ్ అసిస్టెం ట్, వార్డు మెంబర్ రమేష్ పాల్గొన్నారు.

## భూసేకరణ, నిర్వాసితుల పునరావాస పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి




**వనపర్తి బ్యూరో, ఆగస్టు 25 (జనంసాక్షి) :** జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, నిర్వాసితులకు పునరావాస కేంద్రాల ఏర్పాటు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు.మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూసేకరణ, నిర్వాసితులకు పునరావాస కేంద్రాల ఏర్పాటు, అటవీ ప్రాంతాల్లోని భూములకు సంబంధించిన సమస్యలపై సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో పాలమూరు--రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నట్లు తెలిపారు. సమస్యలు ఉన్న ప్రాంతాల్లో రైతులతో సంప్రదింపులు జరిపి, వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే భూసేకరణ పూర్తయిన భూములకు అవార్డులు పాస్ చేసి, పరిహారం మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వెల్లడించారు.రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందుకోసం భూసేకరణను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడంతో పాటు నిర్వాసితులకు అవసరమైన పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అటవీ శాఖ పరిధిలోని భూసేకరణకు సంబంధించిన సమస్యలను కూడా త్వరగా పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు.ఈ కార్యక్రమాల కోసం రాష్ట్ర ప్రభుత్వం తొలి దశలో రూ.1,050 కోట్ల నిధులు విడుదల చేయగా, రెండో దశలో రూ.6,000 కోట్ల నిధులు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్లు భూసేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, నిర్వాసితులకు పునరావాస కేంద్రాల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సైతం భూసేకరణకు సంబంధించి జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు, దిశానిర్దేశం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్, ఇరిగేషన్ సీఈ రహీముద్దీన్, డిప్యూటీ సీఈ ఎన్. వెంకట్ రెడ్డి, భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ తిరుపతయ్య, జి. సెక్షన్ సూపరింటెండెంట్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లుల్లో రూ.25 కోట్ల ధాన్యం మాయం!

### భైంసా, లోకేశ్వరంలో విజిలెన్స్ తనిఖీలు.. భారీగా నిల్వల గల్లంతు



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 25 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లాలోని భైంసా, లోకేశ్వరం మండలాల్లో రైస్ మిల్లులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వానికి సంబంధించిన ధాన్యం నిల్వల్లో భారీగా లోటు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. భైంసా మండలం దేగం శివారులోని శ్రీరామ రైస్ మిల్లులో 2022--23 యాక్షన్ ప్యాడీకి సంబంధించి తనిఖీలు చేపట్టారు. మిల్లుకు కేటాయించిన 5,922 మెట్రిక్ టన్నుల ధాన్యానికి కేవలం 716 మెట్రిక్ టన్నులు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. దీంతో సుమారు రూ.11.64 కోట్ల విలువైన ధాన్యం లోటు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. అదేవిధంగా లోకేశ్వరం మండలం పుస్పూర్ శివారులోని సీతారామ రైస్ ఇండస్ట్రీస్‌లోనూ తనిఖీలు చేపట్టారు. ఈ మిల్లుకు 6,306 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా.. తనిఖీల్లో 25,575 బస్తాలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. సుమారు రూ.14.10 కోట్ల విలువైన ధాన్యం నిల్వలు అందుబాటులో లేవని అధికారులు గుర్తించినట్లు సమాచారం. తనిఖీల సమయంలో సంబంధిత మిల్లుల యజమానులు, నిర్వహణ బాధ్యతలు చూస్తున్న వారు అందుబాటులో లేనట్లు తెలిసింది. తనిఖీల పూర్తి వివరాలతో నివేదికను సివిల్ సప్లైస్ అధికారులకు అందజేయనున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

# ఫాస్ట్ ఫుడ్స్ సెంటర్లలో కల్తీ ఆహారం

### ఆరోగ్యాలు పాడైపోతున్న పట్టించుకోని అధికారులు
### ప్రజావాణిలో దరఖాస్తు పెట్టుకున్న ఓ యువకుడు





**కౌటాల ఆగస్టు 25 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో పదుల సంఖ్యలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. కని ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.కౌటాల మండల కేంద్రంలో గత సోమవారం ఎంపిడీఓ కార్యాలయం లో నిర్వహించిన ప్రజా వాణి లో ఓ యువకుడు ఫాస్ట్ ఫుడ్ సెంటర్చ లలో కల్తీ ఆహారం పెడుతున్నారని దరఖాస్తు పెట్టుకోవడం చర్చనీయంగా మారింది.అపరిశుభ్రమైన వాతావరణం లో కల్తీ ఆహార పదార్థాలు తయారు చేస్తూ ప్రజల ప్రాణాలు తీస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ప్రమాణాలు పాటించకుండా నాణ్యత లేని కల్తీ ఆహార పదార్థాలు, వాడిన నూనెను మళ్ళీ మళ్ళీ వేడి చేసి వాడుతు,చికెన్ఇ 65,మంచూరియా, నూడుల్స్, ఆకర్షనియంగా కనిపించడానికి క్యాన్సర్ కు కారణమయ్యే సింథటిక్ రంగులను వాడి ప్రజల ఆరోగ్యలను పాడు చేస్తున్నారు.ఫుడ్ సేఫ్టీ అధికారులు మాత్రం పట్టించు కోవడం లేదు. రెండు రోజుల క్రితం ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో ఎగ్ ఫ్రైడ్ రైస్ తీసుకున్న బాధితుడు వెంటనే వాంతులు చేసుకొని ప్రభుత్వ దవాఖాన కు వెళ్లి వైద్యం చేయించుకున్నానని.ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు పట్టించు కోక పోవడం పై ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నట్లు భాధితుడు ఆరోపించారు. తనిఖీలు చేపట్టాలి, జాడి విజయ్ కాంత్ కనికి గ్రామం మండల కేంద్రంలో ఉన్నటువంటి ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లలో తనిఖీలు చేపట్టి ప్రజల ఆరోగ్యాలను పాడు చేస్తున్న సెంటర్ లపై చర్యలు తీసుకోవాలి.ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లో ఎగ్ ఫ్రైడ్ ఆహారం తీసుకుంటే హాస్పిటల్ పాలు అయ్యాను.ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండాలని ప్రజా వాణి లో దరఖాస్తు పెట్టుకున్నాను.

# సీతారామ ప్రాజెక్ట్ అదనపు ఆయకట్టు పనులకు తక్షణం ఆమోదం ఇవ్వాలి



**బయ్యారం, ఆగస్ట్ 25 (జనంసాక్షి) :** సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కింద ఇల్లందు నియోజకవర్గంలో ప్రతిపాదించిన అదనపు ఆయకట్టు పనులకు తక్షణమే పరిపాలనా ఆమోదం తెలిపి, పనులను వేగవంతం చేయాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూలకంటి సీతారాం రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం జలసౌధలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మండలం లోని పలువురు సర్పంచ్‌లతో కలిసి కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క,రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ లను కూడా కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు ప్రయోజనం చేకూర్చే సీతారామ ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘం అనుమతులు సాధించి, 67.05 టీఎంసీల గోదావరి జలాలను కేటాయించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం మెయిన్ కెనాల్ 104 నుంచి జులూరుపాడు వద్ద టన్నెల్‌తో పాటు పాలేరు లింక్ కెనాల్ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. పాలేరు లింక్ కెనాల్, డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీలు 3, 4, 5 పూర్తయితే కామేపల్లి, గార్ల, ఇల్లందు మండలాల్లో సుమారు 33 వేల ఎకరాలకు కొత్తగా ఆయకట్టు ఏర్పడుతుందని అయితే ఆయా మండలాల్లోని మరికొన్ని ప్రాంతాలకు కూడా సాగునీరు అందించాల్సిన అవసరం ఉందనీ తెలిపారు.సీతారామ ప్రాజెక్ట్ కింద ప్రతిపాదించిన 1.13 లక్షల ఎకరాల అదనపు ఆయకట్టులో సుమారు 58 వేల ఎకరాలు ఇల్లందు నియోజకవర్గ పరిధిలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అదనపు ఆయకట్టుకు నీటిని అందించేందుకు ఇల్లందు మండలంలోని లలితాపురం చెరువు వద్ద డెలివరీ సిస్టెర్న్ ఏర్పాటు చేసి, గ్రావిటీ ద్వారా బయ్యారం పెద్ద చెరువుకు నీటిని తరలించి, అక్కడి నుంచి తులారం ప్రాజెక్టుకు లిఫ్ట్ చేయవచ్చని సూచించారు. బయ్యారం పెద్ద చెరువు సామర్థ్యాన్ని పెంచి తులారం ప్రాజెక్టుకు నీటిని తరలిస్తే ఖరీఫ్, రబీ రెండుపంటలు సమృద్ధిగా పండుతాయని తెలిపారు.అదేవిధంగా మహబూబాబాద్ పట్టణ తాగునీటి అవసరాలను కూడా తీర్చే అవకాశం ఉంటుందని అన్నారు. అందువల్ల పాలేరు లింక్ కెనాల్ పనులతో పాటు ఇల్లందు నియోజకవర్గంలోని అదనపు ఆయకట్టు పనులకు తక్షణమే పరిపాలనా ఆమోదం తెలిపి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని మంత్రులను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు.

# ఆసుపత్రులలో వైద్యుల నియామకాలు చేపట్టాలి

### వైద్యులు, సిబ్బందిల కొరతతో వైద్యానికి అంతరాయం



**మంగపేట ఆగస్టు 25(జనంసాక్షి)**

మండలంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులలో ఖాళీలుగా ఉన్న వైద్యులు, సిబ్బందిల నియామకాలు చేపట్టాలని మండల స్థానిక యువత ఆందోళన చేపట్టారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ నిరసనలో ప్రభుత్వ ఆసుపత్రులలో ఖాళీలుగా ఉన్న వైద్యులు,సిబ్బందిల నియామకాలు చేపట్టాలని అలాగే మందుల కొరత లేకుండా అన్ని మందులు రోగులకు అందే విధంగా సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. అలాగే రక్త పరీక్షలకు వచ్చే రోగులకు సత్వరమే రక్త పరీక్షలు చేసి ఫలితాలను అందే విధంగా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్థానిక యువత కోరారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులలో నిరంతరం వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని వారు కోరారు.

# పంటకుంటలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

### ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలి
### వన మహోత్సవ లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలి : మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, ఆగష్టు 25 (జనంసాక్షి) :** పంట కుంటలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని, వన మహోత్సవ లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ లోని సచివాలయం నుంచి గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య, ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మితో కలిసి మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఉపాధి హామీ పనులు, పంటకుంటల నిర్మాణం, మహిళా సంఘాల భవనాల నిర్మాణం, నూతన చేయూత పించన్ల మంజూరు, వన మహోత్సవం తదితర అంశాలపై అన్ని జిల్లాల జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారులు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ములుగు జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 6.18 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 5.32 కోట్ల మొక్కలు నాటి 86 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని ఆదేశించారు. పనికి సిద్ధంగా ఉన్న ప్రతి కూలీకి వారి నివాస ప్రాంతానికి సమీపంలోనే పని అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివాసీ, గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు, పంటకుంటలు, ఇతర నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, నీటి సంరక్షణ, జీవనోపాధికి ఉపయోగపడే ఆస్తుల సృష్టి ఏకకాలంలో జరిగేలా ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని మంత్రి సీతక్క సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఓ రవీందర్, డీపీఓ వెంకయ్య, డిప్యూటీ సీఈఓ, ఏపీడీ, డీపీఎం, ప్లాంటేషన్ మేనేజర్, డీఆర్‌పీ తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు షాక్‌తో మహారాష్ట్రకు చెందిన కార్మికుడు మృతి

### ఎస్సై పోచంపల్లి సతీష్



**చిట్యాల, ఆగస్టు 25 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని గ్యాస్ గోదాం సమీపంలో మంగళవారం విద్యుత్ తీగలు లాగే పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మహారాష్ట్రకు చెందిన ఓ కార్మికుడు మృతి చెందినట్లు ఎస్సై పోచంపల్లి సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు మహారాష్ట్ర, చంద్రాపూర్ జిల్లా, గోందు పిప్రి మండలం, నందవర్ధన్ గ్రామానికి చెందిన తాత్మేశ్వర్ పత్రోజీ అని తెలిపారు., అతని సోదరుడు సచిన్ పత్రోజీ మరికొంత మందితో కలిసి గత ఎనిమిది సంవత్సరాలుగా తిప్పారపు ప్రశాంత్ వద్ద విద్యుత్ స్తంభాలపై వైర్లు లాగే పనులు చేస్తున్నారు.ఈ క్రమంలో మంగళవారం ఉదయం చిట్యాల గ్యాస్ గోదాం సైట్ వద్ద విద్యుత్ స్తంభంపై ఎక్కి వైరు కట్ చేస్తుండగా, ప్రమాదవశాత్తు ఆ వైరు పక్కనే ఉన్న రన్నింగ్ విద్యుత్ లైన్‌కు తగిలింది. దీంతో తీవ్రమైన కరెంటు షాక్ తగలడంతో తాత్మేశ్వర్ స్తంభంపై నుండి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే ఆటోలో చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.మృతుని సోదరుడు సచిన్ పత్రోజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పోచంపల్లి సతీష్ తెలిపారు.

# రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారానికి అవకాశం

### వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మల గీతాంబ
### సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్




**వరంగల్ బ్యూరో, ఆగస్టు 25 (జనం సాక్షి) :** వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ మరియు వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ మాట్లాడుతూ “గౌరవ జాతీయ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు సెప్టెంబర్ 12న శనివారం వరంగల్ జిల్లా కోర్టు మరియు నర్సంపేట కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో రాజీపడదగిన కేసులను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. క్రిమినల్, సివిల్, భూ తగాదాలు, మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు, వివాహ మరియు కుటుంబ వివాదాలు, బ్యాంకింగ్, చెక్ బౌన్స్, విద్యుత్, చిట్‌ఫండ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇన్సూరెన్స్, ఎక్సైజ్, విద్యుత్ చోరీ, కన్స్యూమర్ ఫోరం, ట్రాఫిక్ ఈ-చలాన్లు, ప్రీ-లిటిగేషన్ కేసులు తదితర రాజీపడదగిన కేసులను పరిష్కరించేందుకు జాతీయ లోక్ అదాలత్‌లో అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. కక్షిదారులు తమ కేసుల వివరాలను సంబంధిత కోర్టుల్లో ముందుగానే తెలియజేసి, తమ న్యాయవాదులతో కలిసి నేరుగా హాజరై పరస్పర అంగీకారంతో కేసులను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి ఇప్పటికే పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఎక్సైజ్ శాఖ అధికారులు, ఇన్సూరెన్స్ సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు, బ్యాంకులు మరియు చిట్‌ఫండ్ సంస్థల మేనేజర్లతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి, అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వరంగల్ జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు గుర్తించిన రాజీపడదగిన పెండింగ్ కేసులకు సంబంధించి మొత్తం 2,410 మంది కక్షిదారులకు నోటీసులు జారీ చేసి, రాజీ మార్గం ద్వారా తమ కేసులను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. వీటిలో 2,097 క్రిమినల్ కేసులు, 188 మోటార్ ఆక్సిడెంట్ కేసులు, 125 ఇతర సివిల్ కేసులు ఉన్నట్లు వివరించారు. 1,120 బ్యాంక్ ప్రీ-లిటిగేషన్ కేసులు పరిష్కారానికి గుర్తించినట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌కు ముందు ఈనెల 24 నుండి సెప్టెంబర్, 11వ తేదీ వరకు మూడు బెంచీలతో ప్రీ-లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజీపడదగిన కేసుల కక్షిదారులు తమకు అనుకూలమైన సమయంలో హాజరై, సాయంత్రం 5.00గంటలలోపు కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ న్యాయవాదులతో కలిసి హాజరై రాజీపడదగిన కేసులను సత్వరమే పరిష్కరించుకోవాలని వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా విజ్ఞప్తి చేసారు. ఈ మీడియా సమావేశంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి.పూజ, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు చకిలం.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## టిడబ్ల్యూ పాఠశాలల తనిఖీ

**గూడూరు,ఆగస్టు25(జనంసాక్షి):** గూడూరు మండలంలోని సీతానగరం,లైన్‌తండా గ్రామాల్లోని టీడబ్ల్యూ ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఎస్ఈఆర్పీ వాలు నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న బోధనా విధానాన్ని, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. అనంతరం వాలు నాయక్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో విద్యపై ఆసక్తి పెంచే విధంగా బోధించాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బిక్కు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్ అరెస్టు

### సుమారు 1 కోటి 25లక్షల విలువగల 251 కిలోల గంజాయి
### ఒక ద్విచక్ర వాహనం, 9వేల రూపాయల నగదు,ఒక సెల్‌ఫోన్ స్వాధీనం
### వివరాలు వెల్లడించిన సిపి శ్వేత, ఐపీఎస్



**వరంగల్ బ్యూరో, ఆగస్టు 25 (జనంసాక్షి) :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా, వారి బంగారు భవిష్యత్తును కాపాడటంతో పాటు, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలను విక్రయాలకు పాల్పడే వారిని నియంత్రించి గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా వరంగల్ కమిషనరేట్ పోలీసులు ప్రత్యేక దష్టి పెట్టడం జరిగింది. ఇందులో భాగంగా ఈస్ట్‌జోన్ డిసిపి అంకిత్‌కుమార్ అధ్వర్యంలో దామెర పోలీసులు అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుత్ను నిందితుడుని అదుపులోకి తీసుకోని విచారణ చేయగా గంజాయి కోనుగోలు, విక్రయాలకు సంబంధించి కీలక వివరాలను వెలుగులోకి వచ్చాయి. ఈ మేరకు మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత ఐపీఎస్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ముదిగొండ నాగేశ్వర్ రావు, వయస్సు 55, పులుకుర్తి గ్రామం, దామెర మండలం, హన్మకొండ జిల్లా. ఇతను సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో నిందితుడు తనకు వున్న నెట్‌వర్క్ ద్వారా ఒడిషా రాష్ట్రానికి చెందిన రమేష్ మరియు సుధాకర్ వద్ద తక్కువ ధరకు గంజాయి కోనుగోలు చేసి తెలంగాణ, మహరాష్ట్ర, కర్ణాటక, అంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి నిందితులు ఉర్దు, రాందాస్ శేషరావు బీరదార్ , అక్లీం, షారుఖ్ ఖాన్, షేక్ అక్బర్, నునావత్ రాజుల ద్వారా ఎక్కువ ధరకు విక్రయించినట్లుగా ప్రాధమిక విచారణలో వెల్లడైంది.పోలీసులు పట్టుబడిన నిందితుడు ఇచ్చిన సమాచారం పోలీసులు అతని ఇంటి నుండి సుమారు భారీ మొత్తంలో సుమారు 1కోటి 25లక్షల రూపాయల విలువ గల గంజాయిని స్వాధీనం చేసుకోబడింది. దీనికి సంబంధించి పోలీసులు దర్యాప్తు చేపట్టడంతో పాటు పోలీసులకు పట్టు బడిన నిందితుడు నాగ్వేశ్వర్ రావు నుండి గంజాయి కోనుగోలు చేసిన మిగితా రాష్ట్రాలకు చెందిన నిందితులను పట్టుకొనేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయడం జరిగింది.మత్తు పదార్థాల అక్రమ రవాణాతో పాటు వినియోగంపై తెలంగాణ పోలీస్ విభాగం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడుకోవడంతో పాటు, విక్రయదారులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాము. మత్తు పదార్థాల కట్టిడికై ప్రజలు సైతం వంతు సహకారం అందించాలని ప్రధానంగా ఎవరైన గంజాయి విక్రయాలకు పాల్పడిన, వినియోగించిన స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.గంజాయి స్మగ్లర్‌ను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పరకాల ఏసిపి సతీష్ బాబు, శాయంపేట సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, ఆత్మకూర్ ఇన్స్‌స్పెక్టర్ సంతోష్, దామెర ఎస్సై. వీరభద్రరావు, శాయంపేట ఎస్.ఐ పరమేశ్వర్, పరకాల ఎస్.ఐ రఘుపతితో పాటు ఏఎఓ సల్మాన్ పాషా, దామెర, శాయంపేట కానిస్టేబుళ్ళను సిపి అభినందించారు.


# రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

### చిట్యాల సుహాసిని రెడ్డి



**మావల, ఆగస్ట్ 25(జనం సాక్షి):** గత ఏడాది అధిక వర్షాలతో పంటనష్టపోయిన రైతులకు ఎకరానికి పది వేల చొప్పున పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించి ఇప్పటి వరకు ఇవ్వలేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. రైతులకు పరిహారం చెల్లించాలనే డిమాండ్ ఈనెల 27న తనిషా గార్డెన్లో రైతులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గతేడాది 40 వేల ఎకరాల్లో అధిక వర్షాలతో రైతులు పంట నష్టాపోయారన్నారు. దీనిపై అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేధిక ఇచ్చారన్నారు. ప్రభుత్వం 40 కోట్లు మంజూరు చేసి ఎడాది అవుతున్న రైతుల ఖాతాల్లో ఇంకా జమ కాలేదన్నారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించి బాధిత రైతులతో మాట్లాడడం జరిగిందన్నారు. రైతుల పక్షాన రాజకీయాలకు అతీతంగా ఈనెల 27న తనిషా గార్డెన్లో సమావేశం ఉంటుందన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# వైద్య సేవలపై అధికారుల ఆకస్మిక తనిఖీలు



**దేవరుప్పుల, ఆగస్టు 25 (జనంసాక్షి)** మండలంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు, చిన్నమడూరు, పెద్దమడూరు,సింగరాజుపల్లి ఆరోగ్య ఉపకేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వాణిశ్రీ వనపర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాతా శిశు సంరక్షణ, టీకాల కార్యక్రమాలు, ఎన్‌సీడీ, టీబీ సేవలు, మందుల నిల్వలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

# ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల అడుగులు

- సత్ఫలితాలు ఇస్తున్న అవగాహన కార్యక్రమాలు
- క్షేత్రస్థాయిలో ప్రతి వారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలన
- ఉత్తమ రైతులకు అభినందనలు

**గంభీరావుపేట, ఆగస్ట్ 25 (జనం సాక్షి) :** ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతుల అడుగులు వేస్తున్నారు. దీర్ఘకాలికంగా ఆదాయం ఇచ్చే ఆయిల్ పామ్, అలాగే కూరగాయలు, పూల తోటల సాగు చేస్తున్నారు. కాలానికి అనుగుణంగా పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక దృష్టి.. పక్కా కార్యాచరణ సత్ఫలితాలు ఇస్తున్నాయి. ప్రతి వారం జిల్లా కలెక్టర్ ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తున్న రైతులను నేరుగా కలిసి సాగు విధానాలు, పంట దిగుబడి, ఆదాయం తదితర వివరాలు సేకరిస్తూ.. ప్రభుత్వ సబ్సిడీలు సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. వారికి అభినందనలు తెలియజేస్తున్నారు.



### 1250 ఎకరాల్లో కూరగాయల సాగు

ఎల్‌నినో ప్రభావం, ఇబ్బందులు అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి ఆదాయం పొందాలనే ఉద్దేశం జిల్లాలోని రైతులు దాదాపు 1250 ఎకరాల్లో వివిధ రకాల కూరగాయలు, 35 ఎకరాల్లో వివిధ రకాల పూల మొక్కలు సాగు చేస్తున్నారు. ఆయా పంటల సాగుతో రైతులకు నిరంతర ఆదాయం సమకూరుతున్నది.

సంప్రదాయ వరిసాగుకు స్వస్తి పలికి 25 నుంచి ముప్పై ఏండ్ల పాటు ఆదాయం ఇచ్చే ఆయిల్ పామ్ తోటల సాగు వైపు రైతులు మారారు. ఈ సీజన్లో జిల్లాలో ఇప్పటివరకు 162 మంది రైతులు 420 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేశారు. మొదటి మూడు ఏండ్లపాటు అంతర పంటలు సాగు చేసి ఆదాయం పొందవచ్చు. ప్రస్తుతం ఆయిల్ పామ్ ఒక టన్నుకు రూ. 23 వేలపైగా ధర ఉంది. జిల్లాలో సంప్రదాయ వరి సాగుకు స్వస్తి పలుకుతూ.. మిగితా పంటలు సాగు చేస్తున్న ఆదర్శ రైతులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రతి మంగళవారం క్షేత్రస్థాయిలో కలిసి .. సాగు విధానాలు, దిగుబడి, లాభాలు తదితర అంశాలు తెలుసుకొని.. అభినందిస్తున్నారు.

### రెండు ఎకరాల్లో బంతి పూల సాగు

గంభీరావుపేట మండలం గజ సింగవరంలో రైతు బోయిని మల్లేశం తనకు ఉన్న మూడున్నర ఎకరాల నుంచి రెండు ఎకరాలలో జూలైలో బంతి పూల సాగు చేపట్టారు. ఈ పంట నాటిన 60-65 రోజుల నుంచి సెప్టెంబర్ నుండి ప్రారంభమై డిసెంబర్ వరకు కొనసాగుతుంది. ప్రతి 2-3 రోజుల వ్యవధిలో పూల కోత చేయవచ్చు, ఇది 60-75 రోజుల పాటు కొనసాగుతుంది. ఎకరానికి సుమారు 45-50 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. రెండు ఎకరాల సాగుకు గాను రైతు రూ. 50 వేల నుంచి రూ. 60వేల వరకు ఖర్చు చేశారు. ఇందులో ఉద్యాన శాఖ ద్వారా విత్తనాలు, ఎరువులకు కలిపి 50% రాయితీ లేదా ఎకరానికి రూ. 8వేల చొప్పున గరిష్టంగా ఐదు ఎకరాల వరకు రాయితీ అందనుంది. రైతుకు సగటున ఒక్కో కిలో బంతి పూలకు రూ. 60/- ధర లభిస్తుంది. దసరా, దీపావళి, శుభకార్యాలు, అయ్యప్ప పూజా కార్యక్రమాలతో ఇంకా ఎక్కువ ఆదాయం వచ్చే ఉంది.

### జిల్లా కలెక్టర్ అభినందన..

గజ సింగవరంలో రైతు బోయిని మల్లేశం వరి సాగును వదిలి బంతి పూల సాగు చేస్తుండగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం పరిశీలించారు. ఎన్ని ఎకరాల్లో సాగు చేశారు? పంట ఎన్ని రోజుల్లో చేతికి వస్తుంది? ఎంత ఆదాయం వస్తుంది? అనే వివరాలను రైతు మల్లేశంను అడిగి తెలుసుకున్నారు. అతడిని శాలువాతో సన్మానించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వరి పంటకు ప్రత్యామ్నాయంగా బంతి పూల సాగు చేయడం అభినందనీయమని కొనియాడారు. మిగితా రైతులు ఆదర్శంగా తీసుకొని తమకు ఉన్న భూమిలో ఆరుతడి పంటలు, కూరగాయలు సాగు చేసి ఆదాయం పొందాలని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని పిలుపు నిచ్చారు. ఉద్యానవన శాఖ, ఇతర శాఖల నుంచి వచ్చే ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. పరిశీలనలో సర్పంచ్ ఉమ్మారెడ్డి విమల, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, ఎంపీడీఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవం వేళ చెట్ల నరికివేత

- రోడ్డుపై బైఠాయించిన స్థానికులు



**ముస్తాబాద్, ఆగస్టు 25 (జనం సాక్షి) :** ముస్తాబాద్ మండలంలో వన మహోత్సవానికి భిన్నమైన ఘటన చోటుచేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వన మహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తుండగా. ముస్తాబాద్ మండలంలోని ఓ కాలనీలో చెట్లను నరికివేయడం స్థానికుల్లో ఆగ్రహానికి కారణమైంది. కొన్ని చెట్లను ఇప్పటికే నరికివేయగా, వన మహోత్సవం సందర్భంగా చెట్లు నరికివేస్తున్న విషయం తెలిసి మిగిలిన చెట్లను కొట్టివేయడాన్ని నిలిపివేశారు. దీంతో కాలనీవాసులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కోనోకార్పస్ చెట్ల కారణంగా తమకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వాటి వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు. ఇప్పటికే నరికివేసిన చెట్లతో పాటు మిగిలిన కోనోకార్పస్ చెట్లను కూడా పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు.సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై జ్యోతి, పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డుపై బైఠాయించిన స్థానికులతో మాట్లాడి పరిస్థితిని వివరించి, శాంతింపజేశారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు ఆందోళన విరమించారు.

## రైలు ఢీకొని గొర్రెల కాపరి, 4 గొర్రెలు మృతి

**మాడుగులపల్లి, ఆగస్టు 25 (జనం సాక్షి) :** మండల పరిధిలోని అభంగాపురం వద్ద మంగళవారం ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గొర్రెల కాపరితో పాటు నాలుగు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా నెమ్మికల్ గ్రామానికి చెందిన వేల్పుల కొమరయ్య (60) జీవనోపాధి కోసం గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు ఈ క్రమంలో అభంగాపురం రైల్వే ట్రాక్ పిల్లర్ నంబర్ 106/14 వద్ద గొర్రెలను ట్రాక్ దాటిస్తుండగా వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టింది ఈ తీవ్ర ప్రమాదంలో కొమరయ్యతో పాటు 4 గొర్రెలు తీవ్రంగా గాయపడి స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు కొమరయ్య మృతితో నెమ్మికల్ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## వేములవాడలో కోడెల మృతిపై స్పందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- స్వయంగా పరిశీలిస్తానని తెలిపిన విప్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 25 (జనంసాక్షి) :** దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్న ఆలయ గోశాలలో ఐదు కోడెలు మృతికి సంబంధించిన ఘటనపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. అనారోగ్యంతోనే కోడెలు మృతి చెందినట్లు గోశాల నిర్వాహకులు చెబుతున్నారని, తాను స్వయంగా వెళ్లి పరిశీలిస్తానన్నారు.కోడెల మృతికి కారణాలను పూర్తిస్థాయిలో తెలుసుకుంటనన్నారు.కోడెల మృతికి గల కారణాలను తెలుసుకోవడంతో పాటు గోశాల నిర్వహణ, పశువులకు అందుతున్న వైద్యం,ఆహారం తదితర అంశాలను పరిశీలిస్తానని, అవసరమైన చర్యలు తీసుకుని గోశాలలో అన్ని సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చూస్తానన్నారు.కోడెల మృతిపై సమగ్రంగా విచారణ జరిపి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

## ఆర్టీసీ బస్సులకు అడ్డుగా రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జ్



**అశ్వాపురం, ఆగస్టు 25 (జనంసాక్షి) :** మండలంలోని మారుమూల ఏజెన్సీ గొందిగూడెం పరిసర గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేందుకు రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జిలు ప్రధాన అడ్డంకిగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అశ్వాపురం మండల కేంద్రం నుండి వయ గొందిగూడెం--మొండికుంట రహదారిని డబుల్ లేన్‌గా అభివృద్ధి చేసినప్పటికీ, మార్గంలోని రెండు రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జిల ఎత్తు తక్కువగా ఉండటంతో ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. పినపాక స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషితో సింగిల్ లేన్‌గా ఉన్న రహదారి డబుల్ లేన్‌గా అభివృద్ధి కావడంతో గొందిగూడెం, రామవరం భీమవరం ఎలకలగూడెం, మామిళ్ళ వాయి, వెంకటాపురం, తుమ్మలచెరువు, కొత్తూరు, వేములూరు తదితర పరిసర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. అయితే రహదారి అభివృద్ధి పూర్తయినా అండర్‌పాస్ బ్రిడ్జి సమస్య కారణంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం అందుబాటులోకి రాకపోవడంతో ప్రజల ఇబ్బందులు పూర్తిగా తీరలేదని స్థానికులు చెబుతున్నారు.ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న నేపథ్యంలో ఈ గ్రామాలకు ఆర్టీసీ బస్సులు అందుబాటులోకి వస్తే విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ఇతర ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటున్నారు. రైల్వే శాఖ అధికారులు సమస్యను పరిశీలించి, రెండు అండర్‌పాస్ బ్రిడ్జిల ఎత్తు పెంచడంతోపాటు డబల్ లైన్ గా విస్తరించాలని రహదారిని ఆర్టీసీ బస్సులు సులభంగా రాకపోకలు సాగించే విధంగా నూతన నిర్మాణాలు చేపట్టాలని వాటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక అనుమతులు వెంటనే మంజూరు చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# నేత్రదానం చేసే వారిని ప్రోత్సహించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట, ఆగస్టు 25 (జనంసాక్షి) :** నేత్రాలను దానం చేసే వారిని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.మంగళవారం సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ నేత్రదాన పక్షోత్సవాల అవగాహన, ప్రచార కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు.నేత్రదానం ఒక మహత్తరమైన సామాజిక సేవ అని, ఒక వ్యక్తి మరణానంతరం దానం చేసే నేత్రాలు ఇద్దరు అంధులకు వెలుగును ప్రసాదించే అవకాశం ఉందని తెలిపారు. వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పుట్టిన శిశువు నుండి అన్ని వయస్సుల వారికి నేత్ర రుగ్మతలను గుర్తించి, తగిన చికిత్స అందించి వారికి మంచి చూపుతో ఆరోగ్యకరమైన జీవితం అందించాలని అన్నారు. ప్రజలు నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించుకొని, తమ కుటుంబ సభ్యులకు నేత్రదానం ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు.స్కూల్స్, కాలేజీ విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ల నిర్వహణ కొరకు 90 రోజులలో ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు.మెడికల్ కళాశాలలో లైబ్రరీ నిర్వహణకు సంబంధించి 30 లక్షల రూపాయలు లోగడ విడుదలైన నిధులను సద్వినియోగం చేసుకుని నైపుణ్యం కలిగిన మంచి వైద్యులుగా పేరు తెచ్చుకోవాలని అన్నారు.వైద్య, ఆరోగ్య శాఖ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు పరుచుటకు రూ.50వేలు మంజూరు చేశారు.నేత్రదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 8 వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఆసుపత్రులు, నర్సింగ్ కళాశాలలు, వైద్య కళాశాలలు, ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు నేత్రదానం ప్రాముఖ్యతను వివరించనున్నట్లు డిఎంహెచ్ఓ డాక్టర్ పెండెం వెంకటరమణ తెలిపారు.నర్సింగ్ కళాశాల నుండి ప్రభుత్వ వైద్య కళాశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ డా. శ్రవణ్ కుమార్, కంటి వైదులు డా.ఎస్.రమేష్ కుమార్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ, ప్రోగ్రాం అధికారి డా.జి.చంద్రశేఖర్, డా.నాజియా తబస్సుం, డా.శ్రీశైలం, డా వాసవి తదితరులు పాల్గొన్నారు.



## పోక్సో కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు, జరిమానా

- పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం, ఆగస్టు 25 (జనం సాక్షి) :** చింతకాని పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి ఫాస్ట్‌ట్రాక్ (పోక్సో) కోర్టు న్యాయమూర్తి డా. పుల్లభట్ల పోగడ కృష్ణ అర్జున్ మంగళవారం తీర్పు వెలువరించినట్లు వైరా ఏసీపీ సారంగపాణి తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. చింతకాని మండలంలో నవంబర్ 18.2022న ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను ఎదురుగా నివాసం ఉంటున్న నిందితుడు మాయమాటలతో తన ఇంటికి తీసుకెళ్లి బెదిరించి, తన ఇద్దరు స్నేహితులతో కలిసి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బాలికను బెదిరించారు. దీనిపై బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చింతకాని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.ఈ కేసులో ఐపిసి సెక్షన్లు 376, 324, 506 34 మరియు ఫోక్సో యాక్ట్ -2012 సెక్షన్ 5 r/w 6 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు సాక్ష్యాధారాలను సేకరించి, దర్యాప్తును పూర్తి చేసి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు.కేసులోని సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలను పరిశీలించిన గౌరవ న్యాయస్థానం నిందితులపై మోపిన నేరం రుజువైనట్లు నిర్ధారించింది. దీంతో A1 నుంచి A3 వరకు ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు విధించింది. అలాగే A1కు రూ.65,000, A2 మరియు A3లకు ఒక్కొక్కరికి రూ.60,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది.

### నిందితుల వివరాలు

పాలకుర్తి శ్రీవర్ధన్, 19 సంవత్సరాలు, చింతకాని మండలం, సిమ్మసార్తి నాగరాజు, 20 సంవత్సరాలు, చింతకాని మండలం, పాలకుర్తి వీరన్న ఏ అభి, 20 సంవత్సరాలు, తిరువూరు మండలం.ఈ కేసులో అప్పటి వైరా ఏసీపీ ఎం.ఏ. రహమాన్ దర్యాప్తు అధికారిగా వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె. శరత్ కుమార్ రెడ్డి న్యాయస్థానంలో సమర్థవంతంగా వాదనలు వినిపించారు. చింతకాని ఎస్ఐ జి. నరేష్ దర్యాప్తులో సహకరించారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్‌గా కె. శ్రీనివాసరావు, కోర్టు లైజన్ విధుల్లో ఎస్సై శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుళ్లు డి. నాగేశ్వరరావు, కె. శ్రీనివాస్, ఆర్. నాగేశ్వరావు, హోంగార్డులు ఎం.డి. అయూబ్, యు. చిట్టిబాబు విధులు నిర్వహించారు. కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్ మరియు కోర్టు లైజన్ విధుల్లో సమర్థవంతంగా పనిచేసిన అధికారులను, సిబ్బందిని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

## నీట్ పీజీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 25 (జనంసాక్షి) :** ఈ నెల 30న నిర్వహించనున్న నీట్ పీజీ పరీక్షను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నీట్ పీజీ పరీక్ష నిర్వహణ ఏర్పాట్ల పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కరీంనగర్ లో 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో 1505 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా తాగునీరు, ఇతర అవసరమైన సౌకర్యాలను ముందుగానే ఏర్పాటు చేయాలన్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష కావడంతో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ సిబ్బందిని, వైద్య బృందాన్ని తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రత, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మున్సిపల్ అధికారులు పరీక్షా కేంద్రాలను ముందుగానే సందర్శించి అక్కడి పారిశుధ్యం, తాగునీరు, ఇతర సౌకర్యాలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పరీక్షను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కొండగట్టులో భక్తుల రద్దీ



**మల్యాల, ఆగస్టు 25 (జనం సాక్షి) :** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో శ్రావణమాసం మరియు స్వామి వారి పర్వదినమైన మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది.ఆలయ పరిసరాలు అంత భక్తులతో సందడిగా మారింది ఉదయం నుంచి కొండపైకి చేరుకొని కోనేటిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని బేతాళ స్వామి దర్శించుకుని స్వామి ప్రసాదాలు స్వీకరించి భక్తులు తిరుగు ప్రయాణమయ్యారు. ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# హత్యకు గురైన దంపతుల కుటుంబానికి ప్రభుత్వం అండ

- బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్,ఎస్పీ నరసింహ
- బాధిత కుటుంబానికి అట్రాసిటీ కేసు పరిహారం ఉత్తర్వులు అందజేత

**సూర్యాపేట, ఆగస్టు 25 (జనంసాకి) :** ఇటీవల మోతె మండల కేంద్రంలో హత్యకు గురైన నాగులు, బుబా దంపతుల కుటుంబ సభ్యులకు జిల్లా యంత్రాంగం పూర్తి అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కె.నరసింహ భరోసా కల్పించారు.మంగళవారం వారు స్వయంగా బీక్యా తండాలోని బాధిత దంపతుల నివాసానికి వెళ్లి, వారి కుమార్తెలు జ్యోతి, సంధ్యలను పరామర్శించి ఓదార్చారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పరంగా అట్రాసిటీ కేసు కింద రావాల్సిన ఆర్థిక సహాయంలో మొదటి విడతగా 50 శాతం 4.2 లక్షల నగదును బాధితుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపి,అందుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ ఉత్తర్వులను కుటుంబ సభ్యులకు అందజేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ ఇలాంటి సంఘటన జరగడం అత్యంత బాధాకరమన్నారు.బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పడానికి, జిల్లా యంత్రాంగం వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇవ్వడానికే తాము ఇక్కడికి వచ్చామని పేర్కొన్నారు.ఈ కేసులో పోలీసులు ప్రతి చిన్న ఆధారాన్ని అత్యంత నిశితంగా సేకరిస్తున్నారని, చార్జ్‌షీట్‌ను త్వరగా సిద్ధం చేసి కోర్టుకు పంపుతామని చెప్పారు.నేరస్థులకు వీలైనంత త్వరగా కఠిన శిక్షలు పడేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.జిల్లా ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో రాజీ పడేది లేదన్నారు.ఈ జంట హత్యల కేసులో నిందితులను హత్య జరిగిన 24 గంటలు గడవక ముందే గుర్తించి రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు.కేసును అత్యంత పారదర్శకంగా, లోతుగా దర్యాప్తు చేయడానికి విచారణ అధికారిగా డీఎస్పీ స్థాయి అధికారిని నియమించినట్లు తెలిపారు.నిందితులను కోర్టు ద్వారా తిరిగి పోలీస్ కస్టడీలోకి తీసుకుని, అన్ని కోణాల్లో విచారించి పక్కా ఆధారాలను రికార్డు చేస్తామన్నారు.బాధితులకు న్యాయం జరిగేందుకు ఈ కేసులో నిపుణులైన అడ్వకేట్‌ను సహాయంగా నియమించామని, కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు పంపించి త్వరగా కేసును పరిష్కరింరించి నిందితులకు తొందరగా పెద్ద శిక్షలు పడేలా కృషి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ వేణు మాధవ్, తహసీల్దార్ వెంకన్న , సీఐ రామకృష్ణారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.






# హోండా రెబల్ 300 బైక్, ఏడీవీ 160 ప్రీమియం స్కూటర్ విడుదల

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా ప్రీమియం ద్విచక్రవాహనాలపై దృష్టిసారించింది. ఏడీవీ 160 పేరిట ప్రీమియం స్కూటర్‌తో పాటు, రెబల్ 300 పేరిట క్రూయిజర్ మోటార్ సైకిల్‌ను దేశీయ మార్కెట్‌లోకి తాజాగా విడుదల చేసింది. ఇందులో ఏడీవీ స్కూటర్ ధర రూ.1.70 లక్షలు కాగా.. రెబల్ 300 ప్రారంభ ధర రూ.2.22 లక్షలుగా కంపెనీ నిర్ణయించింది. గత నెల పరిచయం చేసిన పది మోడళ్లలో ఈ రెండూ ఉన్నాయి. రూ.5వేలు టోకన్ అమౌంట్ చెల్లించి వీటిని బుక్ చేసుకోవచ్చు. అక్టోబర్ నుంచి డెలివరీలు ప్రారంభం కానున్నాయి.





### హోండా రెబల్ 300

రెబల్ 300 ద్వారా హోండా తొలిసారిగా క్రూజర్ మోటార్ సైకిల్ సెగ్మెంట్‌లోకి అడుగుపెట్టింది. ఇందులో 286 సీసీ లిక్విడ్ కూల్డ్ సింగిల్ సిలిండర్ ఇంజిన్ ఉంది. ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, హోండా రోడ్ సింక్ కనెక్టివిటీతో కూడిన టీఎఫ్‌టీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ ఇచ్చారు. టర్న్‌బైటర్న్ నావిగేన్, డిస్క్‌బ్రేకులు, డ్యూయల్ ఛానెల్ ఏబీఎస్ వంటి సదుపాయాలు ఉన్నాయి. ఈ మోడల్ ద్వారా దేశీయంగా ప్రీమియం మోటార్ సైకిల్ సెగ్మెంట్‌లో తన వాటాను పెంచుకోవాలని హోండా చూస్తోంది. ప్రస్తుతం ఈ సెగ్మెంట్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ మెటోర్ 350, గోన్ క్లాసిక్ 350 వంటి మోడళ్లు రెబల్ 300కు పోటీగా ఉన్నాయి.

### హోండా ఏడీవీ 160

హోండా నుంచి వస్తున్న అడ్వెంచర్ స్కూటర్ ఇది. ఫ్లెక్స్‌ఫ్యూయల్‌తో నడుస్తుంది. ఇ85 ఇథనాల్ ఫ్యూయెల్‌కు సపోర్ట్ చేస్తుంది. ఇందులో 156.9 సీసీ లిక్విడ్ కూల్డ్ ఇంజిన్ ఉంది. 27 లీటర్ల అండర్-సీట్ స్టోరేజ్ కలిగి ఇచ్చారు. హోండా రోడ్‌సింక్ యాప్ కనెక్టివిటీ, టర్న్‌బైటర్న్ నావిగేషన్‌తో కూడిన టీఎఫ్‌టీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ ఉన్నాయి. ముందూ వెనుక డిస్క్ బ్రేకులు, సింగిల్ ఛానెల్ ఏబీఎస్ సదుపాయంతో వస్తోంది. హీరో జూమ్ 160, యమహా ఎరోక్స్ 155 ఈ సెగ్మెంట్‌లో ఏడీవీ 160కి పోటీగా ఉన్నాయి.

# లాభాల్లో ముగిసిన సూచీలు

## 24,300 ఎగువకు నిఫ్టీ



దేశీయ మార్కెట్ సూచీలు మంగళవారం రాణించాయి అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, చమురు ధరలు అధిక స్థాయి వద్ద స్థిరంగా కొనసాగుతున్నప్పటికీ.. సూచీలు లాభాల బాట పట్టాయి. పీఎస్‌యూ బ్యాంక్, ఫార్మా, హెల్త్‌కేర్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది. దీంతో సోమవారం సెషన్ నష్టాలకు బ్రేక్ వేస్తూ సూచీలు నేడు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 286.98 పాయింట్ల లాభంతో 77,656.09 వద్ద ముగిసింది. నిఫ్టీ 115.50 పాయింట్లు పెరిగి 24,334.55 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.40గా ఉంది. సెన్సెక్స్30లో ఎటర్నల్, హెచ్‌సీఎల్, పవర్ గ్రిడ్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హిందుస్థాన్ యునిలీవర్ కంపెనీల షేర్లు తప్ప మిగతా కంపెనీల షేర్లన్నీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 89.52 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్స్ ధర 4,634.43 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

అంతకుముందు ముడిచమురు అధిక ధరలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఇరాన్‌పై అమెరికా కొత్త ఆంక్షలతో డాలర్ విలువ 20.2 లక్షల రియాళ్లకు చేరింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి పైసా తగ్గి 95.72 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 92 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగియగా, ఐరోపా సూచీలు మిశ్రమంగా ట్రేడయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.21,000 కోట్లు పెరిగి రూ.491.96 లక్షల కోట్ల (5.14 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 89 పాయింట్ల లాభం (క్రితం ముగింపు 77,540.83 పాయింట్ల)తో 77,629.56 వద్ద ప్రారంభమైంది. ఆరంభ ట్రేడింగ్‌లో 77,789.40 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ, అనంతరం అమ్మకాలతో నష్టాల్లోకి జారుకుంది. ఒకదశలో 77,201.66 వద్ద కనిష్ఠాన్ని తాకి, చివరకు 171.72 పాయింట్ల నష్టంతో 77,369.11 వద్ద ముగిసింది. నిఫ్టీ 32.95 పాయింట్లు తగ్గి 24,219.05 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,144.30- 24,313 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 20 నష్టపోయాయి. బజాజ్ ఫిన్‌సర్వ్ 1.32%, అదానీ పోర్ట్స్ 1.30%, బీఈఎల్ 1.27%, బజాజ్ ఫైనాన్స్ 1.26%, ట్రెంట్ 0.87%, యాక్సిస్ బ్యాంక్ 0.85% డీలాపడ్డాయి. టాటా స్టీల్ 1.86%, హెచ్‌సీఎల్ టెక్ 1.30%, ఇన్ఫోసిస్ 0.89%, హెచ్‌యూఎల్ 0.50% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. బీమా 0.86%, పీఎస్‌యూ బ్యాంక్ 0.82%, హౌసింగ్ ఫైనాన్స్ 0.76%, ఆర్థిక సేవలు 0.39% తగ్గాయి. లోహ 1.38%, టెలికాం 1.05%, కమొడిటీస్ 0.55% మెరిశాయి. బీఎస్ఈలో 2467 షేర్లు నష్టపోగా, 1973 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 257 షేర్లలో ఎటువంటి మార్పులేదు. స్టాక్ ఎక్స్ఛేంజీలు, డిపాజిటరీలు, క్లియరింగ్ కార్పొరేషన్‌లు సహా మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థల ఐటీ వ్యవస్థల పనితీరు, పటిష్టతను అంచనా వేసేందుకు ఐటీ రెసిలియెన్స్ ఇండెక్స్ (ఐటీఆర్ఐ) తీసుకురావాలని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిర్ణయించింది. ఈ సూచీని 9 ప్రమాణాల ఆధారంగా లెక్కిస్తారు. ఇందులో లభ్యత, భద్రతలకు అత్యధికంగా 20% చొప్పున వెయిటేజ్ ఉంటుంది. గవర్నెన్స్, రిలయబిలిటీ-మానిటరింగ్, బిజినెస్ కంటిన్యుటీ, మాడ్యులారిటీలకు 10% చొప్పున, స్కేలబిలిటీ, ఇతర అంశాలకు 5% చొప్పున కేటాయించారు. ఈ నియమావళి 2027 ఫిబ్రవరి 28 నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది. ఐపీఓ సమాచారంహొరిజన్ ఇండస్ట్రియల్ పార్క్స్ షేరు ఇష్యూ ధర రూ.60తో పోలిస్తే బీఎస్ఈలో 3.41% నష్టపోయి రూ.57.95 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.16,706.42 కోట్లుగా నమోదైంది. ప్రయారిటీ జువెల్స్ ఐపీఓ ఈనెల 28న ప్రారంభమై సెప్టెంబరు 1న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణి రూ.190- 200. రేస్ ఆఫ్ బిలీఫ్ ఐపీఓ సెప్టెంబరు 1న ప్రారంభమై 3న ముగియనుంది. ధరల శ్రేణి రూ.227- 239. స్కైవేస్ ఎయిర్‌సర్వీసెస్ ఐపీఓ మొదటి రోజునే 1.16 రెట్ల స్పందన లభించింది. రిటెయిల్ విభాగంలో 1.65 రెట్ల స్పందన వచ్చింది. హై-టెక్ ఇంజినీర్స్ ఐపీఓ మొదటి రోజే 7.74 రెట్ల స్పందన నమోదైంది. రిటెయిల్ విభాగంలో 11.22 రెట్ల స్పందన కనిపించింది.

## దూసుకెళ్లిన లలితా జువెలరీ షేర్లు

లలితా జువెలరీ మార్ట్ షేరు, ఇష్యూ ధర రూ.201తో పోలిస్తే బీఎస్ఈలో 31.99% లాభంతో రూ.265.30 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 36.46% దూసుకెళ్లి రూ.274.30 వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది. చివరకు 23.58% పెరిగి రూ.248.40 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.13,903.19 కోట్లుగా నమోదైంది.

## 73 బి.డా. నిధులొచ్చాయ్



రూపాయి విలువ క్షీణతను నివారించేందుకు, విదేశీ కరెన్సీ ముఖ్యంగా డాలర్లను ఆకర్షించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జూన్ 8న ప్రారంభించిన ఫారెక్స్ స్వాప్ సదుపాయం కింద ఈనెల 21 వరకు 73 బిలియన్ డాలర్ల నిధులు వచ్చాయి. ఇందులో ఎఫ్‌సీఎన్ఆర్ (బి) డిపాజిట్లే 65.40 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ప్రవాసులు, విదేశీ డిపాజిటర్లు భారీగా ఆసక్తి చూపడమే ఇందుకు కారణమని ఆర్థిక శాఖ తెలిపింది. ఈనెల 31తో ఈ పథకం ముగియనుంది. పథకం ముగిసేలోపు 80 బిలియన్ డాలర్ల వరకు విదేశీ కరెన్సీ రావచ్చని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అంచనా వేశారు.

## గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 5.40
వరంగల్ ₹ 5.42

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్
₹ 1,68,426 (22 క్యారెట్లు)
₹ 1,83,734 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,60,000

## విమాన సేవలు 32% ప్రియం


### రైల్వేల్లో 3.5 శాతమే.. జూన్ త్రైమాసిక ద్రవ్యోల్బణ గణాంకాలు



దిల్లీ: విమాన ప్రయాణికుల సేవల ధరలు 2025 జూన్ త్రైమాసికంతో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌లో 32% పెరిగాయి. ప్రధానమైన 7 రకాల సేవల్లో అత్యధిక పెరుగుదల ఈ విభాగానిదే కావడం గమనార్హం. సోమవారం కేంద్రం విడుదల చేసిన సేవల తయారీ ధరల సూచీ (పీపీఐ) గణాంకాల ప్రకారం..విమాన ప్రయాణికుల సేవల ధరల సూచీ 31.94% పెరిగింది. అంతక్రితం త్రైమాసిక ద్రవ్యోల్బణ గణాంకాలు ఈ రంగానికి లేవు. రైల్వే ప్రయాణికుల సేవల ధరల సూచీ వార్షికంగా 3.5% పెరిగింది. మార్చి త్రైమాసికంలోనూ ఇంతే వృద్ధి కనిపించింది. బ్యాంకింగ్ సేవల ధర సూచీ 3.35%, సెక్యూరిటీ లావాదేవీ సేవల ధరల సూచీ 1.32% తగ్గాయి. అంతక్రితం త్రైమాసికంలోనూ ఇవి వరుసగా 4.10%, 0.55% క్షీణతను ప్రదర్శించాయి. పెన్షన్ ఫండ్‌లు, బీమా, టెలికాం రంగాలు వరుసగా 5.2%, 0.98%, 0.72% చొప్పున ద్రవ్యోల్బణాన్ని నమోదు చేశాయి. మార్చి త్రైమాసికంలో వీటిలో వరుసగా -0.76%, 0.68%, 0.99% మేర మార్పులు కనిపించాయి. సేవల పీపీఐలో ప్రభుత్వం మరిన్ని సేవలను జత చేయనుంది. వచ్చే అయిదేళ్లలో టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణ గణాంకాలను దశలవారీగా నిలిపేసేందుకు జూన్‌లో వస్తువులు, సేవలకు తొలి పీపీఐ గణాంకాలతో కేంద్రం ముందుకొచ్చింది.

# 10 ఏళ్లు.. 13,000 రెట్ల వృద్ధి

## యూపీఐ లావాదేవీల తీరిదీ



సరిగ్గా పదేళ్ల కిందట 2016 ఆగస్టు 25న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలు మొదలయ్యాయి. దేశీయ డిజిటల్ చెల్లింపుల తీరే అప్పటినుంచి మారిపోయింది. దేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకు వెన్నెముకగా నిలవడంతో పాటు, రియల్ టైం చెల్లింపులకు అంతర్జాతీయ ప్రమాణంగా యూపీఐ ఎదిగింది

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ఆధ్వర్యంలోని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అభివృద్ధి చేసిన యూపీఐ విలువ - పరిమాణం పరంగా అత్యద్భుత వృద్ధిని సాధించిందని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. 2016-17లో వార్షిక యూపీఐ లావాదేవీల సంఖ్య 1.78 కోట్లు కాగా, 2025-26లో 24,162 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. అంటే దాదాపు 13,000 రెట్ల వృద్ధి లభించింది. ఇదే సమయంలో లావాదేవీల విలువ రూ.0.07 లక్షల కోట్ల నుంచి రూ.314 లక్షల కోట్లకు.. అంటే 4000 రెట్లకు పైగా రాణించింది. యూపీఐ ప్రయాణంలో 2026 ఏడాది ఒక మైలురాయిలా నిలిచింది. 2026 మేలో తొలిసారిగా నెలవారీ లావాదేవీల సంఖ్య 2,300 కోట్లను అధిగమించి 2,320 కోట్లకు చేరింది. 2026 జులైలో నమోదైన 2,366 కోట్ల లావాదేవీలే, ఇప్పటివరకు ఒకనెలలో జరిగిన అత్యధిక లావాదేవీలు.యూపీఐ వచ్చిన తొలి ఏడాదిలో 44 బ్యాంకులు ఈ సేవను అందిపుచ్చుకోగా, 2025-26 నాటికి బ్యాంకుల సంఖ్య 703కు చేరింది. 2025-26లో యూపీఐ లావాదేవీలు 24,162 కోట్లకు చేరాయి. వ్యక్తి నుంచి వ్యక్తికి, వ్యక్తి నుంచి వ్యాపారులకు రియల్‌టైంలో లావాదేవీల జరిపేందుకు వీలు కల్పించడమే దీని విజయ రహస్యం. అంతర్జాతీయ రియల్ టైం చెల్లింపుల లావాదేవీల పరిమాణం విషయంలో యూపీఐకి 49% వాటా దక్కినట్లు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎమ్ఎఫ్) పేర్కొంది. రోజుకు 66 కోట్లకు పైగా లావాదేవీలతో భారత చెల్లింపుల నెట్‌వర్క్‌లో యూపీఐ ఆధిపత్యాన్ని చెలాయిస్తోంది. ప్రస్తుతం 11 దేశాల్లో యూపీఐ సేవలు లభిస్తున్నాయి. అందులో యూఏఈ, ఫ్రాన్స్, భూటాన్, శ్రీలంక, నేపాల్, సింగపూర్, మారిషస్, ఖతార్, కాంబోడియా, గ్రీస్, మాల్దీవ్స్ ఉన్నాయి.

## ఇందిరమ్మ అర్హుల జాబితా తయారు

అంబర్‌పేట సిటీపోలీస్‌లైన్, గడ్డిఅన్నారం ఆర్అండ్‌బీ క్వార్టర్స్, పోచారం ఎల్ఐజీ కాలనీలో డ్రా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇళ్లు రాని వారికి రూ.10 వేల తిరిగి ఇవ్వనున్నట్లు చెప్పారు.

**ఆత్మగౌరవంతో జీవించే అవకాశం**

ఎల్‌బీనగర్, గోషామహల్, ముషీరాబాద్, చంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తుల గడువు సెప్టెంబరు 3తో ముగియనుంది. ఒక్కో నియోజకవర్గంలో 480 చొప్పున ఫ్లాట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పేదలకు అపార్టుమెంట్‌లో ఒక ఫ్లాటు ఇవ్వడం కాదని, ఒక కుటుంబానికి నగరంలో విలువైన ఆస్తి, భద్రమైన భవిష్యత్, ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కల్పించడమే ఇందిరమ్మ టవర్ల లక్ష్యమని మంత్రి తెలిపారు.

**ఏడాదిలోగా లబ్ధిదారులకు ఇళ్లు**

లబ్ధిదారులకు కేటాయించే ఇంటి వరకు సుమారు 60 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఉంటుందని మంత్రి అన్నారు. స్థలం ఉచితంగా ఇవ్వడంతో పాటు రిజిస్ట్రేషన్, రూ.5 లక్షల సబ్సిడీ ప్రభుత్వమే ఇస్తోందనిన్నారు. లబ్ధిదారుడు రూ.6 లక్షలు నాలుగు విడుతల్లో చెల్లించే అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల టవర్లకు కేపీహెచ్‌బీ కాలనీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల లాంఛనంగా ప్రారంభించారు. ఏడాదిలోగా లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించనున్నట్లు మంత్రి తెలిపారు.




### పోర్షే అనుబంధ ఐటీ సంస్థ ఎంహెచ్‌పీ

# టీసీఎస్ చేతికి..

### విలువ రూ.3,574 కోట్లు

**దిల్లీ:** దేశంలోనే అతిపెద్ద ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), జర్మనీ విలాస కార్ల సంస్థ పోర్షే ఏజీ అనుబంధ ఐటీ సంస్థ ఎంహెచ్‌పీ మేనేజ్‌మెంట్ ఉండ్ ఐటీ-బెరాటుంగ్ జీఎంబీహెచ్ (ఎంహెచ్‌పీ)లో 100% వాటా కొనుగోలు చేయనున్నట్లు సోమవారం ప్రకటించింది. ఎంహెచ్‌పీ ఎంటర్‌ప్రైజ్ విలువ 320 మిలియన్ యూరోలు (దాదాపు రూ.3,574 కోట్లు). టీసీఎస్- పోర్షే మధ్య కుదిరిన 1.25 బిలియన్ యూరోల విలువైన అయిదేళ్ల వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఈ కొనుగోలు ప్రక్రియ భాగంగా ఉంది. అనుబంధ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ నెదర్లాండ్స్ బీవీ ద్వారా ఈ కొనుగోలును పూర్తి చేయనున్నట్లు ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో టీసీఎస్ పేర్కొంది. ఎంహెచ్‌పీలో 100% ఈక్విటీ షేర్లను 320 మి.యూరోలకు కొనుగోలు చేయడానికి టీసీఎస్ నెదర్లాండ్స్ బీవీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. యూరోపియన్ కమిషన్, జర్మనీ, రొమేనియా, నియంత్రణ సంస్థల అనుమతులకు లోబడి రాబోయే 3-4 నెలల్లో ఈ లావాదేవీ పూర్తి కానుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా పోర్షే కోసం ప్రత్యేకంగా 'ఏఐ మొబిలిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను టీసీఎస్ ఏర్పాటు చేయనుంది. తయారీ, ఇంజినీరింగ్, కార్యకలాపాలు, కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ రంగాల్లో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాన్ని పెంచడంపై ఇది దృష్టిపెట్టనుంది.ఎంహెచ్‌పీ నేపథ్యమిదీ: జర్మనీలోని లుడ్విగ్స్‌బర్గ్‌లో ఎంహెచ్‌పీ ప్రధాన కార్యాలయం ఉంది. ఆటోమోటివ్, తయారీ, ఏరోస్పేస్, రక్షణ, ఇంధన, ప్రభుత్వ రంగాల్లో మేనేజ్‌మెంట్, ఐటీ కన్సల్టెన్సీ సేవలను కంపెనీ అందిస్తోంది. ప్రస్తుతం ఎంహెచ్‌పీలో 4500 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. 2025లో ఈ సంస్థ 742 మి.యూరోల (సుమారు రూ.8300 కోట్ల) టర్నోవర్ నమోదుచేసింది. 'వాహన పరిశ్రమను ఏఐ, సాఫ్ట్‌వేర్, డేటా పునర్నిర్విస్తున్న సమయంలో, మా ఏఐ, ఇంజినీరింగ్ సామర్థ్యాలు, ఎంహెచ్‌పీ ఆటోమోటివ్ కన్సల్టింగ్ నైపుణ్యంతో కలిసి కొత్త భవిష్యత్తు మొబిలిటీ అనుభవాలను అందిస్తాయి. పోర్షేలో ఏఐ సంస్కరణలను వేగవంతం చేస్తాం' అని టీసీఎస్ ఎండీ, సీఈఓ కె.కృతివాసన్ తెలిపారు.

## 365 బీబీ హైవే అభివృద్ధికి కేంద్రం పచ్చజెండా

ఉన్నతీకరణతో పోలవరం ప్రాజెక్ట్, పరిసర గ్రామాలకు కనెక్టివిటీ పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతం పొగాకు, చెరకు, ఫామాయిల్ తోటలతో నిండి ఉంటుందని.. ఈ హైవే అభివృద్ధితో మౌలిక సదుపాయాలు మెరుగువుతాయన్నారు. పంటల రవాణా వేగంగా, సురక్షితంగా జరుగుతుందని చెప్పారు. పంట పొలాల నుంచి మార్కెట్‌కు అనుసంధానం పెరుగుతుందని, స్థానికంగా జీవనోపాధి మెరుగవుతుందని గడ్కరీ పేర్కొన్నారు. అప్‌గ్రేడ్ చేసిన జాతీయ రహదారితో తెలుగు రాష్ట్రాల మధ్య కనెక్టివిటీ పెరగడంతో పాటు, ఇరురాష్ట్రాల ప్రయాణికులకు, పర్యాటకులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో భక్తులు సులభంగా ఘాట్ల వద్దకు చేరుకోవడానికి, పోలవరం ప్రాజెక్ట్ సందర్శించేందుకు వీలవుతుందన్నారు.

## కులగణనపై కొత్త ప్రశ్నావళి రూపొందించండి

తెలిపారు. ప్రశ్నావ ళిలో 'వెనుకబడిన వర్గాలు' అనే పదమే లేకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ తరహాలోనే బీసీ, ఓబీసీ కులాల నమోదుకూ 'డ్రాప్-డౌన్ జాబితా' విధానాన్ని ఉపయోగించాలని రాహుల్ గాంధీ, మల్లికా ర్జున ఖర్గే సూచించారు. తెలంగాణ (2024), బిహార్ (2022) సర్వేల్లో వాడిన కులాల జాబితా నమూనాలను ప్రధానికి పంపించారు. ప్రస్తుత గందరగోళ ప్రశ్నావళిని వెంటనే రద్దు చేసి, అన్ని పార్టీలు - నిపుణులతో చర్చించి ఓ కొత్త ప్రశ్నావళిని రూపొందిం చాలని ఖర్గే, రాహుల్ డిమాండ్ చేశారు. ఇదిలావుంటే రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను అంతం చేయడానికి మోదీ ప్రభుత్వం కుట్రపన్నిందని, దీనిలో భాగంగానే కేంద్రానికి చెందిన వివిధ శాఖాల్లో ఖాళీగా ఉన్న 8.2లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేయడంలేదని కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. మంత్రిత్వ శాఖల వారీగా ఖాళీగా ఉన్న పోస్టులపై మీడియా నివేదికను ఉటంకిస్తూ విమర్శలు సంధించారు. '2015లో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 4.21లక్షల ఉద్యోగాలు భర్తీకాకుండా ఉన్నాయి. 2024కు వాటి సంఖ్య 8.24 లక్షలకు చేరాయి. రైల్వేల్లో 2.40లక్షలు, కేంద్ర హోంశాఖ పరిధిలో 1.10 లక్షలు ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ రంగ సంస్థల్లోని 5.1 లక్షల శాశ్వత ఉద్యోగాలను రద్దు చేశారు. ఇవికాక రక్షణ రంగంలో 2.41 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఖర్గే తెలిపారు. ఒప్పంద ఉద్యోగులు 19శాతం నుంచి 49శాతానికి పెరిగారని వెల్లడించారు. ఇది ఒక్క ఉపాధి సమస్య మాత్రమే కాదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన సామాజిక న్యాయం అంశం కూడా ఇమిడి ఉందని పేర్కొన్నారు. విద్య, ఉపాధి రంగాల్లో యువ భారతీయుల జీవితాలను మోదీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. దేశంలో 15 నుంచి 29 ఏళ్ల వయసు గల 8.7 కోట్ల మంది యువత చదువులు, ఉపాధికి దూరమయ్యారని, వారికి ఎటువంటి నైపుణ్య శిక్షణలూ అందడంలేదన్నారు. నీతిఆయోగ్ నివేదికను ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో గత 40 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగుల శాతం పెరిగిందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకా గాంధీ విమర్శించారు.

### భారత్,అమెరికా రక్షణ ఒప్పందాలు

# మరింత బలోపేతం

### టీఎల్ఎంఏఎల్‌ను సందర్శించిన అమెరికా రాయబారి సెర్గియో గోర్



**హైదరాబాద్(జనంసాక్షి):**
హైదరాబాద్: భారత్, అమెరికా దేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ, పారిశ్రామిక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతోందని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్స్ లిమిటెడ్ (టీఎల్ఎంఏఎల్) ప్లాంటును ఆయన సందర్శించారు. భారత వైమానిక దళానికి అవసరమైన సుమారు 80 మధ్య శ్రేణి ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంటీఏ) కొనుగోలుకు సంబంధించిన రూ. వేల కోట్ల టెండర్ రేసులో లాక్‌హీడ్ మార్టిన్ నిలిచిన నేపథ్యంలో, ఈ సందర్శన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ప్లాంట్‌లో తయారవుతున్న సీ-130జే? సూపర్ హెర్క్యులస్ విమాన తోక భాగాల (ఎంపైనేజ్) ఉత్పత్తి విభాగాన్ని గోర్ పరిశీలించి, మాట్లాడారు. అమెరికా, భారత్ రక్షణ దళాలు ఉపయోగిస్తున్న సీ-130జే విమాన కీలక నిర్మాణ భాగాలను భారతీయ ఇంజినీర్లు, కార్మికులు ఇక్కడే తయారు చేయడం.. రెండు దేశాల రక్షణ సహకారానికి బలమైన నిదర్శనమని ప్రశంసించారు. 'ఈ భాగస్వామ్యం అత్యాధునిక సాంకేతిక నైపుణ్యంతో కూడిన ఉపాధి అవకాశాలను సృష్టిస్తోంది. సురక్షితమైన ఇండో-పసిఫిక్ ప్రాంతం కోసం రెండు దేశాల భాగస్వామ్యం ఎంతో కీలకమ'ని అన్నారు.టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏసీఎల్), లాక్‌హీడ్ మార్టిన్ సంయుక్త భాగస్వామ్య సంస్థ 2010లో ప్రారంభమైంది. అమెరికాలో తయారయ్యే సీ-130జే విమానాలకు తోక భాగాలను ఈ సంస్థ సరఫరా చేస్తోంది. ప్రస్తుతం భారత వైమానిక దళం వద్ద సీ-130జే రవాణా విమానాలు 12 అందుబాటులో ఉన్నాయి. భారత వైమానిక దళం పాత రవాణా విమానాల స్థానంలో దాదాపు 80 కొత్త ఎంటీఏలను కొనుగోలు చేయనుంది. ఈ కాంట్రాక్టు కోసం లాక్‌హీడ్ మార్టిన్‌కు చెందిన సీ-130జే?తో పాటు, బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రాయెర్ డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ సి-390 మిలీనియం, ఎయిర్‌బస్ డిఫెన్స్ అండ్ స్పేస్‌కు చెందిన ఎ-400ఎమ్ విమానాలు ప్రధాన పోటీదారులుగా ఉన్నాయి. ఈ భారీ ఆర్డర్ దక్కించుకునేందుకు తాము సన్నద్ధంగా ఉన్నామని, ఉత్పత్తిని వేగంగా పెంచేందుకు హైదరాబాద్ ప్లాంట్ అనుకూలంగా ఉందని టాటా-లాక్‌హీడ్ సంస్థలు పేర్కొన్నాయి.

**త్వరలోనే ఎంఆర్ఓ సేవలు**

విమానాల మరమ్మతు, నిర్వహణ సేవలకు సంబంధించిన (ఎంఆర్ఓ) కేంద్రాన్ని డిసెంబరు నాటికి అందుబాటులోకి తెస్తామని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏసీఎల్) సీఈఓ, ఎండీ సుకరన్ సింగ్ వెల్లడించారు. 2027 ఏప్రిల్ నాటికి సర్వీసింగ్ కోసం తొలి విమానం ఈ కేంద్రానికి వస్తుందని వివరించారు. లాక్‌హీడ్ మార్టిన్ ఎయిర్ మొబిలిటీ అండ్ మారిటైమ్ మిషన్స్ వైస్ ప్రెసిడెంట్ ట్రిష్ పేగన్ మాట్లాడుతూ.. మార్కెట్లోకి కొత్తగా వచ్చినవారు తమ సాంకేతికతకు నకళ్లు తయారు చేయాలని చూస్తున్నారని.. దశాబ్దాల కాలంగా తాము సాధించిన ఫలితాలు, నైపుణ్యం తమ సొంతం అని వ్యాఖ్యానించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
26 ఆగస్ట్ 2026

# 34 నెలల పాలనలో విద్యార్థుల హామీల అమలేది..?

## స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు, ఫీజు బకాయిలు ఎప్పుడిస్తారు : ఏఐఎస్ఎఫ్



**కరీంనగర్ టౌన్, ఆగస్టు 25, (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 34 నెలలు గడిచినా విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మంగళవారం కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు, ఖాళీ పర్సులతో వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులకు ఇస్తామన్న స్కూటీలు, విద్యార్థులకు ఇస్తామన్న ల్యాప్‌టాప్‌లు, రూ.5 లక్షల విద్యా భరోసా కార్డును ప్రభుత్వం ఇప్పటికీ అందించలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే ఒకేసారి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగానికి బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసి విద్యార్థుల పట్ల ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే తెలంగాణ వ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మణికంఠరెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నూనావత్ శ్రీనివాస్ నాయక్, గర్ల్స్ వింగ్ నాయకురాలు జోష్న, నగర నాయకులు సందీప్‌రెడ్డి, బోయినీ విష్ణు, అరవింద్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# త్రీసా జాలీ గాయత్రి గోపిచంద్‌ను సన్మానించిన మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, ఆగస్టు 25, (జనంసాక్షి) :** బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ మహిళల డబుల్స్ లో కాంస్య పతకం సాధించి... భారత కీర్తిని ప్రపంచవ్యాప్తంగా రెపరెపలాడించిన త్రీసా జాలీ గాయత్రి గోపిచంద్ ను మంగళవారం అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ భారత బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపిచంద్ తో కలిసి రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఘనంగా సన్మానించారు. రాబోయే రోజుల్లోనూ మరిన్ని విజయాలను అందుకోవాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించి... అన్ని రకాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు.



# ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

## ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.12 వేలు ఇవ్వాలి: చెలికాని శ్రీనివాస్

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 25 (జనం సాక్షి) :** ఆటో డ్రైవర్లతో పాటు రవాణా రంగ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కరీంనగర్ జిల్లా పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెలికాని శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కోతిరాంపూర్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవన్‌లో గణేష్‌నగర్ ఆటో అడ్డా నంబర్ వన్ కార్మికుల సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చెలికాని శ్రీనివాస్ మాట్లాడుతూ అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి జీవనం సాగిస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పిల్లలకు ఉపకార వేతనాలు, పింఛన్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేల జీవనభృతి ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, విడిభాగాల ధరలు పెరగడంతో ఆటో కార్మికుల జీవనం భారంగా మారిందన్నారు. ఆటో కార్మికుల ఉపాధికి నష్టం కలిగించే విధంగా ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టడం, ఓలా, ఉబర్ వంటి యాప్ ఆధారిత సంస్థలను ప్రోత్సహించడం నిలిపివేయాలని కోరారు. అనంతరం గణేష్‌నగర్ ఆటో అడ్డా నంబర్ వన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ. వెంకటేష్, కార్యదర్శిగా ఎం. శివ, కోశాధికారిగా ఎ. నాగరాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం.డి. షాబుద్దీన్, ఎ. శ్రీనివాస్, టి. సంపత్, పి. ఆంజనేయులు, సహాయ కార్యదర్శులుగా టి. మల్లేశం, ఎస్. సంతోష్, ఎం. దేవయ్య, సలహాదారులుగా జి. కనకయ్య, వి. కుమార్, ప్రచార కార్యదర్శులుగా బి. అజేయ్, ఎం. శ్రావణ్ శ్రీనివాస్ తదితరులు ఎన్నికయ్యారు.

# ఇద్దరు నిందితులకు రూ.10 వేల జరిమానా

దోమ ఆగస్టు 25 (జనంసాక్షి) : పౌల్ట్రీ ఫామ్ బాట విషయంలో ఇద్దరి నిందితులకు కోర్టు రూ.10 వేల జరిమానా విధించింది. ఎస్ఐ వసంత్ జాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండల, పరిధిలోని మోత్కూర్ గ్రామంలో గ్రామానికి చెందిన బోయిని నర్సింహులు, అతని కుమారుడు శివప్రసాద్ గ్రామానికి చెందిన బోయిని సారంగి, బోయిని రాములు ఇద్దరు వ్యక్తులు 2019 నవంబర్ 3వ తేదిన గొడవ పడ్డారు. అట్టి విషయంపై రాములు పోలిసులకు ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ వి. సురేశ్ ఇద్దరి నిందితులపై 448,324,506, 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తదనంతరం పరిగి జేఎఫ్ సీఎం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, మంగళవారం వాదోపవాదనలు విన్న జెఎఫ్సీఎం న్యాయమూర్తి నాగుల శిల్ప తీర్పును వెలువరించింది. సారంగి, రాములును దోషులుగా చేరుస్తూ, ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పునా మొత్తం రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది.

# కమ్యూనిస్టు యోధుడు మల్లారెడ్డికి ఎర్రెర్రని వీడ్కోలు

- కడసారి చూపు కోసం కదలొచ్చిన రైతాంగ నేతలు, అన్నదాతలు
- వేలాది మందితో ఎంబీ భవన్ నుంచి గాంధీ ఆస్పత్రి వరకు అంతిమయాత్ర
- గాంధీ మెడికల్ కాలేజీకి ఆయన పార్థివ దేహం అప్పగింత



**సికింద్రాబాద్ (జనంసాక్షి) :** సారంపల్లి మల్లారెడ్డి నీకు సలాములయ్యా...మీ తరమెల్లిపోతుందయ్యా.. మా చేయి పట్టి నడిపేదెవరయ్యా...మీలాంటి నేతలు మళ్లీ మళ్లీ పుట్టాలయ్యా... కార్మిక కర్షక రాజ్యం రావాలయ్యా...సమసమాజ స్థాపన జరగాలయ్యా" అంటూ కమ్యూనిస్టు యోధుడు సారంపల్లి మల్లారెడ్డికి రైతాంగం కన్నీటి వీడ్కోలు పలికింది. రైతాంగ ఉద్యమాల గురువు భావించే మల్లారెడ్డిని కడసారి చూసేందుకు హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయానికి అన్నదాతలు, రైతు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు పెద్ద ఎత్తున కదలొచ్చారు. చివరి చూపు కోసం వచ్చిన ప్రతి ఒక్కరి కండ్లలోనూ 'మొన్నటిదాకా నవ్వుతూ పలుకరించిన నేత.. మన కోసం ఇంతగా పోరాడిన మనిషి ఇక లేడా' అని ఆయన పార్థివదేహంపై పుష్పాంజలి ఘటిస్తూ తీవ్ర భావోద్వేగాలకు లోనయ్యారు. నవ్వుతూ మాట్లాడే ఆ విజ్ఞానఖని దేహం నిర్జీవంగా ఉండటాన్ని చూసి తట్టుకోలేకపోయారు. కన్నీటి చుక్కలు జాలువారాయి. మాట్లాడేందుకు నోటిమాట రాక మౌనందాల్చారు. కష్టకాలంలో అండగా నిలిచిన ఆ యోధునికి కడసారి చేతులెత్తి వీడ్కోలు పలికేందుకు వేలాది మంది అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఆ పెద్ద మనిషికి వీడ్కోలు చెబుతూ బరువైన హృదయంతోనూ ప్రతీ గొంతూ నినదించింది. తన జీవితాన్ని ప్రజల కోసం అంకితం చేసిన మల్లారెడ్డి చివరి మజిలీ కూడా ఒక సందేశంగా మారింది. పార్థీవదేహాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించడంతో మరణాన్నీ సమాజ సేవకే అంకితం చేసినట్టు అయింది. మల్లారెడ్డి లేరనే నిజం ఎంత చేదైనా రైతుల కోసం ఆయన చేసిన పోరాటం ఎప్పటికీ స్మరణీయమే..ఆచరణీయమే. ఆయన అడుగుజాడల్లో నడిచే ప్రతి రైతులో, ఆయన మాటను గుర్తుచేసుకునే ప్రతి మనసులో, అన్నదాత హక్కుల కోసం ఎగిసే ప్రతి గొంతులో... సారంపల్లి మల్లారెడ్డి జీవించే ఉంటారు. రైతుల క్షేమం కోసం ఆయన రగిలించిన స్ఫూర్తి యువతరానికి ఆదర్శ ప్రాయంగా నిలువనున్నది.



# సర్వాయి పాపన్న టూరిజం ప్రాజెక్ట్ త్వరలో ప్రారంభం

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తీసుకొస్తా : మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



**సైదాపూర్, ఆగస్టు 25 (జనం సాక్షి):** సర్వాయి పేటలో రూ.4.5 కోట్లతో అభివృద్ధి చేస్తున్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ టూరిజం ప్రాజెక్టును త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలిపారు. పల్లె పల్లెకు పొన్నం అన్న--ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా సర్వాయి పేట, పెర్కపల్లి, ఆకునూర్, వెంకటేశ్వరపల్లి, ఘనపూర్ గ్రామాల్లో మంత్రి పర్యటించారు. సర్వాయి పేట కోటకు మరమ్మతులు చేసి పునఃనిర్మిస్తామని చెప్పారు. గ్రామంలో రూ.11.25 కోట్లతో రహదారి అభివృద్ధి, రూ.55 లక్షలతో అంతర్గత రోడ్ల పనులు చేపట్టినట్లు తెలిపారు. సర్వాయి పేటలో డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళు లర్పించారు. పశువైద్య శిబిరాన్ని ప్రారంభించి, ఏర్వాల జ్యోతి నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను సమీక్షించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్క నాటి సంరక్షించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్నామని, జీరో డెత్ లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీవో యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాడ కొండల్ రెడ్డి, సైదాపూర్ సహకార సంఘం అధ్యక్షుడు కొత్త తిరుపతి రెడ్డి, సర్పంచులు, జిల్లా, మండల అధికారులు, నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఘనంగా ఓనం

**కరీంనగర్ అర్బన్, ఆగస్టు 25 (జనంసాక్షి) :** కేరళలో అత్యంత వైభవంగా జరుపుకునే ముఖ్యమైన పండుగ ఓనం పండుగని, ఇది మహాబలి చక్రవర్తి జ్ఞాపకార్థం, ఆయన ప్రజల పై చూపిన ప్రేమకు ప్రత్యేకంగా భావిస్తారని ఒక గొప్ప నమ్మకం. ఈ పండుగ పంటల పండుగగా ప్రసిద్ధ చెందినదని పాఠశాల నిర్వాహకులు స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఓనం పండుగ పురస్కరించుకొని ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఓనం పంటల పండుగగా ప్రసిద్ధి చెందినదని, ఇళ్ళ ముందు పూలతో అందంగా ఏర్పాటు చేస్తారని అదేవిధంగా పడవల పోటీలు ఓనం వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని వారు చెప్పారు. పాఠశాలలో ఓనం పండుగ పురస్కరించుకొని ప్రత్యేక వేడుకలకు విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో విచ్చేసి వేడుకలకు వన్నె తెచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పండుగల ద్వారా అష్టైశ్వర్యాలతో పాటు ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని వారు తెలిపారు. భారతదేశం అనేక రకాల పండుగలకు గొప్ప నిలయమని, పండగల ద్వారా మన భారతదేశంలో నేటికీ ఐక్యత కొనసాగుతుందని వారు కొనియాడారు. ఓనం పండుగ సందర్భంగా ప్రాంగణాన్ని చాలా చక్కగా అలంకరించి పండుగ వాతావరణాన్ని రెట్టింపు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతో చెంచు జాతులు కనుమరుగు

## ఐటీడీఏకు రెగ్యులర్ పీఓను నియమించాలి : ముర్ల రమేష్‌రెడ్డి



**అచ్చంపేట రూరల్, ఆగస్టు 25 (జనం సాక్షి):** చెంచుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరులోని ఐటీడీఏ (పీవీటీజీ) కార్యాలయం ఎదుట మంగళవారం రాష్ట్ర ఆదివాసీ చెంచు ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆదివాసీ సంఘాల నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఐటీడీఏకు ఇప్పటివరకు రెగ్యులర్ ప్రాజెక్టు అధికారిని నియమించకపోవడంతో పాటు, అవసరమైన స్థాయిలో సిబ్బందిని కూడా కేటాయించలేదని వారు ఆరోపించారు. దీంతో చెంచుల సంక్షేమ పథకాల అమలు, సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. గతంలో అమలు చేసిన విధంగానే చెంచులకు ప్రత్యేక ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి, విద్య, వైద్యం, జీవనోపాధి తదితర రంగాల్లో చెంచులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వాలు తమ సమస్యలను పట్టించుకోకపోవడంతో చెంచు సమాజంలోని కొన్ని తెగలు అంతరించే దశకు చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టి వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలని కోరారు. ధర్నాలో చెంచు, తోటి, కోలం, కొండారెడ్డి తెగలకు చెందిన ఆదివాసీ ప్రతినిధులు పాల్గొన్నారు. చెంచు ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముర్ల రమేష్‌రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మడారి మంజుల, వర్కింగ్ సెక్రటరీ కురిసెంగ వేణు, తోటి సంఘం నాయకులు నైతం రమేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# త్రైక్వాండోలో ముగ్గురు అన్నాచెల్లెళ్ల సత్తా

## ఒకే కుటుంబం నుంచి మూడు బంగారు పతకాలు.. రామంతపూర్‌కు గర్వకారణం


**ఉప్పల్ / రామంతపూర్, ఆగస్టు 25 (జనంసాక్షి) :** ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు త్రైక్వాండో పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ఏకంగా మూడు బంగారు పతకాలు సాధించి సత్తాచాటారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ తమ తల్లిదండ్రులకు, విద్యాసంస్థకు, రామంతపూర్ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు. రామంతపూర్‌లో శ్రీచరణ్ పాలీ క్లినిక్ నిర్వహిస్తున్న వైద్య దంపతులు డాక్టర్ యు. కిషన్, డాక్టర్ చైతన్యల ముగ్గురు పిల్లలు ఈ ఘనత సాధించారు. తొమ్మిదో తరగతి చదువుతున్న కుమారుడు శ్రీచరణ్, ఐదో తరగతి చదువుతున్న కుమార్తెలు సమీక్ష, సుదీక్ష హైదరాబాద్‌లో ఫిట్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఫస్ట్ వరల్డ్ ఓపెన్ త్రైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో ముగ్గురూ తమ ప్రతిభను ప్రదర్శిస్తూ ప్రత్యర్థులపై ఆధిపత్యం కనబరిచి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు ఒకే పోటీలో పాల్గొని ముగ్గురూ స్వర్ణ పతకాలు సాధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వైద్య వృత్తిలో కొనసాగుతున్న డాక్టర్ యు. కిషన్, డాక్టర్ చైతన్య దంపతులు తమ పిల్లలకు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంపొందిస్తూ ప్రోత్సహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. చిన్న వయసులోనే క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో త్రైక్వాండోలో శిక్షణ పొందుతూ ముగ్గురు చిన్నారులు సాధించిన విజయం ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తిదాయకమని అన్నారు.

# యజమానులను మోసం చేస్తున్న నిందితుడి అరెస్ట్

- రూ.36.99 లక్షల మోసాలు వెలుగులోకి 23 కేసులు,
- 6 సైబర్ ఫిర్యాదుల్లో నిందితుడి ప్రమేయం గుర్తింపు

**వరంగల్ బ్యూరో, ఆగస్టు 25 (జనం సాక్షి)**

నకిలీ క్యాటరింగ్ కాంట్రాక్టులు, ఆహార సరఫరా అవకాశాల పేరుతో హాస్టల్ యజమానులను మోసం చేస్తున్న అంతర్‌జిల్లా సైబర్ మోసగాడిని హన్మకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం వరంగల్ సిపి శ్వేత ఐపీఎస్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు నిందితుడు ప్రముఖ ఐటీ కంపెనీ ప్రతినిధిగా పరిచయం చేసుకుని, కంపెనీ ఉద్యోగులకు ఆహారం సరఫరా చేసే క్యాటరింగ్ కాంట్రాక్టులు ఇప్పిస్తానని నమ్మించి పలువురి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. హన్మకొండ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడిని అరెస్ట్ చేయగా, తెలంగాణ రాష్ట్రంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన పలు మోసపూరిత కేసుల్లో అతని ప్రమేయం బయటపడింది.



**నిందితుడి నేర విధానం :** నిందితుడు హాస్టల్ బోర్డులపై ఉన్న మొబైల్ నంబర్లను సేకరించి, వివిధ నంబర్ల ద్వారా హాస్టల్ యజమానులను సంప్రదించే వాడు. తాను ప్రముఖ కంపెనీ ఉద్యోగినని లేదా ప్రతినిధినని పరిచయం చేసుకుని, ఆ కంపెనీ ఉద్యోగులకు ఆహారం సరఫరా చేసేందుకు క్యాటరింగ్ కాంట్రాక్టులు ఇప్పిస్తానని నమ్మించే వాడు. అనంతరం అగ్రిమెంట్ ఛార్జీలు, రిజిస్ట్రేషన్ ఫీజులు, క్యాటరింగ్ సామగ్రి కొనుగోలు, ఇతర ఖర్చుల పేరుతో బాధితుల నుంచి డబ్బులు బ్యాంకు ఖాతాలు లేదా యూపీఐ ఖాతాలకు బదిలీ చేయించు కునేవాడు. డబ్బులు అందుకున్న తర్వాత మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడం లేదా నంబర్ మార్చడం ద్వారా బాధితులకు అందుబాటులో లేకుండా పోయేవాడు. కొన్ని సందర్భాల్లో ఇతరుల ఖాతాలను ఉపయోగించి, అవి కంపెనీ సిబ్బందికి సంబంధించిన ఖాతాలని తప్పుడు సమాచారం ఇచ్చి డబ్బులు బదిలీ చేయించుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. వసూలు చేసిన డబ్బులో కొంత మొత్తాన్ని వ్యక్తిగత అవసరాలకు వినియోగించడంతో పాటు, కొంత మొత్తాన్ని ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లో కోల్పోయినట్లు పోలీసులు గుర్తించారు. పలు జిల్లాల్లో కేసులువరంగల్ కమిషనరేట్ పరిధిలో 10 కేసుల్లో నిందితుడి ప్రమేయం గుర్తించబడింది. అదేవిధంగా ఖమ్మం, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాల్లో మరో 7 కేసులు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటివరకు నమోదైన కేసుల్లో మొత్తం రూ.33,33,950/- నష్టం జరిగినట్లు గుర్తించగా, రూ.12,40,657/- మొత్తాన్ని హోల్డ్ చేశారు. అదనంగా ఎఫ్ ఐ ఆర్ నమోదు కాకుండా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో నమోదైన మరో 6 ఫిర్యాదుల్లో రూ.3,65,050/- నష్టం జరిగినట్లు గుర్తించారు. వాటిలో రూ.68,430/- హోల్డ్ చేయబడింది. అన్ని కేసులు, సైబర్ ఫిర్యాదులను కలిపి ఇప్పటివరకు మొత్తం రూ.36,99,000/- నష్టం జరిగినట్లు గుర్తించగా, రూ.13,09,087/- మొత్తాన్ని హోల్డ్ చేయడంలో పోలీసులు సఫలమయ్యారు.

# మహిళా సంఘాల భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్తన్న

**రేగొండ(కొత్తపల్లి గోరి), ఆగస్టు 25 (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గంలోని కొత్తపల్లి గోరి మండలంలో సుల్తాన్‌పూర్, కొత్తపల్లి గోరి, చిన్నకోడపాక గ్రామాల రైతు వేదికలలో నిర్వహించిన కార్యక్రమాల్లో మంగళవారం భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని అనేక ప్రజాహిత కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అనంతరం జగ్గయ్యపేట, సుల్తాన్‌పూర్, గోరుకొత్తపల్లి, చిన్న కోడెపాక, చెన్నాపూర్ గ్రామాల్లో మహిళా సంఘాలకు సంబంధించిన వివో భవనాల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారతకు స్వయం సహాయక



సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# లక్షలాది మంది జీవితాల్లో జ్ఞానదీపం వెలిగించిన ప్రకాష్ మణి దాది

## మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్, ఆగస్టు 25:** లక్షలాది మంది జీవితాల్లో జ్ఞానదీపాన్ని వెలిగించిన కరుణామూర్తి ప్రకాష్ మణి దాది అని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ప్రకాష్ మణి దాది స్మృతి దినం సందర్భంగా వెస్ట్ మారేడ్‌పల్లిలోని బ్రహ్మకుమారీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సికింద్రాబాద్ బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి మంజు ఎమ్మెల్యే చేతికి రాఖీ కట్టి స్వీట్ తినిపించారు. ప్రపంచ నలుమూలలా శాంతి, ప్రేమ, ఆధ్యాత్మిక కాంతిని పంచిన మహనీయురాలు ప్రకాష్ మణి దాది అని తలసాని కొనియాడారు. ఆమె సేవలు, ఆధ్యాత్మిక బోధనలు ఎంతోమంది జీవితాల్లో స్ఫూర్తిని నింపాయని పేర్కొన్నారు. ప్రకాష్ మణి దాది స్మృతి దినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు ఎమ్మెల్యేకు వివరించారు. సేకరించిన రక్తాన్ని బ్లడ్ బ్యాంకుల ద్వారా అత్యవసరంగా అవసరమైన వారికి అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ గండయ్య, సత్యనారాయణ, రంజన్ తదితరులు పాల్గొన్నారు.

## భూకబ్జాపై పోలీసులకు ఫిర్యాదు

- పొలంలోకి అక్రమంగా ప్రవేశించి చెట్ల తొలగింపు
- దాడికి యత్నించి,కులం పేరుతో దూషించి బెదిరించారంటూ ఫిర్యాదు



**కల్వకుర్తి, ఆగస్టు 25 (జనంసాక్షి) :** కల్వకుర్తి పట్టణానికి చెందిన పంబల సుధాకర్ తన పొలంలోకి కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి కబ్జాకు యత్నిస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 743/ఇలో తనకు 3.38 ఎకరాల పొలం ఉందని సుధాకర్ తెలిపారు. తన పొలంలోకి కొందరు వ్యక్తులు జేసీబీలతో ప్రవేశించి చెట్లనుతొలగిస్తున్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లినట్లు చెప్పారు.పొలంలో చెట్ల తొలగింపు విషయమై జేసీబీ డ్రైవర్‌ను ప్రశ్నించగా,అక్కడ ఉన్న కొందరు వ్యక్తులు తనపై దురుసుగా ప్రవర్తించి దాడికి యత్నించారని సుధాకర్ ఆరోపించారు. అంతేకాకుండా కులం పేరుతో దూషించి చంపుతామని బెదిరించినట్లు పేర్కొన్నారు. తన పొలంలోకి అక్రమంగా ప్రవేశించి, తనపై దాడికి యత్నించి, కులం పేరుతో దూషించినవారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులనుకోరినట్లు తెలిపారు.ఈ ఘటననేపథ్యంలోపొలంవద్ద ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.సమాచారం అందుకున్నపోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.ఇదే విషయమై ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు అందినట్లు పోలీసులు తెలిపారు.

## వలస కూలీ అనుమానాస్పద మృతి

- అనాథగా మారిన జీవితం



**గద్వాల, ఆగస్టు 25 (జనం సాక్షి) :** బతుకుదెరువు కోసం సొంతూరు వదిలి వచ్చి ఏళ్లుగా గద్వాలలోనే జీవనం సాగిస్తున్న ఓ వలస కూలీ అనుమానాస్పదంగా మృతి చెందాడు.గద్వాల మండలం అనంతపురం గ్రామ శివారులో గుంటూరు జిల్లాకు చెందిన అశోక్ (45) మృతి చెందాడు. కొత్త ఇళ్లకు అరలు నిర్మిస్తూ, కూలి పనులు చేసుకుంటూ గత కొన్నేళ్లుగా అదే గ్రామంలో ఉంటున్నాడు. ఒంటరిగా ఉంటూ కష్టపడి పనిచేసే అశోక్ మృతదేహంపై గాయాలు ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.సమాచారం అందుకున్న గద్వాల రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. సొంత ఊరికి దూరంగా, కుటుంబానికి దూరంగా బతుకు పోరాటం చేసిన అశోక్ మృతి గ్రామంలో విషాదాన్ని నింపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

### మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్



**మునిపల్లి, ఆగస్టు 25 (జనం సాక్షి) :** తెలంగాణ మంజీరా రైతు సమాఖ్య ఆధ్వర్యంలో మునిపల్లి మండలంలోని కంకోల్ గ్రామంలో రైతుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వం రైతులు వినియోగించే ఎరువుల ధరలను విపరీతంగా పెంచి రైతులపై అదనపు భారం మోపిందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ధరణి పోర్టల్‌లో ఉన్న సమస్యలు భూభారతి ద్వారా పరిష్కారమవుతాయని ఆశించినప్పటికీ, ఇప్పటికీ అనేక సమస్యలు యథాతథంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. చెరకు రైతులను ఆదుకునేందుకు చెరకు కొనుగోలు ధరను టన్నుకు రూ.7,000గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అలాగే మార్కెట్‌లో ఎరువులను ముద్రిత ధర కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పృథ్వీరాజ్, వెంకట్‌రావు, బస్వరాజ్, శివన్న, పి. బస్వరాజ్, నాగేంద్రప్ప, శరణయ్య తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీసర్వే కార్యక్రమాన్ని గడువు లోగా పూర్తి చేయాలి



**సిద్దిపేట బ్యూరో, ఆగస్టు 25 (జనంసాక్షి) :** జిల్లాలో భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకమైన, పగడ్బందిగా సేవలు అందించాలని, నిర్దేశిత గడువులోగా పూర్తి చెయ్యాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సర్వే-ల్యాండ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడ్ గ్రామంలోనీ ఇదివరకు వరి కొనుగోలు నిర్వహించే ప్రాంతంలో చేస్తున్న ప్రభుత్వ భూమి రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో చేపడుతున్న భూ పునఃసర్వే కార్యక్రమాన్ని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పునఃసర్వే పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ క్రమం తప్పకుండా నివేదికలు సమర్పించాలని సూచించారు. ప్రతి లైసెన్స్‌డ్ రీ-సర్వేయర్ వారికి నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా భూ పునఃసర్వే పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా పని చేయాలని, పనుల్లో నాణ్యతతో పాటు వేగాన్ని కూడా పాటించాలని తెలిపారు. భూముల రీ-సర్వే అంటే ఇప్పటికే ఉన్న భూమి రికార్డులను, భూమి సరిహద్దులను, విస్తీర్ణాన్ని ఆధునిక సర్వే పద్ధతులతో మళ్లీ కొలిచి, రికార్డులతో సరిపోల్చే విధంగా ఈ ప్రక్రియ పగడ్బందిగా నిర్వహించాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట సర్వే ల్యాండ్ ఏడి సుదర్శన్, మండల సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల కోసం అన్నదాత అష్టకష్టాలు

- ఆన్లైన్ పేరుతో చదువుకోని రైతులకు మరిన్ని తిప్పలు
- రైతు పొలంలో ఉండాలా కేంద్రాల చుట్టూ తిరగాలా..?
- దుకాణదారులకు ఆన్లైన్ సౌకర్యం రైతులకు మాత్రం ఎందుకీ ఇబ్బందులు
- సకాలంలో ఎరువు అందకపోతే పంట నష్టమేనని అన్నదాతల ఆందోళన
- సాంకేతికత సౌకర్యం కావాలి రైతుకు భారంగా మారకూడదని విజ్ఞప్తి

**మెదక్ బ్యూరో, ఆగస్టు 25 (జనం సాక్షి) :** ఎరువుల కోసం రైతులు పడుతున్న కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటకు అవసరమైన సమయంలో ఎరువు అందాల్సి ఉండగా ఆన్లైన్ నమోదు విధానం తమకు అదనపు భారంగా మారిందని చెబుతున్నారు ముఖ్యంగా చదువుకోని రైతులు స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన లేని వృద్ధ రైతులు సాంకేతిక పరిజ్ఞానం తెలియని చిన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు. ఎరువు కావాలంటే ఆన్లైన్లో నమోదు చేసుకోవాలి నమోదు ప్రక్రియ తెలియకపోతే ఇతరుల సహాయం తీసుకోవాలి సర్వర్ సమస్యలు ఎదురైతే మళ్లీ ప్రయత్నించాలి నెట్వర్క్ లేకపోతే మరికొంత సమయం వేచి చూడాలి ఇలా ఎరువుల కోసం ప్రతి దశలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు చెబుతున్నారు పంటకు ఎరువు వేయాల్సిన సమయంలో పొలంలో ఉండాల్సిన రైతు ఆన్లైన్ నమోదు కోసం కేంద్రాల చుట్టూ తిరగాల్సి రావడం బాధాకరమని అంటున్నారు చదువుకున్నవారే కొన్ని సందర్భాల్లో ఆన్లైన్ ప్రక్రియ పూర్తి చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నప్పుడు చదువుకోని రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. రైతు చేతిలో స్మార్ట్‌ఫోన్ లేకపోయినా అతనికి ఎరువు అవసరం ఉంటుందని రైతుకు ఆన్లైన్ ప్రక్రియ తెలియకపోయినా అతను అన్నదాతేనని ప్రభుత్వం గుర్తించాలని కోరుతున్నారు. ఇదే సమయంలో ఎరువుల దుకాణాల వద్ద ఆన్లైన్ ప్రక్రియ ఎలా జరుగుతోందన్న ప్రశ్నలు కూడా రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ఎరువుల దుకాణ యజమానులు ఆన్లైన్ ప్రక్రియ నిర్వహిస్తున్నారని వారికి మాత్రం వరుసగా ఎరువుల లోడ్లు చేరుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఎరువుల సరఫరా పంపిణీ ఆన్లైన్ నమోదు విధానం మొత్తం ప్రక్రియపై పారదర్శకత ఉండాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. సాంకేతికతను రైతుకు సౌకర్యంగా అందించాల్సిన సమయంలో అదే విధానం రైతుకు అడ్డంకిగా మారకూడదని అన్నదాతలు అంటున్నారు. ఎరువు పొందేందుకు ఆన్లైన్ నమోదు తప్పనిసరి అయితే చదువుకోని రైతుల కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. రైతు స్వయంగా ఆన్లైన్ ప్రక్రియ చేయలేని పరిస్థితుల్లో అధికారుల పర్యవేక్షణలో ప్రత్యామ్నాయ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఎరువు సకాలంలో అందకపోతే పంటపై ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విత్తనాలు ఎరువులు పురుగుమందులు కూలీల ఖర్చులతో సాగు భారంగా మారిందని ఇప్పుడు అవసరమైన ఎరువును పొందేందుకు కూడా అదనపు ప్రక్రియలు ఎదుర్కోవాల్సి రావడం ఇబ్బందికరంగా ఉందని అంటున్నారు. గతంలో ఎరువుల కోసం ఇలాంటి ఆన్లైన్ ఇబ్బందులు తాము ఎదుర్కోలేదని పలువురు రైతులు గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న విధానంలో రైతులకు ఎదురవుతున్న సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో



పరిశీలించాలని కోరుతున్నారు. కార్యాలయాల్లో ఉన్న లెక్కలతో కాకుండా గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఎరువుల లభ్యత సరఫరా పంపిణీ విధానం ఆన్లైన్ నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యల పై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు. రైతుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సరళమైన విధానాన్ని అందుబాటులోకి తీసుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దుకాణాలకు చేరుతున్న ఎరువుల నిల్వలు రైతులకు అందుతున్న విధానం ఆన్లైన్ నమోదులో ఎదురవుతున్న సమస్యలపై సమగ్రంగా పరిశీలన చేయాలని కోరుతున్నారు. రైతు పంట పండించడమే ప్రధాన బాధ్యతగా ఉండాలని ఎరువు కోసం సాంకేతిక ప్రక్రియల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని అన్నదాతలు అంటున్నారు. రైతు పొలంలో ఉండాల్సిన సమయంలో ఎరువు కోసం కార్యాలయాలు కేంద్రాల చుట్టూ తిరిగే పరిస్థితికి ముగింపు పలకాలని కోరుతున్నారు. ఎరువు కోసం రైతు పడుతున్న ప్రతి ఇబ్బందిని ప్రభుత్వం గమనించి పంట అవసరానికి అనుగుణంగా ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## మక్తల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల తరలింపును ఆపాలి

- క్రీడా మైదానం కోసం పేద విద్యార్థుల భవిష్యత్తును తాకట్టు పెడతారా?
- అదే స్థలంలో నూతన భవనం నిర్మించాలి
- విద్యార్థి, యువజన సంఘాల డిమాండ్




**మక్తల్, ఆగస్టు 25 (జనంసాక్షి) :** మక్తల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను క్రీడా మైదానం (స్పోర్ట్స్ గ్రౌండ్) పేరుతో అద్దె భవనంలోకి తరలించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని పిడిఎస్యు, ఏవైఏయం, ఎస్ఎఫ్ఐ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కళాశాల తరలింపు యోచనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ క్రీడా మైదానం నిర్మాణం కోసం 600 మందికి పైగా విద్యార్థులు చదువుతున్న కళాశాలను ఇరుకైన ప్రైవేటు అద్దె భవనంలోకి మార్చడం అంటే దళిత, బహుజన, పేద విద్యార్థుల భవిష్యత్తును చీకట్లోకి నెట్టడమేనని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కళాశాల భవనం శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయని, కనీస మరుగుదొడ్ల వసతి కూడా లేదని తెలిపారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా పాత భవనాన్ని కూల్చి అదే స్థలంలో నూతన భవనం నిర్మించాలని చాలాకాలంగా కోరుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. విద్యాశాఖ లేదా ఇంటర్మీడియట్ బోర్డు నుంచి ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకుండా కళాశాల స్థలాన్ని స్పోర్ట్స్ అథారిటీకి అప్పగించే చర్యలు చేపట్టడం చట్టవిరుద్ధమని వారు పేర్కొన్నారు. క్రీడా మైదానాన్ని ప్రత్యామ్నాయ స్థలంలో నిర్మించాలని, కళాశాల స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. తరలింపును వ్యతిరేకిస్తూ ఇప్పటికే విద్యార్థులతో సంతకాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. చారిత్రక నేపథ్యం ఉన్న ప్రభుత్వ కళాశాల ఉనికిని కాపాడేందుకు ప్రజలు, పూర్వ విద్యార్థులు కలిసిరావాలని పిలుపునిచ్చారు. కళాశాలను అక్కడే కొనసాగించి కొత్త భవనం నిర్మించకపోతే రాబోయే రోజుల్లో ఐక్యంగా ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా కార్యదర్శి మహేష్, ఏవైఏయం నియోజకవర్గ అధ్యక్షులు పృథ్వీరాజ్, ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్, సంఘాల ప్రతినిధులు తల్వార్ నరేష్, అంబ్రేష్, బసవరాజు, భాస్కర్, రాధా, త్రివేణి, కృష్ణ, విష్ణు, తరుణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న హైడ్రా కూల్చివేతలు

- అంజయ్య నగర్ అక్రమార్కుల గుండెల్లో గుబులు



**శేరిలింగంపల్లి, ఆగస్టు 25 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ సర్కిల్ పరిధి అంజయ్య నగర్ లో మంగళవారం కూడా కూల్చివేతలు యధావిధిగా కొనసాగాయి. హైదరాబాద్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కూల్చివేతలు నిరాటంకంగా కొనసాగుతూ ఉండడంపట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తుండగా మరోవైపు అక్రమ నిర్మాణాల భవనదారులు మాత్రం బెంబేలెత్తిపోతున్నట్లు తెలుస్తోంది. కేవలం 50 గజాలలో 6, ఏడంతస్తుల భవనాలు నిర్మించి కోట్ల రూపాయలు దండుకుంటున్న భూ కబ్జారా ఇల్లు, దళారులు శనివారం ఏడంతస్తుల మేడ కూలిన ఘటనతో ఒక్కసారిగా కుదేలైపోయి దిక్కుతోచని స్థితిలో ఉండగా మూలిగే నక్క పై తాటికాయపడిన చందంగా సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు హైడ్రాధికారులు ఆదివారం నుండి అంజయ్య నగర్ లోని అక్రమ నిర్మాణాలను, ప్రమాదకరంగా మారిన భవనాలను ఒక్కొక్కటిగా తొలగిస్తుండడం గమనార్హం. ఈ క్రమంలోనే మంగళవారం కూడా మరో ఏడంతస్తుల భవనాన్ని హైడ్రా అధికారులు బాహుబలి జెసిబి సహాయంతో నేలమట్టం చేయడం జరిగింది. ఈ అక్రమ నిర్మాణాలకు మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉండడంతో అది ఏ బిల్డరు పాలిట శాపంగా మారుతుందో అర్థం కాక ఓవైపు భవన నిర్మాణదారులు, మరోవైపు ఇళ్లను కొనుగోలు చేసిన యజమానులు ఎవరికి చెప్పలేక అంతర్గత మధనంతో ఇబ్బంది పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

- జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 25 (జనంసాక్షి) :** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్పీ మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో పచ్చదనం పెంపొందించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా, నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా సంరక్షించి అవి ఎదిగేలా చూడాలని సూచించారు.రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన పర్యావరణాన్ని అందించాలంటే నేటి నుంచే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలి" అని ఎస్పీ అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మనం వేసే ప్రతి అడుగు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు.వన మహోత్సవం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, యువతతో పాటు ప్రతి కుటుంబం పచ్చదనం పెంపొందించడంలో భాగస్వామ్యం కావాలని ఎస్పీ కోరారు.జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశుభ్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, ఏవో కృష్ణయ్య, సీఐ శంకర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ జగన్, ఎస్సైలు రమేష్, రామ్‌లాల్, ఆర్ఎస్సైలు శివాజీ, గౌస్ పాషాతో పాటు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


## పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకుంటాం

- శక్తిలో విలీనం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- హెన్నపూర్ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆందోళన చేపట్టిన మఠం బిక్షపతి




**చౌటకూర్, ఆగస్టు 25 (జనం సాక్షి) :** పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి డిమాండ్ చేశారు. మంగళవారం చౌటకూర్ మండలం హెన్నపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా మఠం బిక్షపతి మాట్లాడుతూ పదో తరగతి అనంతరం పాలిటెక్నిక్ విద్యను ఎంచుకుంటున్న వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు.పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అందిస్తూ, తక్కువ వ్యవధిలోనే ఉద్యోగావకాశాలకు మార్గం చూపుతున్న పాలిటెక్నిక్ కోర్సులను బలహీనపరిచే ప్రయత్నాలు సరికాదన్నారు. పాలిటెక్నిక్ విద్యను 'శక్తి' కార్యక్రమంలో విలీనం చేయడం వల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ప్రత్యేక సాంకేతిక విద్యగా కొనసాగుతున్న పాలిటెక్నిక్ వ్యవస్థ స్వతంత్రత దెబ్బతింటే కోర్సుల నాణ్యత,విద్యా ప్రమాణాలు,ఉద్యోగావకాశాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు పరిశ్రమల్లో లభించే అవకాశాలు తగ్గే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జీఓ నం.97 ద్వారా పాలిటెక్నిక్ విద్యలో మార్పులు తీసుకురావడం సాంకేతిక విద్యకు నష్టం కలిగించే చర్యగా ఆయన అభివర్ణించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బాధ్యత నుంచి తప్పించుకునేందుకే పాలిటెక్నిక్ విద్యను'శక్తి' కార్యక్రమానికి అనుసంధానం చేస్తున్నారనే అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకొస్తున్న స్కిల్ యూనివర్సిటీకి ప్రాధాన్యం కల్పించేందుకు పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందని బిక్షపతి విమర్శించారు.ఇప్పటికే పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నిపుణులను తీర్చిదిద్దుతున్న పాలిటెక్నిక్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.విద్యార్థులు,తల్లిదండ్రుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పాలిటెక్నిక్ విద్యను 'శక్తి' కార్యక్రమంలో విలీనం చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో విద్యార్థులు,తల్లిదండ్రులు, ప్రజలను కలుపుకుని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

Happy Anniversary
# జనంసాక్షి 16వ వార్షికోత్సవం
నారాయణపేట్ జిల్లా ప్రత్యేక అనుబంధం
జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
26 ఆగస్టు 2026




























Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist. Telangana 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad-500034, Telangana, Editor: M.M.RAHMAN RNI No. APTEL/2013/50370